
19369

జ్యోతి

ఫిబ్రవరి.67

75.పై



STUDIO! ERANKI

అలసటా? నాకులేదు!







టైపుచేయడం అలసట కలిగించవచ్చు. కాని ఓవోమాల్ట్ ఒక కప్పు రాగితే రోజంతా టైపుచేసినా అలసట అనేది ఉండదు. రోజల్లా శ్రమపడి పనిచేసి సాయంత్రం ఇంటికి చేరేసరికి ఒక కప్పు కమ్మని ఓవోమాల్ట్ నాకోసం సిద్ధంగా వుంటుంది. సాయంకాలం సరదాగా గడపటానికి కావలసిన శక్తినీ ఉత్సాహాన్నీ అది నాకు సమకూరుస్తుంది.

నిజం, గ్రాన్యులర్ ఓవోమాల్ట్ పరిపూర్ణమైన ఆహారపానీయం. విటమిన్లు, అప్పటమైన పాలు, బార్లీ మాల్ట్ ఎక్స్ట్రాక్టు, కోకోలతో నిండివున్నదిది. తేలికగా జీర్ణమవుతుంది. పగలల్లాపడిన శ్రమ తర్వాత రాత్రి హాయిగా నిద్రపట్టి, ఆరోగ్యంగా ఉండేందుకు ఉపకరిస్తుంది.

ఓవోమాల్ట్


తయారు చేయువారు:
ఫుడ్స్ ఫాట్స్ & ఫర్టిలైజర్స్ లిమిటెడ్,
తాడేపల్లిగూడెం, ఆంధ్రప్రదేశ్.

విక్రయాల విభాగం: 115-బి, నేతాజీ సుభాస్‌చంద్రబోస్ రోడ్డు, మద్రాసు-1.

EP-FFP-19

జీవన్ టోన్

రిజిష్టర్డు నెం. 218726



జీవన్‌టోన్ ఎముకల పోగులా వున్న వారికిలావునుఇచ్చుటకు తోడ్పడును. జీవన్‌టోన్ కేవలము వనస్పతి కొవ్వు నుంచి తయారు చేయ బడినది కాని జంతువుల కొవ్వు నుండి మాత్రము కాదు.

ఎంత మంచిఆహారముతిన్నా ఎముకల పోగువలె బలహీనముగా వుండేవారికి జీవన్‌టోన్ మంచి బలాన్ని, లావును బరువును, యిచ్చును. ఆకలి లేనివారికి మంచి జీర్ణశక్తిని యిచ్చును. ఇది బలహీనత, కాళ్ళు చేతులు తేలిపోవుట, తల తిరుగుడు రక్త హీనతలను పోగొట్టి పరిపూర్ణమైన ఆరోగ్యమును పుష్టిని యిచ్చును.

శరీరము ఎరుపు ఛాయ పొందడానికి జీవన్‌టోన్‌తో టొమాటోలు తీసుకొనండి. ఆరోగ్యవంతులకు జీవన్‌టోన్ మంచిది. జీవన్‌టోన్ తీసుకొన్నప్పుడు మీకు కొంత శరీర వ్యాయామము అవసరము. కావలసిన బరువు, బలిష్ఠత చేరినవెంటనే జీవన్‌టోన్ సేవించుట నిలుపుటమంచిది. ఇతరవివరములు మందుతో పంపబడుతాయి.

వెల : 450 గ్రాములు రు. 10/- (పోస్టు ఛార్జీలు రు. 3/-లు)

Dr. VASAN,

JYOTHI HOSPITAL,

P. B. No. 1413, 32, V. N. Road, MADRAS - 17.

తొలిమాట

ఎన్నికల కాలం. మీరు మంచి హడావిడిలో వుండి వుంటారు. ఇదివరకు మిమ్మల్ని ఎప్పుడూ పలకరించనివారు, మీ ఇబ్బందుల్ని గమనించనివారు ఇప్పుడు మీరు కనబడితేచాలు "హల్లో సార్!" అని చిరునవ్వులు ఒలకబోస్తున్నారు. "కులాసాగా వున్నారా సార్" అని పలకరిస్తున్నారు. దీని అర్థం మీకు తెలిసిందే. ముళ్ళపూడి వెంకటరమణ గారి అప్పారావు "హల్లో" అంటే "అయిదు రూపాయ" లని అర్థం. మీ కివాళ ఎదురుపడిన టోపీవాలా, లేదా పోటీవాలా "హల్లో" అంటే "మీ వోటు నాకే" అని అర్థం.

మీరు బజారులో కనబడకపోతే, పనిగట్టుకుని మీ యింటికివచ్చి "హల్లో" అని పలకరించే రకరకాల పెద్దమనుషుల కుశలప్రశ్నల మధ్య మమ్మల్ని మరిచిపోకండి. ఎప్పటివలెనే మీ వోటు "జ్యోతి" కే.

(7 వ పేజీ)

* * *

"జ్యోతి"కి తమ రచనలు పంపే రచయితలకు ఒక చిన్న విజ్ఞప్తి. ఈ మధ్య సంచికలలో ఎక్కువ కథలు మేము వెయ్యలేకపోవడం మీరు గమనించే వుంటారు. ఒక కారణం— మాకు వచ్చే కథలన్నీ చాలా పెద్దవిగా వుంటున్నాయి. మూడు కథలు పట్టించేసరికి గగనమైపోతోంది. "జ్యోతి" మొదటి సంచిక (63 ఫిబ్రవరి) లో మేము పది పేజీలకు మించని కథలు పంపవలసిందిగా ఒక విజ్ఞప్తి చేశాము. ఆ విజ్ఞప్తిని పాటించడం వీలుపడలేదు. ఇప్పుడైనా మా విన్నపాన్ని మన్నించి రచయితలు పది పేజీలకు మించని చిన్నకథలే పంపి మాతో సహకరించాలని కోరుతున్నాము.



సుచిత్ర మాసపత్రిక

బకింగ్‌హామ్ పేట పోష్టు

విజయవాడ-2

విడిప్రతి వెల

75 పైసలు

ఏడాది చందా

9 రూపాయలు

సంపుటి 5

ఫిబ్రవరి 1967

సంచిక 2

మేనేజింగ్ ఎడిటర్

వి. వి. రాఘవయ్య

కుర్చీలకు, సోఫాలకు యు-ఫోమ్ అద్వితీయమైనది

ఏ రూపుకైనా మలచుకోవచ్చు
కొత్త డిజైనులలో ఏ ఆకారమైనా
తెచ్చుకోవచ్చు. ఎంత అదిమినా
మరల మామూలు రూపానికి వస్తుంది

కత్తిరించటం సులభం
ముక్కలుగా కోయవచ్చును.
కత్తిరించవచ్చును.
అంటించ వచ్చును.
రంధ్రము చేయవచ్చును.
కుట్టవచ్చును.


చాలా సౌఖ్యమైనది.
గంతువేయదు.
మీ దేహమునకు
అనుగుణ్యమైన
కోణాలలో ఒదిగిస్తుంది.
లక్షలాది గాలి బుడగలవల్ల
వాయుప్రసారం జరిగి
చల్లగా వుంటుంది.

మిక్కిలి చౌక-
ఇతర ఫోమ్
పరుపులకంటే
చాలా చౌక. సోఫా
సెట్టు ఒకటికి రు.100/-
పొదుపు చేయండి.
మీ సమీప వర్తకునితో
సంప్రదించండి.

U-FOAM

యు-ఫోమ్

సాటిలేనిది, బహుళ ప్రయోజనకారి అయిన యురితేన్ ఫోమ్



తయారు చేయువారు
యు-ఫోమ్ ప్రైవేట్ లి.
సనత్ నగర్ హైదరాబాద్-18

FDSUF444TE A

డిస్ట్రిబ్యూటర్స్:
ఇండస్ట్రియల్ సర్వీసెస్ కంబైన్స్
125, మహాత్మాగాంధీ రోడ్,
సికింద్రాబాద్, ఫోను - 75312

జ్యోతి పాఠకులకు ఒక మనవి

వెల హెచ్చింపు : 75 నుంచి 80 పైసలకు

గడచిన 26 వ తేదీతో "జ్యోతి" సచిత్ర మాసపత్రికకు నాలుగేళ్ళు వెళ్ళాయి; అయిదో ఏడు ప్రవేశించింది. తనకున్న పరిమితమైన వనరులతోనే "జ్యోతి" పాఠకులకు వినోద, విజ్ఞానాలందిస్తూ, సాహిత్యానికి యథాశక్తి సేవచేస్తూ పురోగమిస్తోంది. పాఠక మహాశయుల ప్రోత్సాహ బలంతో అది ఈనాడు 26 వేల ప్రతులతో ఆంధ్రప్రదేశ్‌లో అగ్రశ్రేణి మాసపత్రికగా రూపొందింది.

కాని "జ్యోతి" ఇతర పత్రికలవలెనే ఒక పెద్ద ఇబ్బందిని ఎదుర్కొంటోంది. ఇటీవలికాలంలో కాగితం ధర, ముద్రణ, బ్లాక్ మేకింగ్ ఖర్చులు, ఇంకా పత్రికా నిర్వహణకు అవసరమైన ఖర్చులన్నీ విపరీతంగా పెరిగాయి. ముఖ్యమైనది కాగితం ధర. ఇందు చేతనే దేశంలోని దినపత్రికలుకూడా ఇటీవల ఇంకొకసారి వెలలు పెంచక తప్పలేదు. తెలుగు దిన పత్రికలు ఏడు పైసల వెలనుంచి ఎనిమిది, పది, ఇప్పుడు పన్నెండు పైసలకు వెల పెంచాయి.

"జ్యోతి" పరిస్థితి కూడా దీనికి అతీతంగా లేదు. అందువల్ల మార్చిసంచికనుంచి విడిప్రతి వెలను 75 నుంచి 80 పైసలకు, ఏడాది చందాను రు. 9 నుంచి రు. 9-50 కు పెంచుతున్నాము. పాఠకులపై ఇది అదనపు భారం మోపగలదని తెలిసికూడా అయిష్టంగానే వెల పెంచవలసి వస్తోంది. పాఠకులు దీన్ని సహృదయంతో అర్థం చేసుకుని, సానుభూతితో సహకరించ గలరని, మా ఏజెంట్లుకూడా పూర్వంవలెనే తమ సహాయ సహకారాలు అందజేయ గలరని ఆశిస్తున్నాము.

(ప్రస్తుతపు చందాదారుల చందా మొత్తాన్ని కొత్తరేటు ప్రకారం సవరిస్తున్నాము.)

— మేనేజరు, "జ్యోతి"

రాజకీయాలు

దేశంలో ఎన్నికల కలకలం

ఎక్కడ చూసినా ఏదో సమస్య, ఏదో అలజడి, ఆందోళన, ఉద్రిక్తత. వీటితో సంక్షుభితమైన వాతావరణంలో ఈసారి నాల్గవ జనరల్ ఎన్నికలు జరగబోతున్నాయి.

రాజకీయ పక్షాలు తమ తమ ప్రచార కోలాహలాన్ని ప్రారంభించాయి. దేశ వ్యాప్తంగా కొన్ని, కొన్ని రాష్ట్రాలకుపరిమితమై, కొన్ని చాలా పార్టీలు ఎన్నికల్లో పాల్గొంటున్నాయి. ఇక ఇండిపెండెంట్లుగా నిలబడే వారిసంఖ్య చెప్పడానికి వీలు లేదు.

ఇండిపెండెంట్లు సృష్టించే గందరగోళం ఎప్పుడూ వుండేదే. ఈసారి రాజకీయ పక్షాల గందరగోళం కూడా ఎక్కువే. ఇదివరకు మొత్తం మీద ఐకమత్యంతోనే వ్యవహరిస్తూ వచ్చిన కాంగ్రెసు పార్టీలోను, కమ్యూనిస్టు పార్టీలోనుఅనైక్యం ఈ సారిచెప్పుకోదగినవిశేషం. కాంగ్రెసు దాదాపు ప్రతి రాష్ట్రంలోను చీలిపోయింది. ఎన్నికలకు చాలా ముందుగానే కాంగ్రెసు అధికార వర్గం మీద అలిగినవారు చీలిపోయి జన కాంగ్రెసు అని, జనతా కాంగ్రెసు అని ఇంకాఏవేవో పేర్లతో పోటీ పార్టీలు పెట్టారు. ఎన్నికలు దగ్గర కొచ్చేసరికి టిక్కెట్లు దొరకని కాంగ్రెసువాదులు చాలమంది పోటీ పార్టీలలో చేరడం ప్రారంభమైంది.


అలాగే కమ్యూనిస్టు పార్టీ రెండుగా విడిపోయి చాలకాలమైంది. ఎన్నికల కోసం సర్దుబాట్లు చేసుకొనడానికి కూడా ఈ రెండింటి మధ్య అంగీకారం కుదరలేదు. చాలా చోట్ల ఒకరి కొకరు ప్రత్యర్థులుగా నిలబడు తున్నారు.

సోషలిస్టులు ఎప్పుడూ పెద్ద ప్రతి పక్షంగా లెక్కలోకి రాలేదుగాని, వారిలో కూడా పి. ఎస్. పి., ఎస్. ఎస్. పి. లు ఒకదానికి ఒకటి

పోటీ పడుతున్నాయి. పోతే కొంచెం గట్టిగా నిలబడింది జనసంఘం, స్వతంత్ర పార్టీలు.

ఆంధ్రరాష్ట్రానికి సంబంధించి నంతవరకు చూస్తే ఒక విచిత్ర విషయం కనిపిస్తుంది. కొన్ని ఇతర రాష్ట్రాలలోలాగా కాంగ్రెసునుంచి అసంతృప్తులెవరూ రాజీనామా పెట్టడం, వేరేపార్టీ పెట్టడం జరగలేదు. కాని, కాంగ్రెసుముసుగులోనే వుండి గుద్దులాటలు ప్రారంభించారు. అయోధ్య, సయోధ్య వర్గాలు ఇంకా అలాగే వున్నాయి. ఎవరికి దొరికిన టిక్కెట్లు వారు చేతపట్టుకుని రంగంలోకి దిగారు. అయితే ఎన్నికల తరవాత ఏ వర్గం అధికారంలోకి వస్తుందో అనే భయం రెండింటికి వుంది. ఒకవర్గం అభ్యర్థులను ఓడించాలని మరొకవర్గం ప్రయత్నిస్తోంది. ఇది చాలా నియోజకవర్గాలలో జరుగుతోంది. కొన్నిచోట్ల బాహాటంగా, మరికొన్ని చోట్ల చాటుగా ఒకరికి వ్యతిరేకంగా ఒకరు ప్రచారం చేస్తున్నారు. ఇండిపెండెంట్ అభ్యర్థులను స్వయంగా నిలబెట్టడమో, అదివరకే నిలబడిన వారిని బలపరచడమో జరుగుతోంది. కాంగ్రెసు ఎన్నికల ప్రచారానికి కూడా ఇదే ఇబ్బందిగా వుంది. ఈ విభేదాలను మరచిపోయి వోట్లు అడగడంకూడా కష్టంగా వుంది. ముఖ్యమంత్రి కొన్నిచోట్ల ప్రసంగాలలో తన ప్రత్యర్థి వర్గం నాయకులను మనసులో పెట్టుకుని అన్యాపదేశంగా విమర్శలు చేశారు.

అయినా తాము మెజారిటీ పార్టీగా రాకతప్పదనే భరోసా కాంగ్రెసువారికి వుంది. అసెంబ్లీ,



లోక్‌సభ సీట్లు అన్నిటికీ వారి అభ్యర్థులు నిలబడుతున్నారు. సగానికి ఏ కొంచెమో ఎక్కువ రాక పోతాయా అని వారి ధీమా. మొత్తం 287 సీట్లకు 1000 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. దాదాపు సీటుకు ఆరుగురు చొప్పున పోటీ చేస్తున్నారు. కాంగ్రెసుపట్ల వ్యతిరేకత బాగానేవున్నా, వ్యతిరేకపు ఓట్లు కమ్యూనిస్టు మితవాద, అతివాదుల మధ్య, స్వతంత్ర, జనసంఘ, ఇండిపెండెంట్ల మధ్య చీలిపోక తప్పదు. అందువల్ల ఏదో విధంగా కాంగ్రెసే నెగ్గుతుందని చెప్పవచ్చు.

ఇదే పరిస్థితి చాలారాష్ట్రాలలో వుంది. రెండేరకాలఓట్లు.కాంగ్రెస్‌వి, దానికి వ్యతిరేకమైనవి. ప్రతిపక్షాల సంఖ్య చాలా ఎక్కువ. ఏదీ కాంగ్రెసుతో దీటు రాగలిగిందిలేదు. అందువల్ల కాంగ్రెసుకు వ్యతిరేకమైన ఓట్లన్నీ చీలిపోతాయి. కాంగ్రెసులో చీలికలున్నా దాని బలాన్ని మరీ కుంగదీసేట్టుగా లేవు. కనుక మెజారిటీ కాంగ్రెసుకే వస్తుంది. కాని కేరళ, బెంగాల్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లాంటి కొన్ని రాష్ట్రాల పరిస్థితి చెప్పలేము. అక్కడ కాంగ్రెసుకుమెజారిటీరాకపోవచ్చునని పరిశీలకులు భావిస్తున్నారు.

కాంగ్రెసుకు మెజారిటీ రాకపోతే, మిశ్రమ ప్రభుత్వా లేర్పడితే గందరగోళం తప్పదు. కాంగ్రెసు మెజారిటీ ప్రభుత్వాలు వుండగానే ఇంత అవ్యవస్థ దేశంలో ఏర్పడగా, ఇక ప్రతిపక్షాల కలగూరగంప ప్రభుత్వాలు వస్తే చెప్పనక్కర లేదు.

ఈనాడు దేశానికి కావలసింది కేంద్రంలోను, రాష్ట్రాలలోను సుస్థిర ప్రభుత్వాలు. ఏ పార్టీవైనా సరే, నిలకడగా వుండి, అధికారం పోతుందేమో ననే భయం లేకుండా పనిచేసే ప్రభుత్వాలు. ఆర్థికంగా దేశం చితికిపోతోంది. ఆహార సమస్య పెనుభూతంలాగా భయపెడుతోంది. విద్యార్థుల దగ్గిర్నించి, ఎన్. జి. ఓ. ల దాకా ప్రజలలో అన్ని వర్గాలలో క్రమశిక్షణ తగ్గిపోతోంది. ఈ సమయంలో దృఢమైన ప్రభుత్వాలు లేకపోతే ఈ సమస్యలను పరిష్కరించేదెవరు? చేపట్టిన వ్యవసాయ, పారిశ్రామిక కార్యక్రమాలను జంకుగొంకు లేకుండా నిర్వహించేప్రభుత్వాలు ఈనాడుకావాలి.

అటువంటి ప్రభుత్వాలనుస్థాపించడానికి వీలుగా ప్రజలు తమ తీర్పు ఇవ్వబోతున్నారా? తాను వేసే ఓటుకు వున్న ఆర్థిక, రాజకీయ ప్రాధాన్యం గుర్తించే ప్రతివాడు ఎన్నికలలో పాల్గొంటున్నాడా? భారత ప్రజాస్వామ్యం ఆ స్థాయికి ఎదిగిందా? లేక, ఇంకా కుల, మత వర్గ, స్వార్థ ప్రయోజనాల సంకుచితత్వంలోనే చిక్కుపడి వుందా? ఇదే మరో రెండు మూడువారాల్లో తేలబోతోంది.

***



బెర్నార్డ్ షా ఛలోక్తులు

బెర్నార్డ్ షా 1894లో ఆర్మ్స్ అండ్ ది మాన్ (ఆయుధాలు, మానవుడు) అనే నాటకం వ్రాశాడు. ఆయనకి అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చిన మొట్టమొదటి నాటకం అదే.

ఆ నాటకం ప్రదర్శించిన మొదటి రాత్రి. ప్రదర్శన ముగిసింది. ప్రేక్షకులు నాటక రచయితను స్టేజీమీదికి రావలసిందిగా బలవంతం చేస్తున్నారు. ఇక తప్పదనుకుని షా స్టేజి మీదికి వచ్చాడు. ప్రేక్షకుల హర్షధ్వానాలతో హాలు మారుమోగి పోయింది. సద్దు మణిగిన తర్వాత గ్యాలరీనుంచి "బూ!" అని వెక్కిరిస్తూ ఒక గొంతు వినబడింది. షా ఆ వైపు చూస్తూ "ఆ గొంతు ఎవరిదో గాని వారితో నేను పూర్తిగా ఏకీభవిస్తున్నాను. కాని, బ్రదర్! మన ఇద్దరి మాట ఎవరు వినిపించుకుంటారు, ఇంత మందికి నాటకం నచ్చిన తరవాత?" అన్నాడు.

ఈ విధంగా మాటకు మాట చురక వేయడంలో షా ఆరితేరినవాడు. అతని పేరిట ఎన్ని ఛలోక్తులు ప్రచారంలోకి వచ్చాయో లెక్క లేదు.

ఇండియాలో ప్రథమ స్వాతంత్ర్య యుద్ధం జరగడానికి ఏడాది ముందు— 1856 జులై 26 వ తేదీన డబ్లిన్‌లో షా జన్మించాడు. ఇండియాకు స్వాతంత్ర్యం వచ్చిన మూడేళ్ళ

తర్వాత 1950 నవంబరు 2 వ తేదీన అతడు మరణించాడు. ఇంత సుదీర్ఘ కాలం జీవించడమే కాదు, దానిలో ఎక్కువ భాగాన్ని— అంటే షేక్‌స్పియర్ జీవిత కాలం కంటె ఎక్కువ కాలాన్ని— నాటక రచనా వ్యాసంగంలో షా గడిపాడు.

మొదట నవలా రచనతో మొదలు పెట్టాడు. అది గిట్టుబాటు కాలేదు. తర్వాత ఎన్నో పత్రికలలో సంగీత, సాహిత్య, కళా విషయాలపై విమర్శకుడుగా గొప్ప పేరు తెచ్చుకున్నాడు. అతడు చిన్నతనంనుంచి సభాపిరికి. అటు వంటిది పట్టుపట్టి నలుగురిలో మాట్లాడడం అభ్యాసంచేసి ప్రపంచంలో గొప్ప వక్తలలో ఒకడుగా పేరు పొందాడు. 1824లో ఫేబియన్ సొసైటీ అనే సోషలిస్టు సంఘంలో చేరినప్పటి నుంచి 1895 వరకు అతడు వారానికి మూడు ఉపన్యాసాల చొప్పున చేసే వాడట. నాలుగు నిమిషాల నుంచి నాలుగు గంటల వరకు ఎంత సేపైనాసరే, సాంఘిక, రాజకీయ విద్యా వైజ్ఞానిక విషయాలలో అనర్గళంగా ఉపన్యసించేవాడు. కొన్ని వేల మంది శ్రోతలను గంటల తరబడి తన వాగ్ధాటితో, చమత్కార, హాస్య ప్రసంగాలతో మంత్ర ముగ్ధుల వలె చేసేవాడు.

నవలలు, విమర్శా వ్యాసాల వ్యాసంగం వదిలివేసి నాటక రచన లోకి అనుకోకుండా దిగాడు. 1885లోనే నాటక రచన ప్రారంభించినా 1892 లో "విడోయర్స్ హౌసెస్" అతనికి పేరు తెచ్చిన మొదటి నాటకం. అయితే అతడు తొలి రోజులలో వ్రాసిన నాటకాలు మరీ విప్లవాత్మకంగా వుండడం చేత వాటిని అడడానికి, చూడడానికి కూడా అంతగా ఇష్టపడే వారు కాదు.

1894లో "ఆర్మ్స్ అండ్ ది మాన్" నాటకంతోనే అతనికి బ్రహ్మాండమైన పేరు వచ్చింది. షేక్‌స్పియర్ తర్వాత ఇంగ్లీషు నాటకం పేరు చెప్పగానే జ్ఞాపకం వచ్చేది షా పేరే.

1893 నుంచి 1939 వరకు సగటున ఏడాదికొకటి చొప్పున 47 నాటకాలు వ్రాశాడు. 1915 నాటికి బ్రిటన్ నుంచి జపాన్ వరకు అతని పేరు తెలియని, అతని నాటకాలు ఆడని దేశం లేదు.

* * *

మరి ఇంత ప్రఖ్యాతుడైన నాటక రచయిత పై ఎందరో స్త్రీలు, ముఖ్యంగా రంగస్థల స్త్రీ తారలు బెంగెట్టుకోవడంలో ఆశ్చర్యం ఏముంది? అతడు అందగాళ్ళలో లెక్క కాకపోవచ్చు. సన్నగా, పొడుగ్గా, చూడగానే స్త్రీలను ఏమాత్రం ఆకర్షించలేనిముఖారవిందం అతనిది. ఒకసారి ఐసాడోరా డంకన్ అనే ప్రఖ్యాత నర్తకి ఇలా ఉత్తరం వ్రాసిందట: "మన మిద్దరం పెళ్ళి చేసుకుందాం. మనకు

మీ తెలివితేటలు, నా అందం గల కొడుకు పుట్టవచ్చు." దీనికి షా సమాధాన మిచ్చాడట: 'అలా జరిగితే మంచిదేగాని, నా అందం, మీ తెలివితేటలు గల కొడుకు పుడితేనో?"

* * *

షా గొప్ప నాటక రచయితే కాక, నాటక విమర్శకుడు కూడా కనుక, ఒక యువ రచయిత ఒకసారి తన నాటకాన్ని తీసుకువచ్చి దాన్ని వినవలసిందిగా షాను వేధించుకు తిన్నాడట. షా సరేనని ఒప్పుకున్నాడు. యువ రచయిత రెండో అంకం ఇంకా పూర్తి చెయ్యక ముందే ఒక గురక వినిపించింది. తలెత్తి చూస్తే షా నిద్ర పోతున్నాడు. రచయిత షాను తట్టి లేపి "మీ గురకను వినడానికి కాదు, మీ అభిప్రాయం వినడానికి వచ్చాను" అన్నాడట.

"గురక మాత్రం అభిప్రాయం కాదంటావా?" అని షా జవాబిచ్చాడు.

* * *

ఒకావిడ ఒక విందులో షాతో మాట్లాడుతూ, ఒక అందమైన యువతి గురించి తెగపొగుడుతోంది.

"ఆహా! యౌవనం ఎంత అద్భుతమైంది!" అన్నదావిడ చివరికి.

"నిజమేకాని, పిల్లల్ని కనడంలో దాన్ని వృధా చేయడం ఎంతఘోరం!" అన్నాడు షా.

* * *

సెకండ్ హ్యాండ్ షాపులలో అపురూపమైన పుస్తకాలకోసం వెదకడం షా అలవాటు. ఒకనాడొక పాత పుస్తకాల షాపులో పుస్తకాలు చూస్తుంటే తన నాటకాల సంకలనం ఒకటి కంటపడింది. అది తాను ఒక స్నేహితుడికి "అభినందనలతో — జార్జి బెర్నార్డు షా" అని సంతకంపెట్టి బహూకరించిన పుస్తకం. దాన్ని అక్కడ చూసి షా కొళ్ళుమండింది దాన్ని కొనేసి "మళ్ళీ అభినందనలతో" అని రాసి, మళ్ళీ సంతకం పెట్టి ఆ స్నేహితుడికే పంపించాడట

* * *

"ఎట్ హోం" అనే మాటను ఇంగ్లీషులో ఇంటివద్ద వుండడం అనే అర్థంలోకాక ఆతిథ్య మివ్వడం అనే అర్థంలో ఉపయోగిస్తారు. సాహిత్యంపై కంటె సాహిత్య కారులను పరిచయం చేసుకోవడంపై ఎక్కువ ఆసక్తికల ఒక గొప్పఇంటి స్త్రీ షాను తన ఇంటికి విందుకు ఆహ్వానిస్తూ "నేను గురువారం సాయంత్రం నాలుగు – ఆరు మధ్య ఇంటివద్ద (ఎట్ హోం) వుంటాను" అని చీటీ వ్రాసిందట. తన రచనలే మోతనేమో తప్ప ఎప్పుడూ ఇల్లు కదలని షా


Remy

అచీటీ మీదనే 'నేనూ అంతే' అని జవాబు వ్రాసి పంపించాడు

* * *

మాటకు మాట అంటించడంలో ఎంత ఘటికుడైనా ఒకసారి మాత్రం పైన చెప్పినావిడ లాంటిదే మరో కావిడవద్ద షాఎదురుదెబ్బ తిన్నాడు. ఆవిడ కూడా ఇలాగే తన ఇంటికి విందుకు ఆహ్వానించిందట. దానికి షా సమాధానంగా టెలిగ్రాము పంపుతూ "నా అలవాట్లు అందరికీ తెలిసినవే. వాటిమీద మీరు దాడి చేయదగినంత అపరాధం నేనేం చేశాను?" అన్నాడట.

* * *

దానికి ఆవిడ తిరుగు టెలిగ్రాములో "మీ అలవాట్లను గురించి నాకేమీ తెలియదు. అవి మీ ప్రవర్తన అంత అసభ్యంగా వుండవని ఆశిస్తాను !!" అని జవాబిచ్చిందట.

షా చిన్నతనంలోను, యౌవనంలోను చాలా బీదరికం అనుభవించాడు. అతనికి బీదరికం అంటే విపరీతమైన భయం. "దారిద్ర్యం మహాపాపం" అన్నది అతని సుభాషితాలలో ఒకటి. నాటక రచయితగా పేరుపొందాక అతడు లక్షలకు లక్షలు ధనం గడిచాడు. నాటకాల మీద అతడు వ్యాపారం చేశాడు. గొప్ప రచయితలలో అతనివలె వ్యాపార రహస్యాలు తెలిసినవారు ఇంకొకరు లేరని చెప్పవచ్చు. ప్రతి పైస దగ్గిర బేరమాడిగాని ఒక ప్రదర్శనలకు, వాటిని సినిమాలుగా తియ్యడానికి అంగీకరించేవాడు కాదు.

తన ధనాశతో సహా ఆటోగ్రాఫ్ ఇవ్వడానికి షా మాటకు డాలరు చొప్పున పుచ్చుకొనేవాడట. ఒక అమెరికన్ షాకు ఒకే డాలరు మనీ ఆర్డరు పంపిస్తూ ఏదైనా ఒక సందేశం ఇమ్మని కోరాడట. అతనికి షా ఇచ్చిన సందేశం "థాంక్స్"

* *

కొత్త రచయితలు ఎవరు వద్దకు వచ్చినా షా "క్లుప్తంగా రాయండి" అని సలహా ఇచ్చేవాడట. ఒకసారి ఒక స్నేహితునితో లండన్ వీధులలో నడుస్తూ "మనం రాసేదిగాని, మాట్లాడేదిగాని క్లుప్తంగా వుంటే అంతబావుంటుంది" అని ఈ విషయంమే మాట్లాడుతున్నాడు. ఇంతలో ఒక యువ రచయిత ఎదురై కరస్పర్శ చేయడానికి చేయిచాచి "మిష్టర్ షా! నన్ను రాత్స చైల్డ్ అంటారు" అని తనను తాను పరిచయం చేసుకున్నాడు.

"గుడ్‌బై మిస్టర్ రాత్స చైల్డ్" అని చెయ్యి వూపుతూ షా వెంటనే ముందుకు కదిలి పోయాడు.

"ఇదే క్లుప్తంగా మాట్లాడటమంటే" అని షా తన మిత్రుడితో చెప్పాడట.

* * *

షా తండ్రి వ్యాపారస్థుడు. బహుశా వ్యాపార కళ తండ్రినుంచి వారసత్వంగా షాకు అబ్బి వుంటుంది. అతని తల్లి సంగీత విద్వాంసురాలు. అతనికి సంగీతాభిరుచి తల్లివద్దనుంచి వచ్చివుంటుంది. కొన్ని కొన్ని షా నాటకాలు సంగీత రూపకాలవలె (అపెరాలు) వుంటాయి. అతని "ఆర్మ్స్ అండ్ ది మాన్" నాటకం "చోకలెట్ సోల్జర్" అనే పేరుతో సంగీత రూపకంగా అనువదించబడి చాలా ప్రశస్తి పొందింది. ఇటీవల అతని "పిగ్మాలియన్" నాటకం "మై ఫెయిర్ లేడీ" పేరుతో అమెరికాలో అపూర్వ విజయం పొందింది. ఆ తర్వాత అది సంగీత చలన చిత్రంగా కూడా విజయం పొందింది.

*   *   *

షా నాటకాలలో కథ కంటె, పాత్రల వ్యక్తిత్వంకంటె, సంఘటనల కంటె వాదోపవాదాలకుప్రాధాన్యం ఎక్కువ. కేవలం వాదోపవాదాలతో నాటకాలు వ్రాయడం అతడొకకొత్త ప్రక్రియగాప్రారంభించాడు. అయినా అవి అంతగా ప్రజాదరం పొందాయంటే అతని ప్రతిభకే అదిచెల్లింది. నాటకంలో తానివ్వదలచిన సందేశం ఎక్కడ మరుగు పడిపోతుందోనని ప్రతి నాటకానికి సుదీర్ఘమైన పీఠిక వ్రాసేవాడు. కొన్ని నాటకాల కంటె వాటి పీఠికలే ఆసక్తికరంగా వుంటాయి కూడా. దానికి కారణం ఇంగ్లీషు భాషపై అతనికి గల అధికారం, అతని అద్భుత శైలి.

తనవి నాటకాలుకావని ఎవరన్నా ఆక్షేపిస్తే "నిజమే. ఇవి సంభాషణలు, వాదాలు, చర్చలు మాత్రమే" అని సమాధానమిచ్చి తన విమర్శకులను నిరుత్తరులను చేసేవాడు.

అన్ని చాదస్తాలను తీవ్రంగా విమర్శించిన షాకు కూడా కొన్ని చాదస్తాలు లేక పోలేదు. ఉదాహరణకు షేక్స్పియర్ నాటకాలు నాటకాలేకావు పొమ్మన్నాడు. ప్రజలకు ఒక సందేశం ఇవ్వనిది ఏమి నాటకం? అన్నాడు. ఈ అభిప్రాయం ఏదో దూకుడుగా వెల్లడించింది కాదు. తాను పత్రికలలో నాటక విమర్శకుడుగా ప్రారంభమైంది మొదలు జీవితాంతం వరకు షా ఇదే అభిప్రాయం వెల్లడించే వాడు. షేక్స్పియర్ కంటె తాను, తన కంటె ఇబ్సెన్ గొప్పనాటక రచయితలని చెప్పేవాడు.

ఒక చోట షా ఇలా వ్రాశాడు:

"హోమర్ తర్వాత షేక్స్పియరంత చెత్తరాసినవాడు ఇంకొకడు లేడు. అంతకంటె సర్ వాల్టర్ స్కాట్ నయం. షేక్స్పియర్ సమాధిని తవ్వి తీసి అతనిపై రాళ్ళు రువ్వాలనిపిస్తుంది నాకు."

***

చీకటిలో వెలుగు

"హౌ ఈజ్ ది గ్రేటెస్ట్ మెజీషియన్? ... కెన్ ఎనీ బడీ ఆన్సర్?"—నిశ్శబ్దంగా ఉన్న ఆ ఇంగ్లీషు క్లాస్‌లో పరంధామయ్యగారి గొంతు ఖంగుమంటూ మ్రోగింది.

మధ్య వరసనుంచి ఒకడు లేచి "గాడ్ సర్" అన్నాడు ఆయన ముఖంలోనికి చూస్తూ. గంభీరంగా పరంధామయ్యగారొకమాటు చూసి "సిడౌన్" అన్నారు మామూలుగా. తరువాత ఏ భావాన్ని కనిపించనీయకుండా పాఠాన్ని కొనసాగించారు.

గంట కొట్టిన తర్వాత క్లాసునుంచి వస్తూ ఆలోచించుకోసాగారు పరంధామయ్యగారు "హు గాడ్? ఎవరా గాడ్? ఎక్కడున్నాడు? ... కళ్ళు మూసుకూర్చున్నాడా? ... లేకపోతే ఇన్ని అన్యాయాలూ, అనర్థాలూ జరుగుతూంటే చూస్తూ ఊరుకుంటాడా?" లోకంలోని అన్యాయాలన్నీ తన ఇంట్లో జరుగుతున్నట్లు బాధపడ్డారు.

అయిదేళ్ళు వెనక్కు వెళ్ళిన పరంధామయ్యగారి మనసు, గోదావరి తీరానఉన్న ఆయన చిన్న బంగళాను, కుటుంబాన్ని, బంగారంలాంటి మాగాణీ భూముల్ని చూచి, ఒక్కసారి ఆనందంగా పులకరించింది. కానీ, అవి ఈనాడు ఏమయ్యాయి? ఏం జరిగింది? పరంధామయ్యగారి మనసు విహ్వలమైపోయింది.

ఆ రోజు ... ఆ దుర్ముహూర్తపు రాత్రి ... ఆయన కుటుంబమంతా ఆరుబయట మంచాలు వేసుకుని హాయిగా పడుకున్నారు. పరంధామయ్యగారి మనసు ఆనందపుటంచుల్ని తాకుతున్నది. తన బిడ్డ ... తమ మొదటి నోములపంట ... రేపే వెళుతున్నాడు, అమెరికా! పి.హెచ్.డి. చేసి దిగ్విజయంగా వస్తాడు. తన కెంత గర్వం! ఎంత ఆనందం! ... తన కేం తక్కువ! ఆణిముత్యాల్లాంటి ఇద్దరు పిల్లలు. దర్జా అయిన లెక్చరర్ ఉద్యోగం. తను ఎంత అదృష్టవంతుడు! — అలోచిస్తూనే నిద్రలోకి జారారు పరంధామయ్యగారు.

ఒక రాత్రప్పుడు వచ్చింది తెలివి ... ... కాని ... అదేమిటి...

మొదటి బహుమతి రూ. 50/-

మునగవలస దుర్గాప్రసాదరావు
3వ సం. బి.ఎస్.సి. (అగ్రి),
అగ్రికల్చర్ కాలేజీ,
భువనేశ్వర్.

అంతా జలమయం... ...కొట్టుకు పోతున్నట్టు చప్పుళ్ళు ... కేకలు... తన ఇల్లేదీ! ...తానెక్కడున్నాడు!.. తన సంసారంకే?...తను మాత్రం పెద్ద దిబ్బకు మంచంతోపాటు తగుల్కొని ఉన్నాడు... ...అయ్యో!తన వారంతా మునిగి పోయారా ? భగవంతుడా! రక్షించు తండ్రీ" దుఃఖించడమే ఆయన వంతయ్యింది. తరువాత వరద తీయడంతో, తన వారిని వెతుక్కొనడంతో తనకు భార్యా, రెండవ వాడూ మాత్రం దక్కారు. అంది వచ్చిన పెద్దకొడుకు, ఫారిన్ వెడతాడనుకున్న చెట్టంతవాడూ... తన్ను నట్టేటముంచి వెళ్ళిపోయాడు. ఇరవై ఎకరాల మాగాణి కొండంత ఎత్తున ఇసుక మేటలు వేసింది. చక్కని బంగాళా..కర్రలు కూడా మిగలకుండా కొట్టుకుపోయింది వరదల్లో... ... ఎక్కడకే?...ఎక్కడా సంతోషం...? ఎక్కడా స్వర్గంకే?...ఎక్కడా దేవుడు ఎందుకా ఘోరశిక్ష తనకు... భగవంతుడు లేడు అన్న కఠోర నిశ్చయానికి తానానాడే వచ్చాడు...తన మొదటి కొడుకు గురించి దుఃఖించని క్షణం లేదు...ఆ పట్టుదలతోనే...ఆ దీక్షతోనే రెండవ వాడిని పెంచి ప్రయోజకుని చేసి, పెద్దవాని ఆశయాలకు ప్రతినిధిగా అమెరికా పంపి దేవుడిని గెలిచినంత తృప్తిగా నిట్టూర్చారు- ఆలోచన లోంచి తేరుకుని నడువ సాగారు.

* * *

పేపరు పట్టుకొని గబగబా ఇంటికొచ్చి ఆత్రుతగా ఆరాటంగా పిలిచారు పరంధామంగారు భార్యని. చూడు పార్వతీ! మన రెండోవాడు ఎప్పుడొస్తానని రాశాడు? నాకు జ్ఞాపకంలేదు...సరిగ్గా...ఎన్ని గంటలకు?...చెప్పు పార్వతీ" అంటూ గాభరాగా వణకసాగారు పరంధామయ్యగారు.

ఏమయిందండీ ?... ఎందుకలా అవుతున్నారు ... ఈవాళే...సరిగ్గా నాలుగ్గంటలకు వచ్చే ప్లేను లో వస్తానని రాశాడు... ఇంతకీ ..." అంటున్న దావిడ ... "పార్వతీ !" అంటూ భయంకరంగా అరిచారు పరంధామయ్య. "అయి పోయింది పార్వతీ ! సర్వ నాశనం జరిగింది... మన రాజు వస్తున్న ఆ విమానం కూలిపోయింది... మన జీవితాలు ఎడారులయ్యాయి ... హయ్యో ! భగవంతుడా ! ఎన్నివిధాల కక్ష సాధిస్తున్నావయ్యా" అంటూ విలపించ సాగారు. ఆనాడు రోదనలకా యిల్లు నిలయ మయింది.

క్షణాని కే వార్త వినాలో అన్న గుండెకోతతో యుగంలా గడిపారా రోజును ఆ వృద్ధ దంపతులు ... తమ జీవితాల గతేమిటి ?

మర్నాడు ఉదయానే "నాన్నా" అన్న రెండుముక్కలూ కర్ణపేయంగా సోకాయి వారి చెవులకు ... అనుమానంగా ... ఆశ గా వాకిట్లో కొచ్చిన ఆ యిరువురూ ఆశ్చర్యా

నందాలతో కొయ్యబారి పోయారు. ఏం జరిగింది నాన్నా ! ఎందుకలా అవుతున్నారు ఆశ్చర్యంగా చూశాడా ఆగాతకుడు. "బాబూ" అంటూ ఆనందంగా అతనిమీద వాలిపోయా రా దంపతులు. జరిగిన సంగతి తెలుసుకున్న రాజు నవ్వుతూ "అసలు నేను ఆ ప్లేను మిస్ అయిపోయాను. సమయానికి నా థీసీస్ బుక్స్ మరిచి పోవడంతో ఉండిపోవలసి వచ్చింది. సరే ... టికట్టు మార్చుకో వచ్చని తిరిగి వెళ్ళిపోయాను ... ఎంక్వయిరీ అయినా చెయ్యకుండా అనవసరంగా బాధపడ్డా రన్న మాట!" అంటూ ముగించాడు. "అంతా ఆ దేవుని చలవ బాబూ. ఆ పుస్తకాలు మరిచి పోవడం అంతా అతని మహిమవల్లే ! .. అతనే ఈ ప్రమాదాన్నించి నిన్ను తప్పించాడు" అన్నదతని తల్లి చేతులెత్తి కనబడని ఆ దేవ దేవునికి నమస్కరిస్తూ.

పరంధామయ్యగారు దీర్ఘంగా శూన్యంలోకి చూస్తూ "గాడ్ ... ది గ్రేటెస్ట్ మెజీషియన్" అన్నారు తేలిగ్గా నిట్టూర్చుతూ.

* * *



ఫలించని ఆదర్శాలు

బస్సు వేగంగా పోతోంది. ఆనంద్ ఆలోచనలు అంతకన్న వేగంగా ముసురుతున్నాయి. అతను వెళ్ళబోయే ఊరు ఎలా ఉంటుందో ఊహించుకున్నాడు పట్నంలో బస్సులరొద, సైకిల్ రిక్షాల గంటలు, కారు హారన్స్ విని విని విసుగెత్తి పోయింది. ఎంతోమంది రచయితలు పుస్తకాల్లో పల్లె వాతావరణాన్ని చాల ఆదర్శవంతంగా వ్రాస్తారు. పచ్చని చేలు, చెరువు నీళ్ళతో నిండి యున్నపుడు గట్టుమీద కూర్చుని సాయంకాలంలో అస్తమించబోతున్న సూర్య భగవానుని బింబం చూస్తూంటే ఎంతో అహ్లాదకరంగా ఉంటుంది. ఈ విధంగా ఆలోచించుకుంటూ ఆనంద్ అప్రయత్నముగా జేబులోంచి సిగరెట్ ప్యాకెట్ తీసి సిగరెట్ ముట్టించబోయాడు. ఇంతలో ఎదురుగా "పొగ త్రాగరాదు" అని ఉన్నబోర్డు చూసి నిస్పృహతో ప్యాకెట్‌ను జేబులోకి తోసివేశాడు.

ఆనంద్, తన కాలేజీ జీవితంలో ఎన్నోమార్లు స్టేజీ ఎక్కి పల్లెల బాగు చేయడంద్వారా కలిగే లాభాలు, ఉపన్యాసాలు ఇచ్చాడు. తనే స్వంతంగా బి.ఎస్‌సి. (ఫైనల్) అయిపోతూనే పల్లెలో ఉద్యోగం కోసం బయలుదేరాడు. సాధ్యమయినంతవరకు జీవితాన్ని ఆదర్శవంతంగా గడపాలని అతని తాపత్రయం. అదే ఉద్దేశంతోనే కోరికోరి రామాపురం "ప్రయోగ వ్యవసాయ కేంద్రము" నకు డెమాన్‌స్ట్రేటరుగా వేయించుకున్నాడు అవన్నీ ఈ రోజు తన జీవితంలో సాధ్యము చేసుకోవాలని కలలు కంటున్నాడు. ఇతని ఆలోచనలు నిలువకనేబస్సు ఒక కుదుపుతో ఆగింది.

కండక్టర్ "రామాపురం దిగండి సాబ్" అని కేకేశాడు. ఆనంద్ బస్సు దిగి చుట్టు పక్కల చూశాడు.

కాస్త దూరం "టీ స్టాల్" అనబడే పాక కనుపించింది. ఆనంద్ హోల్డాల్ చేతితో పట్టుకుని ఆ వైపు నడిచాడు.

ఒక ముసలామె కూర్చుని టీ చేస్తూంది. "అవ్వా రామాపురం ఇక్కడికెంత దూరం" అని అడిగాడు

"రెండు మైళ్ళు బాబు" అంది. అక్కడ ఒక టీ తాగి సిగరెట్ ముట్టించి హోల్డాల్ భుజంమీద వేసుకువి నడువ సాగాడు. సాయం


రెండవ బహుమతి రూ. 25/-

డి. సత్యసుబ్రహ్మణ్యం
బి ఏ. (మూడవ సంవత్సరం),
గవర్నమెంటు ఆర్ట్సు కాలేజి,
అనంతపురం.

కాలంలో ఆరుగంటలకు ఊరుచేరుకున్నాడు.

ఊరి ముందరనే ఉన్న "ప్రయోగ వ్యవసాయ కేంద్రం" అన్న "బోర్డు" చూసి లోపలికెళ్లాడు. అక్కడ ముందున్న డెమాన్‌స్ట్రేటర్‌కు తనను పరిచయం చేసుకున్నాడు. అతని పేరు శ్రీరాములు. అతను చాల సంతోషంతో రిసీవ్ చేసుకున్నాడు. ఆ తర్వాత ఇద్దరు ఊరిలోకి వెళ్ళారు. శ్రీరాములు ఆనంద్‌ను గ్రామ కరణానికి, మునసబుకు పరిచయం చేశాడు. మరునాడు శ్రీరాములు ఆనంద్‌కు ఛార్జి ఇచ్చివేసి వెళ్ళిపోయాడు.

ఆ రోజు ఆదివారం. సాయంకాలం ఆనంద్ ఊరివేపుకు బయలుదేరాడు. దారిలో ఇద్దరు ముగ్గురు రైతులు నమస్కారం చేశారు. ఆనంద్ ఆఫీసులోనే ఒక రూమ్‌లో ఉంటున్నాడు. చావడిలో కూర్చుని ఉన్న మునసబు ఆనంద్‌ను ఆహ్వానించాడు. అవీ ఇవీ మాట్లాడి పోతుండగా కరణం ఎదురై ఇంటికి తీసుకెళ్ళి కాఫీ ఇచ్చాడు. ప్రతిదినం



ఒక పూట కరణం మరో పూట మున సబ్ ఇంట్లో భోజనం చేసేవాడు. ఆ రోజు "యూరియా బాగ్స్" సప్లయి వచ్చాయి. వాటిని చూసు కుని సాయంకాలం బయటి కెళ్లాడు. వస్తుండగా మునసబ్ ఎదురై 'ఆనంద్ గారూ! యూరియా వచ్చిందటగా మాకు కాస్త చూడండి" అని వెళ్ళిపోయాడు. కర ణం నోటినుండికూడ రాత్రి భోజనం చేసేటప్పుడు ఇదే మాట వచ్చింది.

మరునాడు ఆనంద్ ఎవరింటికీ భోజనానికి వెళ్ళకూడదనుకుని, రూములో కూర్చున్నాడు. మున సబ్ గారి అబ్బాయి రెండుమార్లు వచ్చాడు. ఆరోగ్యం 'బాగోలేదని చెప్పి పంపాడు. సాయంకాలం బస్సు దగ్గరకెళ్ళి నాన్నగారికి చీటీ వ్రాసి పంపాడు. మరునాడుదయాని

చందాదార్లకు మనవి

పాత చందా దారులు తిరిగి చందా సైకం పంపే టప్పుడు మీ చందా నెంబరు, అడ్రసు వివరంగా వ్రాసి మాతో సహకరించ ప్రార్థన.

మేనేజరు, "జ్యోతి"

కల్లా ఆనంద్ ఇంట్లో పనిమనిషి స్టౌ, వంటకు కావలసిన సరంజామా తెచ్చి పడేశాడు. ఇలా పదునైదు రోజులు గడిచింది. కరణం, మున సబ్ ఇద్దరూ యూరియా విషయం హెచ్చరించారు. ఆనంద్ చెవిలో వేసుకోలేదు. యూరియా మూటలు పంచేటప్పుడు నిష్పక్షపాతంగా అందరికీ అందేట్లు చేయాలను కున్నాడు.

మరునాడు "యూరియా" మనిషి కున్న భూములనుబట్టి ఇచ్చేటట్టు నిశ్చయించుకున్నాడు. ఆ విధం గాను ఊరిలో అందరికీ తెలిపాడు. ఆరోజు నుంచి యూరియా ఇష్యూ చేయడం మొదలు పెట్టాడు. కాస్సే పటికి మునసబ్. కరణాలు ఇద్దరూ వచ్చారు. ఒక్కొక్కరికి 15 మూటలు ఇవ్వాలని అడిగారు. ఆనంద్ ఇవ్వ నన్నాడు.

ఆనంద్ మాటలు విని వారికి కోపం వచ్చింది. మరునాడు కరణం పట్నం వెళ్ళాడు. ఆరోజు ఆనంద్‌కు రిజిష్టరు కవర్ వచ్చింది. అది చించి చూశాడు. అందులోనున్న ట్రాన్స్ఫర్ ఆర్డర్స్ అతన్ని వెక్కిరిస్తూ కని పించాయి

***

ట్రాన్స్ఫర్

ఉత్తరం పోష్టుచేసి హుషారుగా రూముకి బయలుదేరాడు వేణు. అతనికి చాలా ఉత్సాహంగా వుంది. ఇంక నాలుగైదు రోజుల్లో తను సరస్వతిని చూస్తాననే వూహ అతని మనస్సుని గాల్లో తేలుస్తోంది.

తమ పెళ్ళయి రెండేళ్ళయింది. అందులో ఒక సంవత్సరం నుండీ ఎడబాటు. తను సరస్వతిని చూసి ఎన్నిరోజులయింది! రోజులేమిటి! నెల్లయ్యింది. మూడ్నెల్లు కాబోలు. పండక్కి చూశాడు.

అసలు తనమాట సరస్వతి ఎప్పుడైనా వింటేనా? మొదట్లో ఉద్యోగం చేయవద్దంటే ఎంత కోపం వచ్చింది! తనేమి అనలేదేమిటి!! ఆ ముఖం చూస్తే చాలు ఎంత కోపం వచ్చినా ఐసులా కరిగిపోతుంది. మొత్తానికి తన పంతం నెరవేర్చుకుంది. ఉద్యోగంలో చేరింది.

పోనీ తనకు ట్రాన్స్ఫర్ అయినప్పుడు "ఆ వెధవ ఉద్యోగం వద్దు సరూ! ఎందుకు లేనిపోని బెడద ఈ ట్రాన్స్ఫర్లు అవీ! నువ్వొకచోట, నేనొకచోట, ఎందుకీపాట్లు" అన్నాడు తను.

అబ్బే! తనమాట వినందే "ఆ ఏం ఫరవాలేదులెండి. మనకేమన్నా పిల్లలా! కొద్దిరోజులు కష్టపడదాం. ఉన్నది పోగొట్టుకోవడం దేనికి! కొద్ది రోజులు పోయాక ట్రాన్స్ఫర్కి "ట్రై" చేద్దాం" అంది తనకి నిజమే ననిపించింది. సరేననితను ట్రాన్స్ఫరై విజయవాడ వచ్చేసాడు.

తను ఇన్ని రోజులనుండీ ఎన్ని పాట్లుపడ్డాడు హోటలుభోజనంతో తనకేం హాయిగా అక్కగారింట్లో ఉంటుంది. అదే విషయం రాస్తే ఏలాంటి జవాబిచ్చింది! అలాగైతే తనూ హోటలు భోజనమే చేస్తుందట. తను తప్పు పని చేసాడు. చెయ్యమనవలసింది అప్పుడు తెలిసేది అమ్మాయిగారికి అయినా తిండికోసం కాకపోయినా సరస్వతి ఎడబాటుతో జీవించడం ఎంత దుర్భరం!

"మాష్టారూ! మీరు రోడ్డుమీద నడిస్తే మేము ఎలా వెళ్ళడం?"

వేణు వెనక్కి చూసాడు. తన ఆలోచనల్లో రోడ్డుమీద నడుస్తూ ప్రాయాణీకుల బ్రతుకు దుర్భరం చేసాడు. వెనకాల ఒక సైకిలు,

రెండవబహుమతి రూ. 25/-

కె. సాయిప్రసాద్
బి కాం. (ఫైనల్)
పి.ఆర్. గవర్నమెంట్ కాలేజి,
కాకినాడ.

బొనీమీద సైకిలిస్టు సరీగ్గా ముందు చక్రం తన రెండు కాళ్ళకి మధ్య రెండు అంగుళాల దూరంలో ఉంది. సైకిలిస్టు సైడుకి వెళ్ళడానికి వీల్లేకుండా వాహనాలు. ఆ ఉన్నదారి తను మూసేశాడు. మూర్తి ఫుట్ పాత్ ఎక్కాడు.

తను ప్రయత్నించగా, ప్రయత్నించగా ఇన్నాళ్ళకు ట్రాన్స్ఫర్ అయింది. తన ఉత్తరంచూసి సరస్వతి ఎంత సంతోషిస్తుందో! తన భార్య ఇంక ట్రాన్స్ఫర్కోసం ప్రయత్నించ నక్కరలేదు. ఇద్దరూ కాకినాడలోనే ఉద్యోగం చేయవచ్చు. సరస్వతి ఎంత దూరదృష్టితో చెప్పింది. లేకపోతే తన తొందరపాటువల్ల బంగారం లాంటి ఉద్యోగం పోను.

ఆలోచనల్లో రెండు మలుపులు తిరిగి రూము చేరుకున్నాడు వేణు. రూము తాళంతీసి లోపలకు వెళ్ళబోతుండగా పోష్టుమాను వచ్చాడు. సంతకం చేయించుకుని ఒక 'ఎక్స్ప్రెస్' ఉత్తరం ఇచ్చాడు. అది సరస్వతి వ్రాసింది. కవరుచింపి దానిని ఉత్సాహంతో చదవడం ప్రారంభించాడు వేణు. దానిలో ఇలా ఉంది.


ప్రియమైన శ్రీవారికి,

నమస్కరించి మీ సరస్వతి వ్రాయునది. ఇక్కడ అంతా క్షేమం. మీ క్షేమ సమాచారములు వ్రాయగోర్తాను. నేను ఈ ఉత్తరంలో మంచి శుభవార్త వ్రాయబోతున్నాను. దానికి నాకు ఏం ప్రెజెంట్ చేస్తారో చూస్తాను.

నాకు ట్రాన్స్ఫర్ అయింది. ఏం ఆశ్చర్యపోతున్నారా! నిజంగా అయింది. ఎక్కడికో కాదు, మీ దగ్గరికే. నేను ట్రాన్స్ఫర్కోసం ట్రై చేస్తున్నానంటె ఇంతకు మునుపు మీరు నమ్మారా? ఇప్పుడు ముందు ట్రాన్స్ఫర్ అయింది ఎవరికో చూశారా! నాకు మాత్రం మీ దగ్గరికి రావాలని ఉండదా! సరేకాని నేను నాలుగు రోజుల్లో వస్తున్నాను. వచ్చేముందు మీకు టెలిగ్రాం ఇస్తాను. స్టేషనుకిరండి. మర్చిపోవద్దు అక్క, బావ, మిమ్మల్ని అడిగినట్లు చెప్పమన్నారు. వెంటనే జవాబు వ్రాయండి. ఉంటాను మరి,

మీ సరస్వతి.

***



తెలుగు

కృష్ణాజిల్లా రచయితల మహాసభ

జనవరి 8వ తేదీ ఆదివారం. విజయవాడలో కృష్ణాజిల్లా తెలుగు రచయితల మహాసభ మహా వైభవంగా జరిగింది. రైస్ మిల్లర్స్ హాలు ఆనాడు పెళ్ళిపందిరిలా కలకలలాడింది.

మహాసభ నిర్వాహకులు అంతకు ముందొక నెలరోజులనుంచి చాలా శ్రమ తీసుకుని అన్ని ఏర్పాట్లను జాగ్రత్తగా ముందేచేసి వుంచినందువల్ల సమావేశాలు, సదస్సులు ఏ తభావతు రాకుండా జయప్రదంగా జరిగాయి. సుమారు రెండువందల మంది ప్రతినిధులు జిల్లాలో అన్ని ప్రాంతాల నుంచి హాజరయ్యారు. సభను ప్రారంభించిన శ్రీ నార్ల వెంకటేశ్వరరావు గారు తమ ఉపన్యాసంలో అన్నారు: "కృష్ణాజిల్లా నుంచి రచయితల ప్రతినిధులే రెండువందల మందిరాగా, రచయితలు ఏ రెండు వేలమందో వుండరా?" అని. నిజమే కావచ్చు.

ఆనాడు మధ్యాహ్నం ప్రతినిధులు సమావేశమై తమ సమస్యల్ని చర్చించారు. వారు చేసిన ఒక తీర్మానం ముఖ్యంగా పేర్కొనదగింది. జిల్లాలోని తెలుగు రచయితలకు ఒక సహకార ప్రచురణ సంస్థ నెలకొల్పాలని వారు తీర్మానించారు.

తీర్మానం బావుందిగాని, అమలులోకివస్తే మరింత బావుంటుంది. సహకార సంస్థలకు ప్రభుత్వం సహాయం చేస్తోంది. ఆ సహాయమేదో పుచ్చుకుని, ఒక ప్రచురణ సంస్థ, ఒక ప్రెస్సు వగైరా హంగులన్నీ ఏర్పాటుచేసుకుంటే బాగానే వుంటుంది. రచయితలకు, ప్రచురణకర్తలకు మధ్య ప్రచ్ఛన్నయుద్ధం మొదటి నుంచి జరుగుతున్నదే. ఈ యుద్ధాన్ని అంతం చేయడానికి, రచయితలకు వారు కోరుతున్న, ప్రస్తుతం తమకు లభించలేదనుకుంటున్న న్యాయం చేకూరడానికి ఈ సహకార ప్రచురణ సంస్థ తోడ్పడితే మంచిదే.

కాని, రాజకీయవేత్తల్లాగానే రచయితలు కూడా "ఇండివిడ్యువలిస్టులు". ఏ ఒక్క రచయితా మరొకడితో కలవడం కష్టం. రచయితల మధ్య స్పర్ధలు, అనుమానాలు రావడం కంటె సులభమైంది ఇంకోటి లేదు. ఇలాంటి ఆలోచనలు ఇదివరలో ఆంధ్రదేశంలో ఎన్నో జరక్కపోలేదు. మద్రాసులో తెలుగు రచయితలకికూడా కొన్నేళ్ళ కిందట ఇలాంటి సదుద్దేశమే కలిగింది కాని,

సాగి రాలేదు. ఏదీ ఫలించలేదు. ఇది కూడా అలాగే అవుతుందా? మహాసభను నిర్వహించిన యువ రచయితల ఉత్సాహం, కలుపుగోరు తనం, శ్రమించి పనిచేసే లక్షణం, పట్టుదల—ఇవన్నీ చూస్తుంటే అలా జరగవలసిన అవసరం లేదనే ఆశా భావం కలుగుతున్నది. అయితే, వారికి జిల్లాలోని ఇతర రచయితలు ఇచ్చే సహకారంమీద కూడా ఈ సహకార సంస్థ సాగిరావడం ఆధార పడి వుంటుంది.

మహాసభ సందర్భంగా జరిగిన విశేషాలలో చెప్పుకోదగినవి సదస్సులు. ఈ సదస్సులలో కొందరు రచయితలు, తదితరులు వివిధ సాహిత్య విషయాలపై తమ అభిప్రాయాలు, విమర్శలు వివరిస్తూ కొన్ని "పేపర్లు" చదివారు. జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి, నాగళ్ళ గురుప్రసాదరావు, రెంటాల గోపాల కృష్ణ, మహీధర రామమోహన రావు, నండూరి రామమోహన రావు, వీరాజీ, చెరుకుపల్లి జమదగ్ని శర్మ, కంచి వాసుదేవరావు, వి. వి. నరసింహారావు, కాట్రగడ్డ వరసయ్య, జి. ఎస్. ఆర్. మూర్తి గార్లు సదస్సులలో స్వయంగా పాల్గొనగా, కారణాంతరాలవల్ల రాలేకపోయిన తుమ్మల వెంకట రామయ్య, బందా కనకలింగేశ్వర రావుగార్లు పంపిన ప్రసంగ వ్యాసాలను ఇతరులు చదివి వినిపించడం జరిగింది. సదస్సులకు నిడమర్తి ఉమా రాజేశ్వరరావు, ఆదివిష్ణు, పి. సుబ్బారావు, పెద్దిభొట్ల సుబ్బ రామయ్యగార్లు కన్వీనర్లుగా వ్యవహరించారు.

తెలుగు ప్రాచీన, ఆధునిక, అభ్యుదయ కవిత్వాలు, నవలలు, కథలు, నాటకాలు, పత్రికా రచన, సినిమా మొదలైన విషయాలపై జరిగిన ఈ ఉపన్యాస గోష్ఠులు ఆసక్తికరంగానే జరిగాయనడానికి ఒక నిదర్శనం: ప్రొద్దున ఎనిమిదింటికి ప్రారంభమై రాత్రి పదిగంటలవరకు జరిగిన మహాసభలో జనం ఎప్పుడు చూసినా నిండుగానే వుండడం, ప్రసంగాలను ఓపికగా, ప్రశాంతంగా, ఉత్సాహంగా వినడం. సభ చివరిలో శ్రోతలు ప్రేక్షకులుగా కూడామారి ఫోన్స్ రిక్రియేషన్ క్లబ్ వారు ప్రదర్శించిన ఆదివిష్ణు గారి "మంచుతెర" నాటకం తిలకించారు.

విజయవాడ ముఖ్యంగా వ్యాపారస్థలంగానే పేరు పొందింది. రైళ్ళకు, బస్సులకు, సినిమాల శత దినోత్సవాలకు కూడలి. ఆంధ్ర దేశానికి అది వ్యాపార రాజధాని. అయినా, సాహిత్య సమావేశానికి కూడా అంతమంది జనం హాజరు కావడం, శ్రద్ధగా కూర్చోవడం ముచ్చటపడదగిన విషయం.


ఆ సభకు హాజరైన ఈ విలేఖరికి ఒక పగటికల వచ్చింది. ఇలాగే ఆంధ్రదేశంలోని ప్రతి జిల్లా ముఖ్య

పట్టణంలోను వరసగా రచయితల మహాసభలు జరిగితే ఎంత బావుంటుంది! కొంతకదలిక రాకపోతుందా? ప్రతి జిల్లాలోను కలిగే అలాంటి కదలిక చివరకొక రాష్ట్ర రచయితల మహాసభగా మారితే, దానినుంచి ఒక శాశ్వత సంస్థ ఉద్భవిస్తే ఎంత బావుంటుంది! ఆ సంస్థకు రచయితల సంస్థ అనో, సమితి అనో, పరిషత్తు అనో తప్ప వేరే "లేబెల్" ఏమీ వుండకూడదు అన్ని దృక్పథాల వారు, సిద్ధాంత భేదాలవారు దానిలో చేరాలి విశ్వనాథ వారి నుంచి విశ్వేశ్వర రావు గారి దాకా అన్ని వయస్సులవారు, అన్ని మనస్సులవారు దానిలో సభ్యులుగా వుండాలి వీరంతా ఒకరినుంచి ఒకరు నేర్చుకుంటూ, వాదిస్తూ, ఒకరి స్వేచ్ఛను ఒకరు మన్నిస్తూ, ఒకరి భావాలను మరొకరుగౌరవిస్తూవుండడంతోపాటు ఆంధ్రదేశంలోని రచయితలకు ఒక కామన్ ప్లాట్‌ఫారంను సృష్టించి, ఏదైనా నిర్మాణాత్మకమైన కార్యాన్ని సాధించగలిగితే ఇంకెంత బావుంటుంది!

ఇది పగటికలే దీనికి స్పష్టమైన, సజీవమైన ఆకారం కల్పించడం కష్టమే కాని, యువకులు, ఉత్సాహవంతులైన కొందరు రచయితలు కలిస్తే, కృషిచేస్తే, ఇది ఎన్నటికైనా సాధ్యమైతే బావుండును

—ఒక విలేఖరి

***



రోచిర్లీల

హవిస్

ఎక్కడ చూశాను నిన్ను?

పౌష్యశ్రీ ప్రతినిధిగా
మురిసే ముద్దబంతిలో,
సంధ్యాకాశం చేలాంచలాన
విరిసే పారాణి ప్రభల్లో,
జీవన రాగంలో
మామకానురాగంలో—

శిశిరోదయపు చలి గుబుళ్ళలో,
వాణికే పండుటాకు వెనక,
నక్కిన దొండపండు చూపి
నీ అధరమే ననుకున్నాను!

ఒంటరిగా వెలిగే వేగుచుక్కను చూసి,
నువ్వు నాకేసి కన్ను గీటేవనుకున్నాను!

ఎంతటి నిజం?

జీవన మరణాల చీకటి వెలుగుల్లో,
ప్రకృతి పురుషుల్లో నిలిచి వెలిగే నీ జ్యోతిని
చూడలేని, కళ్ళున్న గుడ్డివాళ్ళకి,
పురిట్లోనే సంధి కొట్టిన ఆత్మలకి, కనిపించని నువ్వు,
నాకు సాక్షాత్కరించటం, ఎంత నిజం?

ఎంత గర్వంనాకు?

తాజ్ మహల్

ఏపా అందరికీ తెలిసిన తాజ్ మహల్ గురించి కాదు నే నిప్పుడు చెప్పబోయేది—

ముంతాజ్, షాజహాన్‌ల అమర ప్రేమ, ఎర్రటి సాయంకాలపు ఆకాశాన్ని ధిక్కరించే తెల్లటి—స్వచ్ఛమయిన రెండు మనస్సులకు అభిజ్ఞ, అపూర్వ ప్రేమానురాగాలకు అమూల్యమైన ప్రతీక, చరిత్ర చెక్కిలి మీద ఘనీభవించిన అందమైన కన్నీటి చుక్క—యీ తాజ్ మహల్ గురించి కాదు నే నిప్పుడు చెప్పదలచుకొన్నది—

ఆగ్రా ప్రయాణాన్నీ, ఓ వర్షాకాలంలోని 24 గంటల అనుభవాన్ని గుర్తు తెచ్చుకున్నప్పుడల్లా జ్ఞాపకం వచ్చేది బూడిదరంగు ఆకాశం, పాలరాతి కట్టడపు ఔన్నత్యం, యమునా నది నిండుతనం కాదు—

ఓ చిన్న పూరిగుడిసె, ఎర్రకోట మలుపులో ఓ మురికిపేటకు వంద గజాల దూరంలో దట్టంగా పెరిగిన చెట్లూ, నందాలాల్, వాడి పొట్టి భార్య, ఓ కుంటి గుర్రం, ఓ పాత గుర్రబ్బగ్గీ – ఇవీ గుర్తుకొస్తాయి.

ప్రపంచ అద్భుతాల్ని నవాబుల కళాభిరుచితో, ధనంతో ముడిపెట్టక మనస్సు విశాలత్వంతో, ప్రేమ ఔన్నత్యంతో కొలిస్తే నేను చూసిన తాజ్ మహల్ ప్రపంచ అద్భుతాల్లో ఎనిమిదవది అయి తీరుతుంది.

ఇది మరో తాజ్ మహల్ – దీని గురించే నేనిప్పుడు చెప్ప బోతున్నాను.

* * *

ఆ రోజు దురదృష్టం వరించిన లోభి హృదయంలాగ ఆకాశం బ్రద్దలయి ధారాపాతంగా వర్షిస్తోంది. కొత్తగా ఆగ్రాకి రెండు కొత్త టాక్సీలు వచ్చాయని వచ్చినప్పట్నుంచీ నాకు అర్థంకాని భాషలో 'గైడ్' పోరుతున్నాడు. కాని మేము దిగిన హొటల్ మేనేజరుకి నందాలాల్ అంటే సానుభూతిలాగుంది. ముసిలి గుర్రం వెనక బండిమీద చలిలో ముడుచు


గొల్లపూడి మారుతీరావు

కూర్చున్న వాడిని అతనే మొదట పరిచయం చేశాడు. నవ్వితే పళ్ళు ఎత్తు. నన్ను ఆశగా చూస్తూ వంగి వంగి సలాములు చేశాడు. "వీడయితే మీకు కుక్కలాగ సలాములు చేస్తాడు. వీడు ఈ ఊరికి తాజ్ మహల్ అంత పాతవాడు— తీసుకు పోండి.—" అంటూ వచ్చీరాని తెలుగులో చెప్పాడు మేనేజర్. వచ్చినప్పట్నుంచీ వీలయినంత ఘోరమయిన తెలుగులో మాట్లాడుతూ తాను తెలుగువాడినని నాకు హామీ యివ్వబోతున్నాడు. "నువ్వు కాకపోయినా యీ హోటల్ మారను లే" అంటే పళ్ళన్నీ కనిపించేలాగ నవ్వుతాడు—

• నందాలాల్ ని చూశాను. మాసిన నీలి రంగు తలపాగా, నల్ల చారల కోటు, ముణుకుల వరకూ ఎత్తి కట్టిన పంచె, పల్చటి మీసాలూ. ఆ రోజు వాడి గుర్రబ్బగ్గీని ఉపయోగించే నా నిర్ణయం మీద జీవితమంతా ఆధారపడినట్టు ఆశతో చూస్తున్నాడు. ఆ ఊరంతా వాడికి కొట్టిన పిండిగా వును. మంచినీళ్ళప్రాయంగా స్థలాల పేర్లూ, వాటి ప్రాశస్త్యం చెప్తున్నాడు. మాట్లాడుతుంటే చిన్న నత్తి ఉన్నట్టు అనిపించింది. మధ్య మధ్య ఆగుతూ, ఏదో ఆలోచనతో నిలిచిపోయిన ముఖం పెట్టి, నాలిక సరిచేసుకొని మరోమాట పేరుస్తాడు— రాజకీయ నాయకుడిలాగ. మన దేశంలో మంత్రి కావలసిన అర్హతలున్న మనిషి— యిన్ని వందల మైళ్ళ దూరంలో గుర్రబ్బగ్గీ తోలుకుంటున్నాడని దిగులేసింది!

ఇదంతా మా ఆవిడ గమనిస్తున్నట్టుంది గావును — మెల్లగా నా పక్కకి వచ్చి "పోన్లెండి, వాడినే బండి కట్టమనండి. నెమ్మదిగా ఊరంతా తిరిగి రావచ్చు" అంది. ఆవిడ మాటలు అర్థం కాకపోయినా, ధోరణి అర్థం చేసుకున్నట్టున్నాడు. ఆమెకి వంగి వంగి సలాములు చేస్తున్నాడు. సేవకులకు వరాలిచ్చిన రాణిలాగ మా ఆవిడ చిరునవ్వు నవ్వుతోంది. "సరే రా" అన్నాను. అంతే విన్నాడు. మరి అక్కడ నిలబడలేదు. ఏదో పేరుపెట్టి పిలుస్తూ ఒక్క అంగలో హోటల్ ద్వారం దాటి పరిగెత్తాడు. కళపెళలాడే ఎండలో నిర్లక్ష్యంగా నడిచినట్టు వర్షంలోనే నడుస్తూ పోయి గుర్రాన్ని సిద్ధం చేస్తున్నాడు.

ఉత్తరాదివాళ్ళే చేసిన దక్షిణాది యిడ్లీ తిని, మా మేనేజరు మంచితనాన్ని నంచుకొని వసారాలోకి వచ్చి నిలబడేసరికి గుర్రబ్బండీ సిద్ధంగా వుంది. ముందు జీవితానికంతా రక్షణ లభించినంత ప్రశాంతంగా, నిర్మలంగా వుంది నందలాల్ మొహం. ఈసారి వాడి పక్కనే మరెవరో ఉన్నారు. చూశాను. నల్లగా, పొట్టి విగ్రహం కనిపించకుండా ముక్కుకి పెద్ద వెండి ఆభరణం. వర్షంలో కూడా కరిగిపోకుండా నుదుటన పెద్ద బొట్టు.



షేం దగ్గరికి రాగానే ముఖమంతా చీర లాక్కొని వయ్యారంగా వొంగి వొంగిసలాములు చేసింది. నవ్వుతూ 'మేరీబీబీసాబ్' అని పరిచయం చేశాడు నందాలాల్. బండిచుట్టూ దళ సరి కేన్వాసుచుట్టాడు. అయినాఏదో మూలనుంచి అవాంఛితమయిన జ్ఞాపకంలాగ వర్షంలోపలకి తొంగి చూస్తోంది. మధ్య మధ్య ఖాళీల్లోంచి నేరస్థుడి అంతరంగంలాగ రొజ్జగాలి కొరుకుతోంది.

వర్షంలో స్నానం చేస్తున్న నందాలాల్‌కీ, వాడిభార్యకీ యిదేం పట్టినట్టు లేదు. సాయంకాలానికి మే మిచ్చే డబ్బుతో రోజుగడుస్తుందన్న వేడి ఆలోచన ఆ చలిలో వాళ్ళిద్దరినీ బ్రతికించినట్టుంది.

ఒకటి రెండు వీధులు దాటుగానే ఇరుకు సందుల్లోకి వచ్చింది బండీ. విజయోత్సాహపు చిహ్నాల్ని మిగిల్చిన ఒక మహా సామ్రాజ్యపు మహా నగరంలో బ్రతుకుతూ జీవితంమీద విజయాన్ని సాధించలేని ప్రజలు వీళ్లు. ఆగ్రాలో మేం చూసిన మొదటి దృశ్యమే అది. అక్కడి రాజులు రాజ్యాల్ని జయిస్తే వీళ్లు జీవితంతో పోరాడి వీగిపోయారు. బీదరికంతో సంఘీభావం పెరుగుతుందిగావును. ఆ చలి ఉదయాన్ని అక్కడా అక్కడా కుంపట్లు చుట్టూ మనుషులు కూర్చొని ఆప్యాయంగా పలకరించుకొంటున్నారు. విచిత్రం! ఎక్కడ చూసినా ముసిలివాళ్ళే – పాదుషాల అధికారం, అజమాయిషీలక్రింద నలిగిపోయి, వంగిపోయిన పాత జ్ఞాపకాల్లాగా ఉన్నారు. నవ్వితే ఖరీదయిన విస్కీ సీసాలో మిగిలి పోయిన చివరి ఘాటు వాసనలాగ, ఎప్పుడో గొప్పగా బ్రతికిన రోజుల ఛాయలు కనిపిస్తాయి ఆ ముఖాల్లో. వాళ్ళకి ఎటువేపు తాజ్‌మహల్ ఉందో గుర్తులేదు. ఎర్రకోటలో గబ్బిలాలు ఉన్నాయో, ప్రభుత్వం ఏర్పరచిన పురాతనవస్తు ప్రదర్శనశాల వుందో తెలీదు. యమునానది వేగాన్ని మరిచిపోయి, గమనాన్ని మార్చుకొన్నదేమో అర్థం కాదు. పాత సంస్కృతికి చిహ్నాలుగా, ఆ నగరంలోని శిథిల సమాధుల వరసలో చివరగా మిగిలిపోయిన గుర్తులు వాళ్ళు.

ఆశగా రొట్టెలు తినే ముసిలివాళ్ళ బృందం ముందు బగ్గీ ఆపమంటె విరగబడి నవ్వాడు నందాలాల్. "ఇక్కడేముంది సార్ — ఇప్పుడేంలేదు—ఒకప్పుడు పాదుషాల కాలంలో — ఈ వీధుల్లో రత్నాలు అమ్మేవారట—"

ఇప్పుడక్కడ చార్‌కోల్ దుకాణం, చేతికర్రల షాపు కనిపించాయి. ఈ సారి నవ్వడం నావంతయింది.

మళ్ళీ బగ్గీ కదిలింది. వర్షం యీసారి ఎక్కువయింది. ఇంటి రేకుల మీదపడి తాగుబోతు పేలాపనలాగ

వినిపిస్తోంది. రాజుల తీవ్రతకు తట్టుకొని నిలిచిన ప్రజలు ఈ వర్షం తీవ్రతని లక్ష్యం చేస్తున్నట్టు లేదు.

బండిని ఏదో వంతెన దాటిస్తున్నాడు నందాలాల్ – వంతెనక్రింద ఎర్రటి నీటిప్రవాహం ఏమిటని అరిచాను లోపల్నుంచి. 'జమ్‌నా' అంది వాడి భార్య. గొంతు నిర్మలంగా, నిండుగా వుంది. మాక్రింద పారుతున్న ఎర్రటినది కూడా అంత నిండుగానూ వుంది. కరుణాపూరిత మయిన ఋషి అంతరంగంలాగ ప్రశాంతంగా వుంది. ప్రాపంచిక చింతలను వెక్కిరించే స్థితప్రజ్ఞుడి చిరునవ్వులాగ, మీదినుంచి కురిసే వర్షాన్ని జీర్ణించుకుంటూ నిలిచిన ఎర్రటి నీరు. ప్రవాహ గమనం అలసిన బాలింతరాలి నడకలాగ వుంది.

"ఇక్కడి నుంచి తాజ్‌మహల్ కనిపిస్తోంది సాబ్. – చూడండి." అన్నాడు నందాలాల్ –.

అటు చూశాను. మసక వేసిన ఆకాశంమీద బద్ధకంగా, కదలలేని మబ్బు తునకలాగ– దూరాన ఓ కట్టడం కనిపించింది. అదే తాజ్ మహల్ అయి వుంటుందనుకున్నాను.

తరువాత వరసగా చాలా కట్టడాలు చూపించాడు నందాలాల్. "ఇత్‌మదుద్దౌలా" అనే ఒక్కపేరే యింకా గుర్తుండి పోయింది వచ్చి పోయే యాత్రికుల ఔదార్యం మీద తమ ఉపాధిని ఏర్పరచుకొన్న బీద మహమ్మదీయుల దిగులు కళ్ళు కూడా యింకా గుర్తున్నాయి. ఆ తర్వాత దయాల్బాగ్ తీసుకు వెళ్ళిన గుర్తు.

దట్టమైన చెట్ల మధ్యనుంచి, గతుకుల రోడ్డు వెంబడే నడిపించి మరో గంటకి ఎర్రకోట దగ్గర ఆపాడు. ఆగ్రా అంటే "తాజ్‌మహల్" గుర్తు మా ఆవిడకి. ఇవన్నీ చాలా విసుగ్గా వున్నాయి. అరణ్యమంతా పరుగు తీసి, యింక కాలు కదపలేక ఆ కలితో, అలసటతో నిలిచి పోయిన ఖడ్గ మృగం శరీరంలాగ కనిపించింది ఎర్రకోట– ఆ మసక వెలుగులో మరీ దూరానికి– వర్షం తాకిడికి నలిగిపోయిన కాగితం పడవలాగ కనిపించింది.

లోపల మెట్లెక్కుతూ తనకు తెలిసిన ధోరణిలో వర్ణించడం ప్రారంభించాడు నందాలాల్ వాడి పక్క వినయం, సిగ్గు, చలితో కుంచించుకు పోయిన వాడి భార్య. అంత చలిలోనూ మా కంటె చురుకుగా అడుగులు వేస్తూ ముందుకు వురుకుతున్నాడు. వాడిని చూస్తూంటే చరిత్ర చేతుల్లో నలిగిపోయిన, మొగలాయి సంస్కృతికీ, జీవితం చేతుల్లో నలిగిపోయిన నందాలాల్‌కి తేడా లేదనిపించింది. గదినుంచి గదికి తిప్పుతూ చివరకి పాదుషా శయనాగారాన్ని చూపించాడు నందాలాల్. రాజవంశాన్ని దీవించే పెద్ద ముత్తయిదువలాగ అక్కడికి యమునానది కిటికీలోంచి కనిపి

స్తోంది. ఈ గదిలోనే పాదుషాల ముందు చరిత్రకి నాంది జరిగింది. ఇక్కడే పాదుషాల విలాసాలకు బీద ప్రజల చరిత్రలు శిథిలమయి పోయాయి. ఈ గదిలో గడిచిన ఒక అమృతక్షణంలోనే ముంతాజ్ ఒక ప్రపంచ అద్భుత నిర్మాణానికి భర్త దగ్గరనుంచి వరాన్ని పుచ్చుకొంది. ఇన్ని శతాబ్దాల తర్వాత ఒక బీద గుర్రబ్బగ్గివాడూ, ఒక సామాన్య రచయితా తమ ఆలోచనల్ని యిక్కడ పంచుకొనే అదృష్టం లభించింది మళ్ళీ యీ క్షణం రాదు అందుకని నందాలాల్ అటు తిరగ్గానే మా ఆవిడని ఒక్కసారి చేతుల్లోకి తీసుకుని ముద్దుపెట్టుకున్నాను. తెల్లబోయి ఆశ్చర్యంగా చూస్తే, "ముంతాజ్ షాజహాన్ అమర ప్రేమకు పునాది యీ గదిలోనే పడింది ఆ ప్రేమకి మన శ్రద్ధాంజలి యిది – నడువు" – అన్నాను. ఆవిడ ఒకటే నవ్వు.

ఎర్రకోటనుంచి తాజ్ మహల్ స్పష్టంగా కనిపిస్తోంది. షాజహాన్ వృద్ధాప్యంలో కొడుకు అతణ్ణి బంధించిన గదిలోంచి యింకా విచిత్రంగా కనిపిస్తోంది.

కొడుకు అలా బంధించకపోతే యమునకి అవతలి ఒడ్డున నల్లటి పాలరాతితో మరొక తాజ్ మహల్ వెలిసేదని నందాలాల్ వివరిస్తున్నాడు. నాకు మాత్రం ఆ ప్రమాదం జరగనందుకు ఎంతో సంతోషం కలిగింది. తండ్రి ప్రయత్నాన్ని మధ్యలోనే ఆపివేసిన కొడుకు అభిరుచిని మనస్సులోనే అభినందించాను. మహాద్భుతనిర్మాణం ప్రక్క అలాంటి నిర్మాణాన్నే చేయబూనడం దానిని అవమానించినట్లే అవుతుంది. అప్పుడే విరిసిన గులాబీ పువ్వు ప్రక్క మరొకటి లేనప్పుడే దాని గొప్పతనం. పునరుక్తినవ్యతను చంపేస్తుంది మేరిలిన్ మన్రో ప్రక్క అలాంటి మరొక అందకత్తెను నిలిపితే అందానికి అన్యాయం చేసినట్టే – ప్రపంచంలో ఒకే ఒక తాజ్ మహల్ ఉండాలి – దానికి సాటి మరొకటి వుండకూడదు – అన్న ఉద్దేశమే ఔరంగజేబు చర్యకు మరొక కారణమై ఉంటుంది.

మళ్ళీగుర్రబ్బగ్గిలో ప్రయాణం సాగించాం. మేం ఎదురుచూస్తున్నక్షణం వేపు గుర్రం పరిగెత్తుతోంది. మా ఆవిడకి ఒకటే ఆత్రుత. అప్పటికి అపరాహ్నం దాటింది.

తాజ్ మహల్ ప్రాంతంలోకి బండీని తీసుకువచ్చి ఆపాడు. హోరున వర్షం. ఎదురుగా పది గజాల్లో ఉన్న వస్తువుకీ మాకూ మధ్య బూడిద రంగు తెర జారినట్లు ధారలుగా కురుస్తోంది.


"ఆ మలుపు తిరిగితే తాజ్ మహల్ కనిపిస్తుంది సాబ్. ముందుకు బండి పోనివ్వరు. అక్కడ గైడ్స్ వుంటారు. చూసిరండి. మేం భోజనంచేసి సిద్ధంగా వుంటాం"

అన్నాడు నందాలాల్ వాడి భాషలో.

సరిగ్గా ఆ క్షణంలో అందరూ ఆకలిని మరిచి ముందుకు సాగితే, నందాలాల్‌కి యిప్పుడు ఆకలీ, విశ్రాంతీగుర్తుకొచ్చాయి. మనకిప్రపంచంలోకల్లా అద్భుత దృశ్యంవాడికి దైనందిన గమ్యస్థానం. మనకి వినోద యాత్ర వాడికి జీవనాధారం. తాజ్ మహల్ వాడి జీవితంలో ఒక భాగం, చరిత్ర వాడికి ఉపాధి.

అటు వేపుచూసే ఉత్సాహంకూడా చూపలేదు నందాలాల్. నేను బండి దిగగానే రొట్టెల మూట తీసి బండిలో పరుచుకొని వాడూ, భార్యా ఆప్యాయంగా తినడం ప్రారంభించారు.

ఆక్షణంలో ఆ అద్భుతదృశ్యాన్ని చూడడానికి మేము వర్షంలో ముద్దయిపోయాం. అన్ని దేశాల వారూ, అన్ని రాష్ట్రాలవారూ అక్కడ కనిపిస్తున్నారు. ఒక అపూర్వమయిన అనుభవాన్ని పొందాక ఏర్పడే నిర్లిప్తత, నిశ్శబ్దం – వారి కళ్ళలో ద్యోతకమవుతోంది. అన్ని మతాలూ, అన్ని భావాల సామరస్యం కళా సృష్టిలోనే సాధ్యమవుతుందిగావును. క్రైస్తవునికీ, మహమ్మదీయునికీ భూపాల రాగం ఒకే విధంగా విని పిస్తుంది. పికాసో చిత్రం, టాగూర్



గీతాంజలీ ఒకే విధమయిన భావ ప్రేరణను కలిగిస్తుంది.

నా కంటె మా ఆవిడ తొందరగా అడుగులు వేస్తోంది. తిరగవలసిన మలుపు తిరిగాం. మనస్సూ కళ్ళూ ఒక అన్యోన్యమయిన ఆనందానికి సిద్ధపడుతున్నాయి. కాని యిదేమిటి!– వర్షపు ధారల వెనక ఒక జేగురు రంగు కట్టడం కనిపిస్తోంది. పాతజ్ఞానం సాక్ష్యంతో దాన్ని తాజ్‌మహల్‌గా పోల్చుకున్నాను. వెలిసిపోయిన జ్ఞాపకం లాగ, నిర్లక్ష్యానికి గురి అయిన సంస్కృతీ చిహ్నంలాగ ఒంటరిగా కనిపించింది. ఆక్షణంలో ఎవరేనా దగ్గరికి వచ్చి "ఇది తాజ్‌మహల్ కాదు" అని చెవిలో అరిస్తే బాగున్నని పించింది. "నల్లని వాడు పద్మ నయనంబులవాడు" అని చదువుకొని, మనస్సులో మహోన్నత స్వరూపాన్ని ఊహించుకొన్నాక సినిమాలో లోతుకళ్ల నీలిరంగు కృష్ణుడిని చూసినట్టు నా ఊహలో తాజ్‌కీ, దీనికీ పోలిక లేదు! – ఊహ ఎంత మోసం చేస్తుంది! కళ కంటె కళా హృదయం ఎంత ఉన్నతమయినది!– సగుణరూపి అయిన కళకి పెరుగుదల లేదు – నిర్గుణాత్మకమయిన కళాహృదయానికి అవధి లేదు. ఊహలోని తాజ్‌మహల్ ఈ వాస్తవికత ముందు కూలి శిథిలమయిపోతోంది. గోడలు కూలిపోతున్నాయి...

మా ఆవిడ మాత్రం నోరు చప్పరిస్తూ "ఆహా!– ఎంత బాగుంది" అంటోంది. ఊహకూ వాస్తవికతకూ రాజీ కుదుర్చుకొన్న అదృష్టవంతురాలామె. అక్కడున్న అందరి అదృష్టవంతుల మధ్య నా దురదృష్టాన్ని ప్రకటించుకోవడం యిష్టం లేక, నిశ్శబ్దంగా తాజ్‌మహల్‌ని సందర్శించి వచ్చాను

నందాలాల్ సుష్టుగా భోజనం చేసి మేం వచ్చేసరికి ఒక నిద్ర కూడా తీశాడు. వాడి భార్య తాంబూలం వేసుకొంటూ మమ్మల్ని చూసి వాడిని లేపింది. గుర్రాన్ని ఝళిపిస్తూ "ఏం సాబ్. ఎలావుంది?" అన్నాడు.


జీవితంలో అన్ని కర్మలనూ ముగించుకొని సన్యాసాన్ని స్వీకరించిన యోగి, సంసారసాగరంలో తలమునకలయినవాడిని వేసిన ప్రశ్న లాగ వినిపించిందా ప్రశ్న. నేనేం సమాధానం చెప్తేనేం? బాగులేదన్నా చిరునవ్వు నవ్వి మమ్మల్ని క్షమించేంత నిబ్బరంగా ఉన్నాడు. భోజనం తర్వాత మళ్ళీ నందాలాల్ హుషారు పుంజుకొన్నాడు. ఇంకా ఏవేవో స్థలాలు చూపించాడు. కాని నాకు మాత్రం ఆ తర్వాత ఉత్సాహం చచ్చిపోయింది.

బేరం చేసిన దానికంటె ఎక్కువే యిచ్చాను వాడికి. వాడూ, వాడి కంటె భార్యా సాష్టాంగపడిపోయారు. బీదవాడి సంతోషం ఎంత చవుక! కాని, ఎంత గొప్ప!

కాని, వాళ్ళ కృతజ్ఞతలకి మా ఆవిడకి కళ్ళనీళ్ళే వచ్చాయి భాష రాదు కాని, లేకపోతే వాడి భార్యకి మంచి నేస్తం అయేది ఆ తర్వాత ఎన్నో వారాలపాటు నందలాల్‌నీ, వాడి పొట్టి భార్యనీ గుర్తు చేసుకొంటూనే వుంది

*   *   *

మళ్ళీ పదేళ్ళకి ఢిల్లీ ప్రయాణం పడింది ఆఫీసులో నలుగురిని ఢిల్లీలో ట్రయినింగుకి పంపారు అప్పుడు మళ్ళీ ఆగ్రా వెళ్ళాలని మిత్రులంతా తీర్మానించారు కాని, ఆ వర్షంలో మసకబారిన కట్టడం, ఎర్రకోట-వీటి జ్ఞాపకాలు, అప్పుడు ఏర్పడిన అభిప్రాయాలూ యింకా చెరిగిపోలేదు అందుకని ఆగ్రాకి మాత్రం రానన్నాను కాని మిత్రులుమాత్రం వదల్లేదు 'నువ్వొకసారి వెళ్ళావుకనక మాకు సుళువు పద' అన్నారు ఊహని చెరిపేసుకోవాలన్న తాపత్రయం, వాస్తవాన్ని చూసిన ఆనందంకన్న గొప్పదనుకుంటాను కాని తాజ్‌మహల్‌ చూశాక ఊహని ఊహా ప్రపంచంలోనే నిలవనిస్తేనే అపూర్వమయిన ఆనందం ఉన్నదని నిశ్చయానికి



వచ్చాను ఈ సూత్ర ప్రకారం ఛార్లీచాప్లిన్‌తో మాట్లాడడం, గ్రేటా గార్బోను ముద్దుపెట్టుకోవడం, న్యూయార్కు వీధి బార్‌లలో నీగ్రో సంగీతం వినడం నేను చస్తే చేయను—అవి నాకు అత్యంత ప్రియతమ మైనవి కనక.

మొత్తంమీద ఆగ్రా వచ్చాం. అదే మద్రాసీ హోటల్లో దిగాం. అదే మేనేజరు హోటల్లో వున్నాడు చరిత్ర మారడానికి 10ఏళ్లు చిన్న వ్యవధి—కాని జ్ఞాపకం మాయడానికి పదేళ్ళు పెద్ద అవధి. నేను గుర్తు చేశాకకాని పోల్చుకోలేకపోయాడు మేనేజరు. గుర్తు చెయ్యకుండానే పోలిక పట్టుగలిగినవాడు ఒక్కడే నందాలాల్!—నన్ను చూడగానే హోటల్ ఆవరణలోకి పరిగెత్తుకు వచ్చాడు. మొహం ఇంతయ్యింది. పదేళ్ళు వాడిని చాలా మార్చాయి. జుత్తు నెరిసింది. ఒళ్ళుబాగా వచ్చింది. మీసాలు తీసేశాడు. కనుబొమ్మలు దుబ్బుల్లాగ పెరిగాయి. కళ్ళు ఎర్రగా వున్నాయి తాగుడు ఎక్కువ అలవాటు చేసుకున్నాడుగావును. కాని గొంతులో సౌమ్యత పోలేదు. లేక నా మీద గౌరవమేమో అది. "మేమ్ సాబ్ రాలేదా సాబ్" అన్నాడు వాడి ముసిలిగుర్రం అక్కడికి కనిపిస్తోంది. మా మిత్రులకి చెప్పాను.—వీడయితే మనకన్నీ తీరికగా చూపుతాడని. కాని అప్పటికి టాక్సీలు ప్రబలంగా వున్నాయి మంచి ఇంగ్లీషు వచ్చిన గైడ్‌ని తీసుకుని కారులో పోదాం అన్నారు. వాళ్ళ సంస్కారానికి నందాలాల్ మురికి బండీ, వాడి భాష అడ్డొచ్చాయి. "వద్దంటున్నారు నందలాల్" అన్నాను. "పర్వానై సాబ్. సాయంకాలం తమ దర్శనానికి వస్తాను. ఒక అర గంట నాతో రండి" అన్నాడు. మేం వద్దన్నామని విచారంలేదు. పదేళ్ళ క్రిందటయితే దిగులు కనిపించేది. ఇప్పుడు నవ్వుతూ వున్నాడు. వయస్సు జీవితంపట్ల పిరికితనాన్ని చంపేసి ఒక వేదాంతాన్ని మిగిల్చింది. ఇప్పుడే నిండుగా వున్నాడు నందలాల్.

ఈసారి ఎండ వెలుగులో తాజ్ మహల్ కాస్త మెరుగుగా కనిపించింది. అప్పట్లో కళాసృష్టిని సానుభూతితో అంగీకరించానేకాని ఆప్యాయతతో అనుభవంలో పొదుగుకోలేదు.


సాయంకాలం తిరిగి వచ్చేరికి నందాలాల్ సిద్ధంగా ఉన్నాడు. వేడి కాఫీ తాగి వాడి గుర్రబ్బగ్గీలో బయలుదేరాను. ఇప్పుడు వాడి భాష బాగా అర్థమవుతోంది.

ఉన్నట్టుండి అడిగాను: "నీభార్య కనిపించదేం?" అంటూ. అంతే! కళ్ళ నీరు కార్చడం ప్రారంభించాడు వాడు. ఆ కథంతా చెప్పుకొచ్చాడు. మూడేళ్ళ కిందట పోయిందట అప్పటినుంచీ ఒంటరి

గానే బండి నడుపుకొంటున్నాడట. జాలేసింది నాకు. ఆ దంపతుల సమష్టి జీవనం చూసిన నాకు, ఇప్పటి నందాలాల్ ఒంటరి జీవితంలో అసమగ్రత కొట్టవచ్చినట్లు కనిపించింది. శిథిలమయిన పాదుషాల గోరీలమీదనుంచి కూడా ధైర్యంగా గమనిస్తున్న మొగలాయీ సంస్కృతి చరిత్ర, ఇవాళ సజీవ శైథిల్యాన్ని అనుభవిస్తున్న నందాలాల్ దగ్గరికొచ్చి ఆగిపోయింది. ఆగ్రా ప్రాచీన సంస్కృతీ చైతన్యంలో నందాలాల్ ఒకభాగమయితే, ఇవాళ ఆ చైతన్యం స్తంభించిపోయినట్టే కదా!

'ఎక్కడికి యిలా!' అన్నాను.

'చెప్తాను సాబ్' అంటున్నాడు. అంత దుఃఖంలోనూ వాడిని పలకరించి, వాడి కష్టాలను పరామర్శించిన నా సమక్షం కొంత మనశ్శాంతిని కలిగించడం కనిపెట్టాను. గుర్రబ్బగ్గి ఎర్రకోట మలుపు తిరిగి, ఓ నూరు గజాలు దాటి దట్టంగా పెరిగిన చెట్ల మధ్యకి వచ్చి ఆగింది. సంధ్య వెలుగు అక్కడికి జారడం లేదు. కాలగమనంతో ప్రమేయం లేని ఒక నిశ్శబ్దం ఆ ప్రాంతమంతటా ఆవరించి వుంది. మరో పది గజాలు నడిపించి ఒకచోట ఆపాడు. చుట్టూ శుభ్రంచేసి మధ్యలో తులసికోట



లాంటి కట్టడం వుంది. దానికి ఎర్ర రంగు పూశాడు. నిన్నటి పువ్వులు ఎండి గాలికి రెపరెప లాడుతున్నాయి. చుట్టూ బంతి పువ్వుల మొక్కలు పాతి ఉన్నాయి. అతి భక్తితో, వినయంతో అక్కడ ముణుకులమీద కూర్చొని తలవొంచాడు.

"ఇక్కడే సాబ్ నా భార్య పోయింది. మూడేళ్లయింది. నేనీ గుడిసెలోనే ఉంటున్నాను" అంటూ పక్కనున్న గుడిసె చూపించాడు.

దీనంగా ఆర్ద్రంగా ఆ కట్టడం వేపుచూస్తున్నాడు. నందాలాల్. విధి విధించిన శాపాన్ని నిశ్శబ్దంగా స్వీకరించి, ఆ ఒంటరితనాన్ని భార్య పట్ల కృతజ్ఞతతో నింపుకొన్నాడు. అప్పటి వాళ్ళ ఆప్యాయత, అన్యోన్యత, పొట్టి భార్య తెల్లటి చిరునవ్వు, ఇద్దరూ కలిసి కష్టాన్ని పంచుకొనే ఒద్దిక – అన్నీ గుర్తుకొచ్చాయి.

ప్రపంచమంతా దీనిని గుర్తించక పోయినా వాడికి అవసరంలేదు. వాడూ, వాడికి నచ్చిన ఆప్తులూ తెలుసుకుంటే చాలు. వాళ్ళ జ్ఞాపకాలలో ఆమెకు అమరత్వం సిద్ధింప చేశాడు. దూరంగా కనిపించే ఉన్నతమయిన కట్టడంలో భార్య పట్ల ప్రేమాను రాగాలతో పాటు, ధనం లభింప చేసిన ఠీవీ, దర్పం ఉన్నాయి. ఇక్కడ నిర్మితమయిన ఈ చిన్నకట్టడంలోనూ అంత ఔన్నత్యమూ వుంది. అంతకు మించిన ప్రేమాను రాగాలున్నాయి. కాని వాటితో పాటు బీదరికం యిచ్చిన నిరాడంబరత, విశ్రాంతీ ఉన్నాయి.

అక్కడ విశ్రమించే ప్రేమమూర్తి నలుగురిమధ్యా అనునిత్యం గుర్తింపబడే అదృష్టవంతురాలయితే, యిక్కడ విశ్రమించిన నందాలాల్ పొట్టిభార్య నలుగురి ప్రమేయం లేని ప్రశాంత సుషుప్తి ననుభవిస్తున్న అదృష్టవంతురాలు. భార్యతో సుఖాన్ని, భార్య లేని దుఃఖాన్ని తనకే మిగుల్చుకొన్న అదృష్టవంతుడు నందాలాల్. అల్లంత దూరంలో కనిపించేది ప్రపంచమంతా విస్మయంతో చూసే తాజ్ మహల్ అయితే, ఇది ఒక గుర్రపు బగ్గీవాడి హృదయాన్ని ఆర్ద్రం చేసే తాజ్ మహల్.

అప్పటి జ్ఞాపకాలు పునశ్చరణ చేసుకొంటున్నాడు గావును– ఇంకా అటువేపే నిశ్చలంగా చూస్తున్నాడు. తెలియకుండా నాకూ కళ్ల వెంట నీళ్ళొచ్చాయి.

"ఇక వెడదామా?" అన్నాను.

"నా కోసం ఇంతదూరం వచ్చారు సాబ్. నాకదే పదివేలు." అని కాళ్ళు పట్టుకున్నాడు.

తిరిగి వస్తూ అనుకున్నాను– ఈ సారి నిజమైన తాజ్ మహల్ని చూశానని–ఈ ఆగ్రా ప్రయాణంలో సార్థకత ఉన్నదనీ.

* * *



బి.వి.రమణారావు

(గత సంచిక తరువాయి)

3వ రంగం

అదే రంగస్థలం: తెర తీసేటప్పటికి ఎవరూ వుండరు. సంధ్య ప్రవేశించి ఒక క్షణం తటపటాయించి సోఫాలో కూర్చుంటుంది. ఎప్రెంటిస్ ప్రభాకరం తొంగిచూసి నెమ్మదిగా దగ్గిర కొస్తాడు.

ప్ర: క్షమించండి ఇందిరమ్మగారు యింట్లో లేరు.

సం: క్షమించండి. అసలు ఆవి డెవరు?

ప్ర: ప్లీడరుగారి భార్య.

సం: ఓహో! ఎక్కడికి కెళ్ళారు?

ప్ర: బంధువులెవరో వస్తే తీసుకు రావడానికి వూళ్ళో కెళ్ళారు.

సం: శుభం. బాగుంది. వెళ్ళి విప్పండి. మీరు....

ప్ర: నా పేరు ప్రభాకరం. ఇక్కడ ఎప్రెంటిస్ చేస్తున్నాను. ప్లీడరుగారి కోసం వచ్చారా?

సం : అవునండి.

ప్ర : ఏదైనా కేసు విషయం సంప్ర దిస్తారా ?

సం : అలాంటిదే.

ప్ర : (కొంచెం అధికార పూర్వ కంగా) విజిట క్లయింట్స్ కోసం ప్రత్యేకంగా వెయిటింగ్ రూం వుంది. మీ కభ్యంతరం లేకపోతే దయచేసి ఆ గదిలో కూర్చోండి.

సం : నా కభ్యంతరం వుంది. ఆయ నతో కొంచెం అంతరంగిక విషయాలు చర్చించాలి.

ప్ర : పోనీ కేసు వివరాలు చెబు తారా....మీ కభ్యంతరం లేకపోతే.

సం : మీ కభ్యంతరం లేకపోతే.... ప్లీడరుగారితోనే మాట్లాడతాను.

ప్ర : మీ పేరు ?

సం : సంధ్య.

ప్ర : సివిల్ కేసా, క్రిమినల్ కేసా?

సం : తెలియదండి.

ప్ర : చూడండి ! విడాకులూ, మనో వర్తి లాంటి కేసులు....

సం : నాకింకా పెళ్ళవలేదండి.

ప్ర : (నాలిక్కరుచుకుని) ఎంత మాట ! మీ స్వవిషయంలో వచ్చే రనుకోలేదు. అయితే కూర్చోండి. ప్లీడరుగారు మేడ దిగిరావడానికింకా ఆలస్యమవుతుంది. (నిష్క్రమణ)

సం : థేంక్స్.

[ప్రభాకరం వెళ్ళిపోయిన మ ఓ నిమిషానికి టైపిస్ట్ ప్రవేశం]

టై : నమస్కారం.

సం : నమస్కారం.

టై : అమ్మగారింట్లో లేరండి.

సం : అవున్ట.

టై : తమ పేరు ?

సం : సంధ్య.

టై : ఏదో కేసు విషయంలో వచ్చే రనుకుంటా. కాగితాలేమైనా తెచ్చారా ?

సం : (వ్యానిటీ బ్యాగ్ కేసి చూపెడుతూ) తెచ్చానండి. ఏం ?

టై : అవీను పదిరూపాయిలూ యిలా యివ్వండి. సకళ్ళతోనహా సిద్ధంచేసి వుంచుతాను.

సం : మీరు టైపిస్టులా ! అవసరం లేదండి.

టై : అమ్మమ్మ ! అలా అనకండి. డాక్యుమెంట్లు పీటుగా టైపు చేయించి యిస్తేతప్ప ప్లీడరుగారసలు చదవరండి. అవీను పోనీ ఐదు రూపాయిలివ్వండి. పావుగంటలో టైపుచేసి పట్టుగొస్తా.

సం : మీరు టైపూ చెయ్యొద్దు ప్రింటూ చెయ్యొద్దు. ఇవి ప్రేమలేఖలు. మి రింక ప్రశ్నలతో వేధించనంటే ఐదు రూపాయిలిస్తా.... ఇదిగో.

టై : థేంక్స్. ఎడ్వాన్సుగా మీ పేరు జమకడతాను. శలవు. (నిష్క్రమణ)

[ఓ నిముషం తర్వాత ఎదురుగా వున్న గుమ్మంలోంచి పోలయ్య

[ప్రవేశించి సంధ్యను వెనకనుంచి పరీక్షగా చూసి దగ్గిరకొస్తాడు]

పో : నమస్కారమమ్మగోరూ.

సం : నమస్కారం.

పో : అమ్మగోరు ఇంట్లో నేరండి.

సం : అవునట.

పో : అయ్యగోరి కోసమాండీ!

సం : గుడ్ హెవెన్స్! నీకూ యిన్ని ప్రశ్నలకీ సమాధానం చెప్పవలసిందే! చూడు. ఇందయీ రూపాయి పుచ్చుగో. మాట్లాడకు.

పో : జయం తల్లీ జయం. బుల్లమ్మగోరు కేసు నెగ్గినట్టున్నారు. కూకోండమ్మా. అయ్యగారొచ్చేస్తారు. (వచ్చిన దారినే నిష్క్రమణ)

[పోలయ్య వెళ్ళిపోయిన తర్వాత అలసిపోయినట్టు చేతిరుమ్మాలుతో మొహంవొత్తుకుంటూ సంధ్య మధ్య మధ్య గడియారం చూసుకుంటూ వుండగా రంగనాధం ప్రవేశం]

రం : నమస్కారమండి.

సం : నమస్కారం.

రం : అమ్మగారు అలా ....

సం : అలా వూళ్ళో కెళ్ళేరుట. చెప్పేరు విన్నాను.

రం : అయ్యగారికోసమాండి!

సం : మీరు గుమాస్తా అనుకుంటూ.

రం : అవునండి. (పుస్తకంతీసి చెవిలోంచి పెన్సిల్ తీసి) మీ పేరు?

సం : ఓ! గాడ్! చూడండి. నాదగ్గిరింకో నయాపైసాకూడా లేదు. పీడించువాడు ప్లీడరూ, ప్లీడరుగారిల్లు హైకోర్టుకు సింహద్వారం అంటారు. మొత్తం మీద న్యాయం, ధర్మం గుమ్మంలోనే కనబడుతున్నాయి.

రం : (పరాకుగా వింటూ) తమ పేరు?

సం : చూడండి. నా పుట్టు పూర్వోత్రాలూ జాతకం తాలూకు ప్రవరంతా మళ్ళీ మళ్ళీ ఇన్నిసార్లు చదవడం నా తరం కాదు. ఈ మానవ కీటకానికి ప్లీడరుగారి దర్శన భాగ్యం కలగ్గానే మనవి చేసుకుంటాను.

రం : (ఆవలిస్తూ) మీ పేరు తల్లీ. మీ పేరు?

సం : రాత్రి తెల్లవార్లూ నిద్దర్లేదనుకుంటాను. నా మొహంమీదే ఆవలిస్తున్నారు!

రం : మా ఆవిడ పోరుపడలేక రాత్రి రెండో ఆట సినిమా కెళ్ళేను.... ఆ తర్వాత ... సరే.... ఇంక నిద్ర పట్టేదుస్తుందా! ఏమిటన్నారు మీ పేరు?

సం : ఇంకా ఏమీ అనలేదు.

రం : చూడు తల్లీ! పొద్దుణ్ణుంచీ తలకాయి దిమ్మెలయిపోతోంది. బయట క్లయింట్లు యమభటుల్లాగ క్యూలో కూర్చున్నారు నన్ను పీక్కుతినడానికి. ఎవరెవరొచ్చారో లిస్టురాసి అయ్యగారికి పంపించాలి. తమ పేరు శలవిచ్చేరు కారు.

సం : సంధ్య.



రం : పూర్తి పేరు ?

సం : సంధ్య.

రం : ఇంటి పేరు తల్లీ ?

సం : గ్రీన్ కాటేజ్.

రం : (ఆవలిస్తూ) అమ్మా !

సం : గ్రీన్ కాటేజ్.

రం : ఇలాంటి యింటి పేరు కలవాళ్ళెప్పుడూ చూడలేదే ! క్రైస్తవులా ?

సం : తెలియదు.

రం : ముస్లిములా ?

సం : తెలియదు.

రం : హిందువులే !

సం : తెలియదు.

రం : అవునూ కాదూ అనాలికాని తెలియదంటా వేమిటమ్మా !

సం : అబద్ధం చెప్పి తీరాలా !

రం : అమ్మా !

సం : నాకు నిజంగా తెలియదండి.

రం : తండ్రి పేరు ?

సం : తెలియదు.

రం : తల్లి పేరు ?

సం : తెలియదు.

రం : నీ తండ్రిలాంటివాణ్ణి. ప్రొద్దున్నే నన్నిలా ఏడిపించడం ధర్మం కాదు. ఇరవై యేళ్ళ బట్టి ప్లీడరు గుమాస్తా చేస్తూ ఇంతమంది క్లయింట్లను చూశాను కాని కులం, మతం యింటి పేరూ, తల్లి తండ్రులన్నీ ఎరగని మనిషి నెప్పుడూ చూడలేదు.

రా : (మెట్లు దిగి ప్రవేశిస్తూ) పొద్దున్నే ఏమిటీ రంగనాధ విలాపం ! (సంధ్యను చూసి) ఎవరమ్మాయి వమ్మా ?

రం : ఆ విషయం చెప్పమనే బుర్ర బద్దలు కొట్టుకుంటున్నానండి.

సం : నమస్కారమండి.

రా : నమస్కారం. మా రంగనాధం వచ్చినవాళ్ళందరూ క్లయింట్లనుకుని పీడిస్తాడు....ఆఁ....ఇందిర లా వూళ్ళో కెళ్ళిందమ్మా.

సం : మీరున్నారుగా ! మీతోనే మాట్లాడతాను.

రా : (సోఫాలో కూర్చుంటూ వెళ్ళి పోతున్న రంగనాధంతో) ఐదు నిమిషాల్లో వస్తాను. (సంధ్యకేసి తిరిగి) అందమైన అమ్మాయి లొచ్చారంటే నాకు భయం. చందాలైనా వసూలు చేస్తారు. టిక్కెట్లయినా అంటగడతారు: ....ఇంతకీ ఏమిటి విశేషం !

సం : టిక్కెట్లూ చందాలకోసం

కాలేజ్లోనండి. న్యాయ వర్ధించడ నికొచ్చేను. నా పేరు సంధ్య. నేనూ చంద్రం పెళ్ళి చేసుకుందా మనుకుంటున్నాం.

రా : ఓ నువ్వేనా ! మా అబ్బాయి చెప్పాడు.

సం : ఏం చెప్పాడో అడగొచ్చునా ?

రా : మా అబ్బాయి చాలా కాలంగా నిన్ను ప్రేమిస్తున్నాడనీ. కాని నువ్వు యీ మధ్య నే వాణ్ణి ప్రేమించడం మొదలెట్టావనీ !

సం : నిజమే. (వ్యానిటీ బ్యాగ్ లోంచి రిబ్బన్‌తో కట్టిన కాగితాల కట్టి టీపాయ్ మీద పెడుతూ) ఇవి మీ అబ్బాయి నాకు రాసిన ప్రేమలేఖలు. ఇందులో ఇతరులు చదవకూడనంత రహస్యాలేమీ లేవు.

రా : ఇవి నాకెందుకూ ?

సం : మా పెళ్ళి జరిగే పక్షంలో అవి మీ దగ్గిర్నుంచి తీసుకుంటాను. లేకపోతే వాటితో నాకు పనిలేదు. మీ అబ్బాయిని గురించి మీరు తెలుసుకోవల్సిన బాధ్యత వుండి కనక వీటివల్ల మీకు ఉపయోగం వుండొచ్చు

రా : మీ యిద్దరికీ ఎలా పరిచయం అయింది ?

సం : మేమిద్దరం తరచు రేడియో నాటికలలో పాల్గొనడంద్వారా పరిచయ మయ్యింది. తర్వాత చంద్రం రాసిన పాటలు కూడా అప్పుడప్పుడు రేడియోలో పాడేను

రా : ఓహో ! మా వాడి విరహ గీతాలకి రూపకల్పనా. జీవం పోసింది నువ్వన్న మాట !

సం : ఇలాంటి అవమానాలకి సిద్ధపడే నేనిక్కడికొచ్చాను. నాకూ తల్లి తండ్రులుంటే ఈ ప్రేమలేఖల్ని చూసి చంద్రాన్నికూడా యిలాగే అవమానం చేసేవారేమో ! మీ రడిగేదానిక చెబుతున్నాను. ఇక మళ్ళీ అలాంటివి రాయనని చంద్రంచేత వాగ్దానం చేయించుకుని. నా కిష్టం లేకపోయినా పాడేను.

రా : ఎందుచేత అంత వైరాగ్యం ?

సం : వైరాగ్యం కాదు, వివేకం. ఈ ప్రణయ గీతాలూ, విరహ గీతాలూ కామవాంఛని రెచ్చగొడుతూ మనుష్యుల్ని పశువులుగా మారుస్తాయి. వీటివల్ల సమాజానికి వినోదం కంటే ప్రమాదం ఎక్కువ.

రా : మొత్తంమీద వయస్సుకు అతీతమైన మాటలు నేర్చుతున్నావు !

సం : దానికి కారణం నా పుట్టుక అనుకుంటాను. ఒళ్ళు పై తెలియని దౌర్భాగ్యపు ప్రేమికుల ప్రియుల కర్మఫలాన్ని నేను. హద్దుమీరిన ప్రణయావేశాల ప్రతిఫలానికి నేనొక చిహ్నాన్ని. స్వార్థం స్వాతిశయాలతో సర్వనాశనమవుతున్న మన సామాజిక వ్యవస్థకి నేనొక ప్రత్యక్ష సందేశాన్ని. నన్ను భూమ్మీద పడేసిన తల్లి తండ్రీ ఎవరో తెలియకపోయినా, వాళ్ళు నేర్పిన పాఠాన్ని మరచిపోలేదు

రా : అయామ్ సారీ ! చూడమ్మాయ్ ! నీ మనస్సు నొప్పించాలన్న వుద్దేశ్యంతో నేనేమీ అనలేదు.

సం : మెచ్చుకున్నా, నొచ్చుకున్నా ఇది దాచలేని సత్యం.

రా : ఇంతకీ మా వాణ్ణెలా ప్రేమించావో అర్థం కాలేదు.

సం : నాకు చాలామంది ప్రేమ లేఖలు రాసేవారు. అందులో చంద్రం ఒకడు

రా : ఏమిటీ! మా అబ్బాయి ఒకడే అనుకున్నాను.

సం : ఈ రోజుల్లో ఉద్యోగానికి అప్లికేషన్ రాయడం చేతకాకపోయినా యువతీ యువకులు బ్రహ్మాండమైన ప్రేమలేఖలు రాస్తారు.

రా : నీకున్నూ చాలా అనుభవం ఉన్నట్టుందే!

సం : వాళ్ళందరికీ చక్కని సమాధానాలు రాసేదాన్ని. నా మొదటి ఉత్తరంతోనే చాలామంది ప్రేమించడం విరమించుకునేవారు,

రా : ఏం రాసేదానివి?

సం : వాళ్ళ తల్లి తండ్రుల ఎడ్రస్ యిస్తే నేను కలుసుకుని మాట్లాడిన తర్వాత వాళ్ళు ఒప్పుకుంటే పెళ్ళి సంగతి ఆలోచిద్దాం. పెళ్ళయిన తర్వాత ప్రేమించుకుందాం అని రాసే దాన్ని. అంతే. ఆ దెబ్బతో ప్రేమకి జనగణమన....

రా : నిజంగా నీ ఉద్దేశ్యం తల్లి తండ్రులతో సంప్రదించాలనేనా!

సం : వాళ్ళ మనస్సులు నొప్పించకుండా తప్పించుకోడం మొదటి ఉద్దేశ్యం. ఇంకొకటేమిటంటే.... అందచందాల్ని చూసి ఆడదాన్ని మోహించి కన్న తల్లిదండ్రుల్ని ధిక్కరించి పెళ్ళాడానికి సిద్ధపడ్డవాడు చెయ్యలేని నేరం వుండదు. కన్న తల్లి తండ్రుల్ని ప్రేమించలేనివాడు కట్టుకున్న పెళ్ళాన్ని ప్రేమించగలడంటే.... అది ప్రేమకాదు.

రా : మావా డేమంటాడు?

సం : సంవత్సరం క్రితం వరకూ చంద్రం చాలా పెంకిఘటం. జీవితమంటే ఒక పెద్ద వినోదయాత్ర అనుకునే మనస్తత్వం. అతని మనస్సంతా ప్రేమమయం. అతని దృష్టిలో తనో సలీం. నేనో అనార్కలీ. తనో దేవదాసు. నేనో పార్వతి తనో రోమియో. నేనో జూలియట్. ఈ ప్రేమ పిచ్చి తప్ప మిగిలిన విషయాల్లో నేను గర్వించ తగ్గ స్నేహితుడు. అతనిలో వున్న ఆ లోపానికి కూడా తల్లి తండ్రుల పెంపకమే అనుకుంటాను. ఓ రోజు సాయంత్రం మా ఇద్దరిమధ్య అభిప్రాయ భేదాలొచ్చాయి. అంతవరకూ కబుర్లు చెప్పుకుంటూ పార్కులో కూర్చున్నాం. చీకటి పడింది. లేచాం. నన్నభినందించడంతో ప్రసంగం ప్రారంభించాడు.

[ఇక్కడ సంధ్యకీ చంద్రానికీ మధ్య జరిగిన యీ సంభాషణని, గతాన్ని ప్రతిబింబిస్తున్నట్టు స్ఫురించే లాగ, రంగస్థల శిల్పాన్నిబట్టి అనేక విధాలుగా ప్రదర్శించవచ్చు.]

చం : సంధ్యా. నిన్న నీ పాట

వింటుంటే హృదయంలో అమృత ధారలు కురిశాయంటే నమ్ము. ఆ మధురానుభూతి....

సం: ఎవరు రాసిన పాట వాళ్ళకి బాగుంటుంది.

చం: నా కవిత్వాన్ని గురించి కాదు నేను మాట్లాడుతుంట. నీ కోకిల స్వరంతో నా పాటకి జీవం పోశావు.

సం: అందులో నిన్నభినందించ తగ్గ సాహిత్యం లేదు. నన్నభినందించ తగ్గ సంగీతం లేదు. నీ పోరు పడలేక పాడేను.

చం: మరీ అంత నిర్దయగా మాట్లాడకు.

సం: పోదాం, పద.

చం: ఇంకమీదట ప్రణయ గీతాలు రాయనని ఎందుకు వాగ్దానం చేశానా అని విచారిస్తున్నాను.

సం: నువ్వు కాస్సేపు కూర్చుని తీరుబడిగా విచారించు చీకటిపడింది నేను పోతున్నాను. గుడ్‌నైట్.

చం: సంధ్యా.

సం: ఓ యస్.

చం: నీతో ఓ విషయం మాట్లాడాలి.

సం: వొద్దు.

చం: ఎంచేత?

సం: నువ్వు మాట్లాడబోయే విషయం నాకు తెలుసు కనుక.

చం: అందుకేనా, నా ఉత్తరాలకి దేనికీ సమాధానం కూడా రాయటం లేదు. నేను నిన్ను మనసారా ప్రేమిస్తున్నాను సంధ్యా. నీ కోసం నే నెలాటి త్యాగాన్నయినా చేస్తాను.

సం: నా కోసం నువ్వు త్యాగం చెయ్యవల్సినంత దీనావస్థలో నేను లేను. నిన్ను నువ్వు ఉద్ధరించుకుంటే చాలు.

చం: నన్నెందుకిలా నిర్దాక్షిణ్యంగా నిర్లక్ష్యం చేస్తావు.

సం: చంద్రం! నిన్ను నువ్వే నిర్లక్ష్యం చేసుకుంటున్నావు. ఎంతసేపూ ప్రేమా పెళ్ళీ తప్పిస్తే జీవితంలో నీకో ధ్యేయం లేదు. ఇన్నాళ్ళనుంచీ నీతో స్నేహం చేస్తున్నా. నీ భవిష్యత్తులో ఒక ఔన్నత్యాన్ని, ఒక ప్రత్యేక స్థానాన్ని సాధిద్దామన్న పట్టుదల నీలో కనబడలేదు.

చం: పాఠాలు తర్వాత చెప్పొచ్చు. నువ్వు నన్ను ప్రేమించావో లేదో సమాధానం చెప్పు.

సం: ప్రేమించడమంటే మోహించడమనేనా నీ ఉద్దేశ్యం!

చం: సంధ్యా సూటిగా సమాధానం చెప్పు.

సం: చెప్పలేను.

చం: ప్రేమించలేదన్నమాట!

సం: నేనలా అనలేను. ఇప్పటికి నన్ను ప్రేమించానని నీలాగే ఉత్తరాలు రాసినవాళ్ళు చాలా మందున్నారు. వాళ్ళందరూ కూడా ప్రేమ పండితులే!

వాకోసం ఎలాంటి త్యాగమయినా చెయ్యడానికి సిద్ధంగా వున్నవాళ్ళే. ఎటొచ్చీ వాళ్ళ ప్రేమని స్వీకరించడానికి నేనే సిద్ధంగా లేను.

చం: కారణం?

సం: కారణం చెప్పడంవల్ల ఇంత వరకూ అనుకుంటున్న స్నేహితులు అందరూ దూరమయ్యేరు. అంచేత నువ్వు కూడా దూరమై పోతావేమోనని భయం.

చం: మరెవర్నైనా ప్రేమించేవా?

సం: లేదు

చం: అయితే నేను నీకు దూరమౌతానన్న భయం అక్కర్లేదు నిజం చెప్పు. నన్నెందుకు ప్రేమించలేవు? ఒక స్త్రీని ఆకర్షించలేనంత కురూపిని కాను

సం: నువ్వు అందంగా వుంటావన్న విషయం ఎవరూ దాచలేరు. కాని సౌందర్యం అనంతం. నీకంటే అందమైన మొగాళ్లూ, నాకంటే అందమైన ఆడాళ్లూ కోటానుకోట్లు వున్నారు. అంచేత భౌతిక శరీరాల కొలతలూ అందచందాలే యువతీయువకుల్ని భార్యాభర్తలుగా చేస్తే జీవితాంతంవరకూ వాళ్ళకి అసంతృప్తి తప్పదు

చం: నా చదువు చాలదా?

సం: యమ్మే ప్యాసయ్యావు పట్టుదల వుంటే యింకా చదవగలవేమో.

చం: డబ్బుకు లోటు లేదు.

సం: తల్లితండ్రులు యిచ్చిన ఆస్తి రెండు వేపులా పదునున్న కత్తి లాంటిది దానివల్ల మేలూ జరగొచ్చు; కీడూ జరగొచ్చు.

చం: నాకు స్వేచ్ఛ వుంది.

సం: మీ తల్లితండ్రులకి ఏకైక పుత్రుడివి. స్వేచ్ఛ నీ జన్మహక్కు.

చం: (తీక్షణంగా) మరి నీకు కాబోయే మొగుడెలా వుండాలి? మన్మధుణ్ణీ, కుబేరుణ్ణీ, బృహస్పతినీ కలిపి రంగరించి నీకోసం బ్రహ్మ ఓ దేవతని సృష్టించాలేమో!

సం: దేవతక్కర్లేదు. అభిమానమున్న మానవుడయితే చాలు.

చం: నా కభిమానం లేదా? నేను మానవుణ్ణి కాదా?

సం: నీ కభిమానం లేదు; నువ్వు మనిషివీ కావు.

చం: సంధ్యా!

సం: అవును. నువ్వు ప్రేమించినంత మాత్రాన నిన్ను నేను ప్రేమించాలని ఎందుకనుకుంటున్నావు? నేను నిన్ను ఆకర్షించినట్టుగానే నన్ను నువ్వు ఆకర్షించడం చేతగాక ప్రేమించమని ప్రాధేయపడుతున్నావు. నీకు అభిమానం ఎక్కడుంది?

చం: సంధ్యా!

సం: రూపం, చదువూ, డబ్బూ, స్వేచ్ఛా యిచ్చి మీ తల్లితండ్రులు తయారుచేసిన ఆటబొమ్మవి. నువ్వు మానవ జన్మెత్తినందుకు స్వయం కృషితో నీ వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకుని ప్రయోజకుడవై సమాజం నిన్ను గౌర

వించిననాడు నేనే నిన్ను వెతుక్కుంటూ వొస్తాను. గుడ్ బై!

చం: థాంక్స్!

[సంధ్యా చంద్రాల మధ్య జరిగిన ఈ సంఘటనను గురించి మళ్ళీ రాజశేఖరంతో చెప్పడం ప్రారంభిస్తుంది.]

సం: ఆనాడు చంద్రాన్ని అలాగ ఆవేశంలో అవమానించి పంపేసిన తర్వాత పశ్చాత్తాపంతో క్రుంగిపోయాను. ఆ రోజునుంచి చంద్రం కనబడ్డం మానేశాక నా జీవితంలో ఏం పోగొట్టుకున్నానో గ్రహించాను. అతన్ని అవమానించడమే నాకో శిక్షయిపోయింది. ఉత్తరమేనా రాస్తాడేమో అనుకున్నాను. రాయలేదు. చంద్రం నన్ను ద్వేషించినా మరచిపోయినా, నేను చేసిన అవమానం మూలంగానైనా అభివృద్ధిలోకొస్తే చాలని సంతృప్తిపడ్డాను. నేను కూడా ఉత్తరం రాయలేదు.

రా: మళ్లీ ఎప్పుడు కల్సుకున్నారు!

సం: నాలుగు నెలల్రితం యూనివర్సిటీ లైబ్రరీలో. చంద్రం దీక్షగా చదువుకుంటూండగా నేనే దగ్గిరకెళ్లి పలకరించాను. కాంపిటీటివ్ ఎగ్జామినేషన్స్‌కి కడుతున్నానన్నాడు. చంద్రం మొహంలోకిసూటిగా చూడానికే సిగ్గుపడ్డాను. నాలుగైదు రోజులు అతనికి తెలియకుండా అతనిని గమనించాను. చంద్రం దీక్ష చూస్తూంటే ఆనంద తన్మయత్వంలో కళ్ళల్లో నీళ్ళు తిరిగేవి. చంద్రానికి విజయం చేకూర్చమని భగవంతుణ్ణి ప్రార్థించాను. కాని మళ్ళీ పరీక్షలయ్యేవరకూ నేను కలుసుకోలేదు.

రా: చంద్రంలో వచ్చిన మార్పుకి కారణం ఇదివి తెలియక పోయినా, యిలాంటి దేదో వని వూహించాను.

సం: తర్వాత చంద్రం పరీక్ష ప్యాసవడం, ఉద్యోగంలో చేరడం జరిగేక నేనే చంద్రాన్ని వెతుక్కుంటూ వెళ్ళాను. మిగిలిన పరిణామాలు మీ రూహించలేనివి కావు.

రా: మీ ప్రేమానురాగాల్ని అర్థం చేసుకోగలను. మీ భవిష్యత్తుపై వాటి ప్రభావాన్ని కూడా ఊహించగలను. నువ్వు మా యింటి కోడలు కావడం కంటె నేను కోరుకునేదేమీ లేదు .... కాని........

సం: నాకుతెలుసు. చంద్రం తల్లి మనస్సును నేనర్థం చేసుకోగలను. మీకు సిరిసంపదలూ, పేరు ప్రతిష్టలూ వున్నాయి, ఎంతోగౌరవ మర్యాదలతో దరాగా జీవిస్తున్నారు. కొడుకు విద్యావంతుడు ప్రయోజకుడూ అయ్యాడు. ఇలాంటప్పుడు ఎన్నో మంచి సంప్రదాయమైన కుటుంబాల్లోంచి, పదిమంది వున్నవాళ్ళు, ముద్దూ ముచ్చటలు తీర్చగలవాళ్ళు పిల్లనిస్తామని వస్తూంటే కులం గోత్రం, దిక్కూమొక్కూలేని ఓ అభాగ్యపు అనాధని కొడుకు పెళ్ళాడి ఉద్ధరిస్తానంటే ఏ తల్లి సంతోషిస్తుంది!

రా : నా దురదృష్టాన్ని సరిగ్గా వర్ణించావు !

సం : మీరు బాధపడకండి. నాకూ చంద్రానికి మధ్య వుండే పవిత్రమైన స్నేహానుబంధాలు గుర్తిస్తే చాలు. మా పెళ్ళి జరక్కపోయినా పరవాలేదు.

రా : మీ పెళ్ళి జరక్కపోయినా పరవాలేదంటున్నావు ! ఒకవేళ మా చంద్రం మరో అమ్మాయిని పెళ్ళాడితే....?

సం : హా మజ్నూ ! అంటూ విషం తాగో, ఏందులోనో దూకో ప్రాణ త్యాగం చేసుకుంటా ననుకున్నారా ! పెళ్ళేనా జీవిత పరమావధి అనుకునే టంత వ్యర్థమయిన జీవితం కాదు నాది.

రా : మా చందం ఏమన్నాడో తెలుసా ! పెళ్ళాడితే నిన్ను పెళ్ళాడతాడట, లేకపోతే పెళ్ళే ఆడడట !

సం : చంద్రానిది చాలా సన్నితమైన మనస్సు. ఆవేశం ఎక్కువ. ఇలాంటి వియోగాలవల్ల వచ్చే బాధలు శాశ్వతం కావు. కాలం తల్లిలాంటిది. కాలం కౌగిలిలో మానవుడు మరిచిపోలేని దుఃఖాలు లేవు....క్షమించండి ....యిప్పటికే మీకు లేటయి పోయింది. చాలామంది మీకోసం కాచుకువుంటారు. ఆవిడకూడా వుండగా మరో సారి వస్తాను. గుడ్ డే. ! (నిష్క్రమిస్తుంది)

రా : వెరీగుడ్ డే. మై చైల్డ్ ! వెరీ గుడ్ డే.

[సంధ్య వెళ్ళిపోగానే టీపాయ్ మీదున్న ప్రేమలేఖలకట్ట తీసుకుని ఆలోచిస్తూ నెమ్మదిగా అడుగులేసుకుంటూ ఆఫీసు గదివైపు (బయటకు) నిష్క్రమిస్తాడు. క్షణంతర్వాత ఇందిరా, భానుమూర్తి ప్రవేశిస్తారు. ఇందిర దిగులుగా సోఫాలో వాలిబడుతుంది]

భా : (సోఫాలో కూర్చుంటూ) అమ్మడూ, నువ్వు దిగులుపడకు. ప్రయత్నించి వాణ్ణి దార్లోకి తీసుకురావల్సిన బాధ్యత మనమీదుంది. ఇంతకీ చంద్రం కుర్రాడు, తెలిసీ తెలియని వయస్సు.

ఇం : ఏమిటో అన్నయ్యా ! నీదే భారం. ఆయన వరస నీకు తెలియందేముందీ ! ఆ కొడుక్కు తండ్రి !

రా : (ప్రవేశించి భానుమూర్తి పక్కనే చతికిలపడుతూ) ఏరా ! భానూ ! నన్నుగురించి మీ చెల్లెలు ఏవో నూరి పోస్తున్నట్టుందే !

భా : ఒరేయి, రాజా ! నోరు ముయ్యి. దీనికంతకీ నువ్వే కారణం.

రా : నువ్వూ అన్నావూ ! ఇకనేం ! నీకూ విషం తలకెక్కిందన్నమాట !

భా : మరి లేకపోతే, బియ్యే అయిపోగానే చదువు ఆపేసి పెళ్ళి చెయ్యరా అని చిలక్కి చెప్పినట్టు చెబితే విన్నారా ! 'వాడి మొహం. ఇప్పట్నుంచీ పెళ్ళేమిట్రా ! చదువుకోనీ' అన్నావు. యమ్మే ప్యాసయ్యాక 'ఏరా వాడి పెళ్ళిసంగతేంచేశావు' అంటే వాడికింకా ప్రపంచజ్ఞానం రాలేదు. ఏమిటో కవిత్వం, పత్రికలూ అంటున్నాడు ! కొత్త బుద్ధి కుదుట

బిడస్టీ' అన్నావు. వాడు వుద్యోగంలో చేరేక కిందటిసారి నే నిక్కడికొచ్చి అడిగితే 'నా అభ్యంతరం లేదు. పిల్లా పిల్లాడు ఒప్పుకుంటే ముహూర్తం పెట్టించు' అన్నావు. తీరా 'యివ్వాళ కుర్రాణ్ణి తీసుకెళదామని వచ్చిందాకా వుండి 'ఎవర్నో ప్రేమించానంటున్నా డన్నయ్యో' అంటూ బేర్ మంది మీ యావిడ! ఏమిట్రా యీ భాగోతం!

రా: తానొకటి తలచిన తనయు డొకటి తలచును!

భా: వాడి విరహ గీతాలు నిన్నడు రేడియోలో వినగానే వీడిధోరణి ముదరకుండా త్వరగా పెళ్ళి చేద్దాం అన్నాను. అప్పుడు "ప్రణయంలో ఎంత తక్కువ అనుభవముంటే అంతగొప్ప విరహ గీతాలు రాస్తారు కవులు" అన్నావు. ఇప్పుడు అర్థమయిందా నీ సిద్ధాంతం ఫలితం! అప్పుడే ప్రేమనుంచి పెళ్ళి వరకూ చేరాడు నీ సుపుత్రుడు.

రా: పెళ్ళిళ్ళుచేసే వాడూ చేయించే వాడు భగవంతుడు. మనం కేవలం సాక్షులం.

భా: కట్టిపెట్టరా నీ కొట్టు వేదాంతం! కుర్రాణ్ణి కట్టడిలో పెట్టి కట్టుదిట్టం చెయ్యడం రాకపోతేసరి! అంత దైవం మీదే భారం వెయ్యదలుచుకుంటే రాం భజన మొదలెట్టలేక పోయావూ!

రా: నీ కోసమే ఎదురు చూస్తున్నాను. నువ్వొచ్చేవుగా. ఇంక మొదలెడదాం. సరే యీ గొడవిలావుండనీ. ముందు నీ వ్యాపారమెలా సాగుతోంది చెప్పు. కొత్త ఏజన్సీలేమైనా సంపాదించావా? అరగడం మరిచిపోయాను! నువ్వు మునిసిపల్ చైర్మన్ అవుతా వనుకుంటున్నారు!

ఇం: చూశావా అన్నయ్యా! ఇదీ వరస! అమ్మో, కన్న కొడుకు బ్రతుకిలా బదలషలొందే అన్న చీకూ చింతా లేదుకదా!

భా: ఏమిట్రా యీ ధోరణి! ఈ గండం గడవడ మెలాగా అని మేం బుర్రబద్దలు కొట్టుకొంటుంటే 'ఈగొడవ కేంలే!' అంటావు! నీ కేమైనా బుద్ధుందా!

రా: ఏమిటి వీడిపెళ్ళి గురించి యీ రాద్ధాంతం! ఇందులో గండ మేమిటి!

భా: అయితే వాడి అమ్మాయిని పెళ్ళాడటం నీ కిష్టమే నన్నమాట!

రా: వాడిష్టం. మధ్య నా యిష్టమేమిటి! నా యిష్టప్రకారమే జరగాలి అంటే, వెంటనే మీ అమ్మాయిని మంచిరోజు చూసి ప్రేమించమందును.

భా: వాడిప్పుడు మీ వాడు మొండికెత్తుతే నీకేం బాధగాలేదూ!

రా: బ్రదర్ భానూ. జీవితమే ఓ పెద్దబాధ. డబ్బు లేకపోవడమే బాధ. ఉంటే దాచుకోవడమో బాధ. పెళ్ళాడకపోతే ఓబాధ. ఆడితే సంసారమో బాధ. పిల్లలు లేకపోవట మోబాధ. ఉంటే యిదీబాధ! అసలు బాధలేనిదేముంది! ఉన్న సుఖమల్లా తృప్తిలో వుంది.

ఇం: వింటున్నారా ఆయన

వేదాంతం! రెండు రోజుల్నుంచి మితి మీరి పోతుంది. అసలు కోర్టునుంచి తిన్నగా వెళ్ళి ఏ బైరాగుల్లోనో చేరి పోకుండా ఇంటికొస్తారో, రారో అని ప్రాణాలు టిప్పు టిప్పు మంటున్నా యంటే నమ్ము.

భా : ఏమిట్రా!

రా : చంచలమైంది మనస్సు. అశాశ్వతమైంది శరీరం. అంతులేనివి ఆశలు. సుఖ దుఃఖాలు భ్రమలు. ప్రేమ బంధాలు సంకెళ్లు. వివాహం దైవ నిర్ణయం, నాయనా, భానూ....

భా : షటప్!

ఇం : ఏమండీ! మీ కో నమస్కారం. మీ వేళాకోళానికో వేళా పాళా వుంటే బాగుండును. భానుమూర్తి స్నేహితుడు మనమంటే అభిమానంకొద్దీ వొచ్చాడు. మరి అతని సలహా నచ్చితే నచ్చిందని చెప్పండి లేదంటే అతని దారి అతన్ని చూసుకోమందాం. మనఖర్మ మనం అనుభవిద్దాం.

రా : మరి మీ యిద్దరికీ ఏమయినా బుద్ధుందా! మీ అన్నా చెల్లెళ్ళిద్దరూ ఏకమై ఒక్కలాగ నా మీద విరుచుకు పడుతున్నారు! చంద్రం మీకు శత్రువయినట్టూ నేను వాడి పక్షమైనట్టూ వుంది మీ వాదం.

భా : అది కాదురా, "నేనో అమ్మాయిని ప్రేమించాను పెళ్ళాడదామనుకుంటున్నాను" అని చంద్రం అంటే [illegible] ఆలోచించుకోకుండా "శుభస్య శీఘ్రం" అనడమే! వాడికెంత [illegible]!

రా : వాడికి మైనార్టీ తీరి ఆరేళ్ళయింది. చదువుకుంటున్నాడు. ఉద్యోగం చేసుకుంటున్నాడు. నేనో అమ్మాయిని ప్రేమించి పెళ్ళి చేసుకుంటాను మొర్రో అంటే వొద్దు పొమ్మని వాడితో దెబ్బలాట పెట్టుకోమంటావా! ఏదో ఉపాయం ఆలోచించి వాణ్ణి దారికి తీసుకురావాలి కాని!

భా : అసలు ప్రేమేమిటోయ్. గోంగూర! ప్రేమించానని మీ అమ్మాయి అంటే నువ్వూరుకున్నావుగాని .... ఏదీ ఎవర్నైనా ప్రేమించానని మా అమ్మాయి ననమను. డొక్కచీల్చి డోలు వాయించేస్తాను. నేను ఏ సంబంధం చూస్తే దానికొప్పుకోవల్సిందే!

రా : హమ్మయ్య! నా ప్రాణం కుదుటపడిందిరా భానూ! చల్లటిమాట చెప్పేవు. కొంపదీసి మా వాణ్ణి మీ అమ్మాయి ప్రేమించిందేమో .... పీడా మొండిఘటం ...ఏమయినా ప్రయత్నం చేస్తామనుకో!

భా : ప్రయత్నించడం చాలదు. సాధించాలి. మనవి సాధారణ కుటుంబాలు కావు. నాకో లక్ష రూపాయల ఆస్తవుంది. నీకో రెండు మూడు లక్షలపైగా ఉంటుంది. నీకు ఒక్కడే ఒక్క కొడుకు. నాకు ఒక్కతే ఒక్క కూతురు. ఈ సమాజంలో వేలకి వేలమంది పూటకి తిండి లేనివాళ్ళు దరూ మన సంబంధాలకోసం ఎగబడతారు. ఇది సహజం. అందుకే మన జాగ్రత్తలో మనముండాలి.

రా: నీ ఆర్థిక శాస్త్ర పాండిత్యానికి నీ దూరదృష్టికీ నా జోహార్లు. ఏమయినా ఇందిరకి యిష్టంలేని పెళ్ళి జరగదని హామీ యిస్తాను. పైగా మావాడు మీ అమ్మాయిని పెళ్ళాడటంకంటే నాకు కావల్సిందేమీలేదు. అందుచేత కర్తవ్యం ఆలోచించు. కార్యరంగంలోకి దూకడానికి నేను సిద్ధంగా వున్నాను.

భా: ఆల్‌రైట్. అలా దార్లోకిరా. ముందు వాణ్ణి ఒప్పించి, వాణ్ణీ ఇందిరనీ వెంటబెట్టుకుని మా వూరెళతాను. రెండు రోజులక్కడ వుండనీ. వాడి బుద్ధి మారకపోతే చూడు. మా అమ్మాయి బియ్యే ప్యాసయింది. సంగీతం వొచ్చు. ఇంక రూపం అంటావా....

ఇం: శారద కేమిటి అన్నయ్యా! బంగారు బొమ్మ. మావాడి అదృష్టం ఎలా వుందో!

భా: చూడు అమ్మడూ, ప్రేమ అన్నది ఒక రకమైన కండ్లజబ్బు. వయస్సులోవున్న కుర్రాడికి కాస్త అందమైన అమ్మాయి కనబడగానే కళ్ళు జివ్వున లాగుతాయి. దాంతో రోగం ప్రారంభం. రోగం ముదిరినకొద్దీ మైకం కమ్మి, కళ్ళతోబాటు కాళ్ళూ, చేతులూ, నోరూ, జేబులోవున్న డబ్బు అన్నీ స్వాధీనం తప్పుతాయి. దాంతర్వాత మెదడు పనిచెయ్యడం మానేస్తుంది. ఒళ్ళు పై తెలీకుండా అక్కణ్ణుంచి ప్రేమనామ స్మరణ!

ఇం: ఈయనకి మాత్రం తెలీదా ఏమిటి! చిన్నప్పుడు నన్ను ప్రేమించే రోజుల్లో ఆ వుత్తరాల్లో ఏం కవిత్వం. అంతా వాళ్ళబ్బాయి పోలికే! కాలేజ్ ఫీజ్ కట్టడం మానేసి ఆ డబ్బుతో ఏం నాటకం ఆడేరు! బయటకెళితే టాక్సీ! సినీమాకెడితే బాల్కనీ. దాహమేస్తే కూల్‌డ్రింక్! నిజంగా లక్షాధికారనుకున్నాను. పెళ్ళయ్యేక బయటకెళితే సిటీబస్సు, సినీమాకెడితే మామూలు కుర్చీ. దాహమేస్తే మంచినీళ్ళు....

రా: నేనవన్నీ ప్రేమ మైకంలో చెయ్యలేదు. మీ నాన్నదగ్గిరో లక్షరూపాయలున్నాయి. పరమ పిసినిగొట్టు. ఒక్కర్తివే కూతురువి. అందుచేత నిన్నేనా పెళ్ళాడి సుఖపడదామని అలా ఎత్తు వేశాను. దానికంతకీ సూత్రధారుడు యిగో భానేగా! వీడే సలహా యిచ్చేడు.

భా: నేను సలహా యిచ్చేనే! నువ్వు వేషాలేస్తే యేం! మీ మావగారి లక్షరూపాయిల మీదా ఆధారపడకుండా నీ ప్రయోజకత్వంతో మరో రెండు మూడు లక్షలు సంపాదించావు. అందుచేత నీకూ పేరూ వొచ్చింది. నాకూ మాటా దక్కింది. లేకపోతే....

రా: లేకపోయినా ఆ లక్ష రూపాయిలే చాలు.

భా: అదిగో, అలా అనుకోవడమే ప్రమాదం. ఇప్పుడు మీవాడు ఆ స్కూల్‌టీచరు వలలో పడ్డాడుకదా. పెళ్ళాడేడా, అదెప్పుడూ డబ్బుమొహం

చూస్తుందదేమో వీణ్ణి మసిబూసి మారేడుకాయి చేసి, సినీమాల్లోకో, గుర్రప్పందేల్లోకో దింపేస్తుంది. ఇంక మీ ఆస్తి హారతి కర్పూరంలాగ . రామా కృష్ణం.

రా: సరేనయ్యా! మీ అమ్మాయిని పెళ్ళాడితే ఇద్దరూ బోలెడు సుఖపడతారు. మనమందరం వినగబడి సంతోషిస్తాం. మరి మావాడు ఈ అమ్మాయి ప్రేమ పాశాల్లోంచి బయటపడి మీ అమ్మాయి పెళ్ళి వలలో పడటం ఎలాగా అని!

ఇం: అసలువాళ్ళ నాన్నలాగే వాడు మొండి ఘటం కానీ. మీ అమ్మాయిని చూడటం వరకూవొస్తే వాడే దార్లో కొస్తాడు.

భా: అదే నా నమ్మకమూను. ఇహపోతే, వీణ్ణి ప్రేమించానంటున్న ఆ స్కూల్ టీచరమ్మాయి ఇది వినగా కింపలు తొక్కుతుంది. అంచేత ఆ అమ్మాయిని అదుపులో పెట్టడం చాలా అవసరం. దానికి ఒకటే మార్గం. తిన్నగా ఆ అమ్మాయి దగ్గిరకెళ్ళి "నువ్వూ, చంద్రం ప్రేమించుకున్నారని విన్నాం. వాడకేం! వాడు మొగాడు ఎటునుంచి ఎటొచ్చినా నవ్వులపాలయ్యేది నువ్వు. వాడికిదివరకే పెళ్ళి స్థిరపడింది. ఆ పిల్లని పెళ్ళాడక పోతే చంద్రానికి చిల్లికానీ అంత ఆస్తి కూడా దక్కదు. పైగా ఆ పిల్లజీవితం సర్వనాశనమై పోతుంది" అంటూ ఉపన్యాసం మొదలెట్టి, చివరికి ఒక్కసారి ఐదువేలో, పదివేలో చేతిలో పెడితే

రా: (చిటికె వేసి) ఎక్సెలెంట్ ఐడియా! ఎన్ని సినీమాలు చూస్తే ఏం లాభం! సమయానికి ఉపాయం నాకు తట్టలేదు. ఉండు బ్యాంకుకు పంపి డబ్బు తెప్పించుతా. (బయటకి నిష్క్రమణ)

భా: అబ్బ! లేడికి లేచిందే పరుగు! అన్నింటికీ తొందరే. వీడు చిన్నప్పట్నుంచీ యింతే!

ఇం: ఏం మనిషో, ఏం లోకమో! మంచితనానికి కూడా హద్దూ పద్దూ వుండాలి. ఏదో దానం ధర్మం విషయం అంటావా, ఆయన మాటకి నేనెప్పుడూ ఎదురు చెప్పలేదు. ఎవరో దిక్కూ మొక్కూ లేందాన్ని వాడు పెళ్ళాడతానన్నాడు - ఈయన సరే నన్నారు. ఏం చెప్పమంటావు!

భా: డబ్బు పోతే మళ్ళీ సంపాదించుకుంటాం. పరువు మర్యాదలు పోతే!

ఇం: బాగా చెప్పేవు!

భా: అమ్మడూ, మళ్ళీ నేనేమైనా అంటే బాగుండదు. ఎంతయినా ఆడపిల్ల తండ్రిని కదా! చూడు. అలాంటి పిల్ల ఇంట్లో అడుగెట్టిందంటే 'కనకపు సింహాసనమున శునకము' అన్నట్టు మీవాడిమీద మోజు తీరగానే మళ్ళీ ప్రేమవేట మొదలెడుతుంది.

ఇం: అవును మరి ఏం చెప్పం! ఎంత అప్రదిష్ట! ఇంతకీ ఆ రాక్షసి .

భా: డబ్బుకు లొంగుతుందో, లేదో అంటావు. దానికి నచ్చజెప్పే విధానం

ఆలోచించాను. వాడు డబ్బిచ్చినా, మీరు పిలిచి డబ్బిప్పించినా పుచ్చుకోడానికి అభిమానపడుతుంది. అంచేత నేనే రహస్యంగా యిస్తున్నట్టు ముట్టచెబితే దార్లోకొస్తుంది. చదువుకుంది. ఉద్యోగం చేసుకుంటోంది. డబ్బు చేదా? ఈ రోజుల్లో చదువుకున్న పిల్లల్లో కొందరికిదో వృత్తయిపోయింది. అందుకే వంశం, సాంప్రదాయం చూడాలని ఊరికే అన్నారా!

ఇం: ఏమిటో అన్నయ్యా! నువ్వు సమయానికొచ్చేవు గనక సరిపోయింది లేకపోతే ఆయన మాటకి యింట్లో తిరుగుంటా? ఆయనకెంత తోస్తే అంతే! సరి ఏ కళనున్నారో నీమాట కాస్తంత తలకెక్కింది.

భా: వాడికి మాత్రం సంతోషమంటావా? ఏమయినా అమ్మడూ, ఇలాంటి విషయాల్లో నువ్వు కాస్త తెగబడట నేర్చుకోవాలి.

ఇం: ఊరుకున్నానంటావా! నీకిష్టం లేని పిల్లనిచ్చి వాడికి పెళ్ళి చెయ్యను. నీ యిష్టమొచ్చిన పిల్లనే వాడు పెళ్ళాడే లాగ చేస్తాము' అని వాగ్దానం యిచ్చే వరకూ వాదిస్తూనే వున్నాను. అయితే యేం! నా కెప్పుడూ భయమే. ఆఖరి క్షణంలో నా చేతకూడా ఒప్పించగల సమర్థులు. ఇక నీదే భారం.

భా: ధైర్యంగా వుండు. (నెమ్మదిగా) అదిగో వస్తున్నాడు. (ప్రకాశంగా) ప్రయత్నం పురుష లక్షణం అన్నారు. వాడంటే ఏదో కుర్రాడు. తప్పు చెయ్యడం సహజం. మనం వూరుకుంటే లోకులు మన మొహం తగలేస్తారు.

రా: (వచ్చి కూర్చుంటూ) ఇరవై వేలు తెమ్మన్నాను.

భా: నీకేమయినా మతిపోయిందా?

రా: అదికాదు బాబూ! ఆ అమ్మాయి అనాథాశ్రమంలో పెరిగింది. చాలా తెలివైంది. చురుకైంది. ఓ గంట క్రితమే వొచ్చివెళ్ళింది. వాళ్ళ చరిత్రంతా వింటే యిద్దరూ చాలా గాఢంగా ప్రేమించుకుంటున్నారు. మళ్ళీ ఆ అమ్మాయి ఈవూర్లోనే వుండంటే చంద్రం దార్లోకి రాకపోవచ్చు అంచేత యిచ్చేదేదో ఘనంగానే యిద్దాం. నాకీ బెడద వొదిలి వాడి బ్రతుకు కుదుటపడితే ఇరవై వేలెంతలో సంపాదిస్తాను. ఈ పనికి నువ్వే సమర్థుడివి నువ్వే స్వయంగా పూనుకోవాలి

రం: (ఉత్తరాల కట్టతో ప్రవేశిస్తూ) భానుమూర్తి బాబుగారు దేనికి సమర్థులు కారు?

[రంగనాథం అందించిన ఉత్తరాల కట్టలోంచి ఒక్కొక్క ఉత్తరమే గబగబ తనలో చదువుకుని ముఖ్యమయిన విషయాలుంటే పైకి చెబుతూ, చదివేసిన ఉత్తరాలు తిరిగి రంగనాథానికిచ్చేస్తుంటాడు]

భా: ఇదిగో - ఆంజనేయుల్లాంటి వాడు, మన రంగనాథాన్ని పంపిద్దాం.

రం: రెండునెలల్లో మా అమ్మాయి పెళ్ళుందండి. ఎలాగా శుభలేఖ చేత పుచ్చుకుని మీ దగ్గరకి రావల్సినవాణ్ణే!

ఈ లోగా మీరే వొచ్చారు. ఏమరిన్శపకి నావల్ల జరిగే పనుంటే చెప్పండి. ఏమి షాలమీద చెయ్యకపోతే అడగండి.

భా : ఓరి నీ తస్సాదియ్యా! అప్పుడే ముందరి కాళ్ళకి బంధం వేశావే. అడగలేందే పని జరగదంటావు నీ తెలివి తేటలకి నువ్వు గవర్నమెంటు ఆఫీసరుగా వుండవల్సిన వాడివి ఆఁ. ఏం లేదులే కాస్త రాయబారం జరపాలి. వివరాలు చెబుతాగా!

రా : (ఉత్తరాలు ఒక్కొక్కటే చూస్తూ) అవున్రా అలా చేద్దాం. రంగనాథం బెస్టు (ఓ ఉత్తరం చదివి) పద్మనాభంగారు ఎల్లుండొస్తానని ఉత్తరం రాశారు. అపీలు దాఖలు చెయ్యడానికి వెళ్ళాళ్ళ టైముంది నాకిప్పుడు మనస్సు బాగా లేదు. ప్రస్తుతం రానక్కర్లేదని టెలిగ్రాం ఇయ్యి (ఓ కవరు తీసి) క్లబ్ ఏనివర్సరీ! ఇంక దీనికో పదివేలు తగలేస్తారు. విజయవాడలో యిళ్ళు కాలిపోయాయంటే చచ్చిచెడి వెయ్యి రూపాయిలు పోగుచేశారు. ఇదీ మన సంస్కారం. (ఓ శుభలేఖ చూపి) వెరీ గుడ్! హయగ్రీవరావు కొడుక్కీ కోడలికీ కూడా స్కాలర్ షిప్ సంపాదించి విదేశాలు పంపిస్తున్నాట్ట! ఫేర్వెల్ పార్టీ! (మరో ఉత్తరం చదువుతూ) ఏమిటిదీ? ఓ గాడ్! ఓరి దౌర్భాగ్యుడా! ...

భా : ఎవరా దౌర్భాగ్యుడు? ఏమా కథ?



రం : ఏం జరిగింది బాబూ?

రా : సర్వనాశనమయింది. (రంగనాథానికి ఉత్తరం అందిస్తాడు)

ఇం : ఏం జరిగిందండీ? ఏమిటి రంగనాథం? ఉత్తరం చదువు.

రా : చదువు. గట్టిగా చదువు. ఇంటింటికీ వెళ్ళి చదివి వినిపించు.

ఇం : ఏమిటండీ, అలా గాభరా పెడతారూ! అసలేం జరిగింది?

రా : మన సుపుత్రుడు తండ్రి కాబోతున్నాడు.

ఇం : ఆఁ!

భా : ఎవరూ? ఆ సంగీతం టీచర్!

రా : కాదు. మరో పూర్ క్రీచర్.

భా : ఏదీ ఉత్తరం చదువు.

రం : (గొంతు సవరించుకుని) శ్రీ రాజశేఖరరావుగారికి — మీరు న్యాయవాది వృత్తిలో కీర్తిప్రతిష్ఠలు సంపాదించిన ధర్మమూర్తులు. నేను అన్యాయానికి బలికాకుండా రక్షించమని ప్రార్థిస్తూ నా దీనచరిత్రను రాస్తున్నాను. మీ ఏకైక పుత్రులు చంద్రం

గారూ, నేనూ రెండు సంవత్సరాలుగా స్నేహితులం. మా స్నేహం రాను రాను ప్రణయంగా మారింది. మా పెళ్ళి విషయంలో ఎన్నోసార్లు తల్లితండ్రులతో సంప్రదించమని వేడుకున్నాను. పెళ్ళి విషయంలో తను స్వతంత్రులని చెబుతూ వొచ్చేరు. తర్వాత చదువు పూర్తవ్వాలన్నారు. నేనే మిమ్మల్ని కల్సుకుంటానన్నప్పుడల్లా ఏవో సాకు చెప్పి వారించేవారు. నాలుగు నెలలై ఉద్యోగం చేసుకుంటున్నారు. పెళ్ళి మాటెత్తినప్పుడల్లా వాయిదా వేస్తున్నారు. ఈ మధ్యనే సంధ్య అనే మ్యూజిక్ టీచర్ని పెళ్ళాడతానని మాటిచ్చినట్టు తెలిసింది. మొన్న నేనాయన్ని కలుసుకుని, నా బ్రతుకు బద్దలు చెయ్యొద్దని బతిమాలేను. నాకూ, ఆయనకీ సంబంధం లేదన్నట్టు మాట్లాడేరు. ఆయనమీదే ఆశ పెట్టుకున్న నేను, నా దురదృష్టాన్ని నిందించుకుని జీవితాన్ని సరిదిద్దుకునే అవకాశం లేకుండా ఆయన శిశువునుకూడా నా గర్భంలో మోస్తున్నాను. భగవంతుడి సాక్షిగా యిది నిజం. ఆయన్ని సక్రమ మార్గంలో పెట్టి నిజానిజాలు తెలుసుకుని నాకు న్యాయం ప్రసాదించండి. మీ వద్దనుండి జవాబు రాగానే మీ దర్శనం చేసుకుంటాను.

— మీ అభాగ్యపు కోడలు.

ఇం : భగవంతుడా !

భా : పేరు ఎడ్రస్ యిచ్చిందా? ఏదీ! (రంగనాధం యిచ్చిన వుత్తరం అందుకుని చూసి) రామ రామ ! మన మతంకాదు, మనకులంకాదు.

ఇం : ఎంతో సుఖప్రదంగా మా జీవితాలు వెళ్ళిపోతాయనుకున్నాం. ఇంత భయంకరమైన దుఃఖం, మాకోసం కాలం చాటున, పులిలాగ దాగి వుందన్నమాట !

రా : ఊఁ (.... రంగనాధం, రేపొద్దున ఆ అమ్మాయిని కలుసుకుని మా కోడలుగా గౌరవించి యింటికి తీసుకురా.

భా : ఆఁ ... ఆఁ .. ఏమిట్రా నీ ఆవేశం ! ముందూ వెనకా ఆలోచించ క్కర్లేదూ ! అసలు ఆ అమ్మాయెవరో ఎలాంటిదో ఆ వుత్తరంలో రాసిన విషయాలు ఎంతవరకూ నిజమో తెలుసుకోకుండానే !

రా : అవన్నీ వాడు రాగానే అవే తేల్తాయి. నిజంకాదని యింకా ఆత్మవంచన చేసుకోమంటావా !

భా : అంతా నిజంకాక పోవచ్చు.

రా : ఏమాత్రం నిజంవున్నా చాలు. మళ్ళీ వెర్రి వెర్రి వేషాలేశాడంటే కోర్టు లున్నాయి. ఆ అమ్మాయి తరపున నేను వకాల్తా తీసుకుంటాను. (తువ్వాలు దులుపుకుంటూ లేచి) రేపు ఉదయం కారుతీసుకు వెళ్ళి కోడల్నింటికి తీసుకురా. రేపు వాడుకూడా దిగుతాడు.


భా : కోడ లేమిట్రా నీమొహం !

రా : పెళ్ళవనంత మాత్రాన

ఆ అమ్మాయి మా కోడలవక పోదు. అంత పెళ్ళి కోసం ముచ్చట పడితే. అయినా ఆలస్యం ఎలాగా అయింది. ఏకంగా బారసాలా పెళ్ళీ కలిపేస్తాను. (విసురుగా మేడ మెట్లెక్కి వెళ్ళి పోతాడు)

ఇం : మానవుల అజ్ఞానాన్ని నిరూపించడానికే భగవంతుడిలాంటి సంఘటనల్ని కల్పిస్తాడనుకుంటాను. పాతికేళ్ళ క్రితం పిలలు పుట్టకపోతే కనపడ్డ దేవతలందరికీ మొక్కేను. ఈనాడు కుర్రాడు భ్రష్టుడయ్యేడంటే కలిగే యీ దుఃఖంతో పోలిస్తే పిల్లలు లేక పోడం ఓ విచారమా !

భా : అమ్మడూ, నువ్విలా విచారిస్తూ



కూర్చుంటే, ఇంకిక్కడ నేనెందుకు ?

ఇం : ఇంక విచారంకాక సంతోషించమంటావా ?

భా : అయితే యిలా విచారిస్తూ కూర్చో ఈలోగా మీ ఆయన పెళ్ళి ఏర్పాట్లు చేస్తూ వుంటాడు.

ఇం : ఆయన మాటలు విన్నావుగా. ఎలాగా అంతపనీ చేసితీరతారు.

భా : అది సరేనమ్మా. ఇందులో నిజానిజాలూ మంచిచెడ్డలూ తెలుసుకోకుండా, నేను మీ కోడల్ని. నా గర్భంలో వున్న శిశువు మీ తాలూకే అని ఉత్తరం రాస్తే అ పిల్లకి దండ వేసి ఇంటికి తీసుకొచ్చి హారతిచ్చి సత్కరించడమే !

రం : అదీ పాయింటేనండి !

భా : ఆల్ రైట్. అలాగే చేశావనుకో. రేపొద్దున్న మరో అమ్మాయి కూడా యిలాగే రాస్తుంది. ఇలా ఎంత మందిని కోడళ్ళంటూ ఇంట్లోకి చేర్చి పుసుళ్ళు పోస్తావు ?

రం : బ్రహ్మాండమైన పాయింటు.

ఇం : భగవంతుడే మామీద యింత చిన్న చూపు చూసిన తర్వాత మీరింకేమన్నా అనగలరు. ఏనాటి శాపమో వాడి కిలాంటి దుర్బుద్ధి కలిగింది !

భా : నేనలా ఆక్షేపించే వుద్దేశంతో అనలేదమ్మా. ఈరోజు లలాంటివి. మనలాంటి వాళ్ళకిలాంటి సమస్యలు సామాన్యం. ఇలా వుత్తరాలు రాసి డబ్బు గుంజుకోడం ఓ వృత్తయి

మనీ సర్క్యులేషన్ - పచ్చిమోసం!

నాకీ మధ్యని ఒక ఉత్తరం వచ్చింది. ఏదో మనీ సర్క్యులేషన్ కంపెనీ అని వ్రాసి ఉంది. "ఆరు రూపాయల పెట్టుబడితో 9325 రూపాయలు సంపాదించండి! చాలా సులభము! త్వరపడుడు!"—కడుపులో చల్ల కదలకుండా కాలుమీద కాలేసుకుని ఇంటి దగ్గర కూర్చుని సునాయాసంగా వేల కొద్దీ రూపాయలు సంపాదించే పద్ధతి అందులో విశదీకరింపబడి ఉంది. ఆ కాగితంమీద ఎవరివో ఆరుగురి పేర్లు ఎడ్రస్సులతోసహా టైపుచేసి ఉన్నాయి. ఆ ఆరు ఎడ్రస్సులకీ ఒక్కొక్కరికి ఒక్కొక్క రూపాయి చొప్పున మనిఆర్డరు చేసెయ్యాలి ముందర. ఆ ఆరు ఎడ్రస్సులకూ పైన వారిపేరు, ఎడ్రస్సు వ్రాసుకుని, ఆఖరి ఎడ్రస్సు తొలగించాలి. అప్పుడు ఈ ఎడ్రస్సులతో సహా ఈ ఉత్తరానికి నకళ్ళుతీసి, నాకు తెలిసిన నమ్మకమైన స్నేహితులు అరుగురికి వేరువేరుగా పోస్టులో పంపించాలి. అంతే. ఇంక మని ఆర్డర్లకోసం ఎదురు చూడడమే తరువాయి. డబ్బు దానంతట అదే వచ్చిపడుతూ ఉంటుంది. ఇదీ కథ.

కొద్దిగా పాఠభేదాలతో ఈ రకం గొలుసుకట్టు ఉత్తరాల పద్ధతులను గురించి మీరంతా వినేవుంటారు. మనీసర్క్యులేషన్ కాకపోతే ఒక్కొక్కప్పుడు "ఫలానా బాబా" గారి భక్తులు గొలుసుకట్టు ఉత్తరాలు వ్రాస్తు ఉంటారు. ఆ బాబాగారి మహిమను వర్ణిస్తూ పది పంక్తుల ఉత్తరం వస్తుంది. ఆ ఉత్తరంమీద ఉన్న విషయానికి ఆరు (లేకపోతే పది) నకళ్ళు తీసి, ఆరుగురు స్నేహితులకు పంపించాలి. ఆ ఉత్తరాలు అందుకున్న ఆరుగురిలో ప్రతి ఒక్కడూ తనకుతెలిసిన ఆరుగురు స్నేహితులకు ఇదే ఉత్తరానికి నకళ్ళు తీసి పంపాలి... ఈ గొలుసు ఎక్కడా తెగిపోకూడదు. తెంపివేసిన పాపాత్ముడు రౌరవాది నరకాలలో పడిపోతాడు!

ఇటువంటిదే మరో తమాషా. అప్పుడప్పుడు పత్రికలలో ప్రకటనలు పడుతూ ఉంటాయి. "300 రూపాయల ఖరీదు చేసే ర్యాలీ సైకిలు 50 రూపాయలకే! కొద్దిగా ఉన్నాయి. ఆలసించిన ఆశాభంగం...."

ఈ రకం ప్రకటన చూచి నిజమే అని నమ్మే మనుష్యులు చాలామంది ఉంటారు. 50 రూపాయలు మనిఆర్డరు చేస్తే తిరుగు పోస్టులో వారికి సైకిలుకి బదులు ఒక పెద్ద కాగితాల కట్ట వస్తుంది. అందులో అయిదు కూపన్లు, బోలెడంత సమాచారమూ ఉంటాయి.

డాక్టర్ మహీధర నళినీమోహన్

ఆ కూపనులను ఒక్కొక్కటి ఏభై రూపాయలకు నీకు తెలిసిన ఐదుగురు వ్యక్తులకు అమ్ము. వచ్చిన 250 రూపాయలనూ ఆ కంపెనీకి జమ కట్టాలి. అప్పుడు ర్యాలీ సైకిలు ఒకటి ఆ కంపెనీ నీకు నిజంగా పంపిస్తుంది. అంటే నీకు ఆ సైకిలు ఏభై రూపాయలకే వచ్చింది. అందులో అనుమానమేమీ లేదు. మిగిలిన 250 రూపాయలూ నీ స్నేహితుల జేబులలోంచి తీసుకొని ఆ కంపెనీకి చెల్లించావు. 50 రూపాయలిచ్చి నీ దగ్గర కూపను కొన్న స్నేహితుడు అటువంటివే మరో ఐదు కూపన్లు ఇతర స్నేహితులకు అమ్మి సైకిలు సంపాదించడానికి నానా శ్రమా పడాలి. అల్లా అమ్మగలిగితే అతడి కూడా సైకిలు ఏభై రూపాయలకే వస్తుంది.

మొట్టమొదటిసారి వింటే ఇందులో మోసం ఏమీ లేనట్టే కనిపిస్తుంది ప్రకటన వేసిన కంపెనీవారు తాము అన్న మాటమీదే నిలబడ్డారు. ప్రతివాడికీ సైకిలు ఏభై రూపాయలకే వస్తుంది. అల్లాగని ఆ కంపెనీకి నష్టం ఏమైనా వచ్చిందా అంటే అదీ లేదు. అక్కడి సరుకుకి పూర్తి మొత్తం రానేవచ్చింది.

అయితే ఆ నష్టం ఎవరిదన్న మాట? కొందరు వ్యక్తులు మోసగింపబడ్డారనటంలో సందేహం ఏమి లేదు. ఇంతకీ ఆ మోసంయొక్క కీలకం ఎక్కడుంది?


ఈ రకమైన గొలుసుకట్టు పద్ధతులు ప్రతి దేశంలోనూ ఏదో ఒక రూపంలో అప్పుడూ అప్పుడూ తలఎత్తుతూనే ఉంటాయి. వాటికి బ్రహ్మాండమైన ప్రచారం కొనసాగుతుంది. ప్రజలు వెలంవెర్రిగా వాటిచేత ఆకర్షింపబడతారు. కొంతకాలానికి దానంతట అదే ఈ వెర్రి చప్పగా చల్లారిపోతూ ఉంటుంది.

దీనికి కారణం ఊహించగలరా? అతి త్వరలో కూపన్లు అమ్మటం అసాధ్యమైపోతుంది. బాబా గారి ఉత్తరాలు వ్రాయడానికి స్నేహితులు కరువైపోతారు. మీకు నమ్మకం కలుగకపోతే కాగితమూ, పెన్సిలూ తీసుకుని లెక్కలు వేద్దాం రండి.

ఒక వ్యక్తి తన స్నేహితులు ఆరుగురికి ఆరు ఉత్తరాలు వ్రాశాడు. రెండవ మెట్టులో అవి 36 ఉత్తరాలు అవుతాయి; మూడవ మెట్టులో 216; నాలుగవ మెట్టులో 1,296; ఐదవ మెట్టులో 7 776. ఈ విధంగా పెరిగి పెరిగి పదకొండు మెట్లు పూర్తి అయేసరికి మొత్తం 43 53 56 467 మందికి ఉత్తరాలు అందుతాయి!

భారతదేశంలో చదువు వచ్చినవారూ, రానివారూ పసిపిల్లల దగ్గరనుంచి ముసలివాళ్ళవరకూ ప్రతి ఒక్కరూ ఈ "ఆట"లో పాల్గొంటే, పదకొండు అంచెలలో దాదాపు దేశ జనాభా అంతా ఒక్కొక్క ఉత్తరం చొప్పున అందుకుంటారు! పన్నెండవ మెట్టులో తిరిగి

ప్రేమజీవి ఆత్మహత్య





శేషగిరి చీకటిలో కూర్చుని దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. సిగరెట్టు పొగని గాలిలోకి ఊది "హా" అని లేచి గదిలో పచార్లు సాగించాడు. అతని ఆలోచన తెగటంలేదు. ఎంతసేపటికి ఒక నిర్ణయానికి రాలేక పోతున్నాడు. గుట్టగా క్రిందపడిన సిగరెట్టును చూసి తన మీద తనే జాలి పడ్డాడు. కిటికీలోంచి బయటకు చూశాడు. బయట కాదు చీకటి తన హృదయంలోని నిరాశా నిస్పృహలలాగ పరచుకొని ఉందనుకొన్నాడు. ఎదురుగుండా అద్దంలోని తనరూపం తనని చూసి వికటంగా నవ్వింది. మాసిన గడ్డం, లోతుగా ఉన్న కళ్ళు, సంస్కారం లేని జుట్టూ అద్దంలో చూసుకొనేటప్పటికి, శేష

దేవరకొండ సుబ్రహ్మణ్యం

గిరికి కమల మీద పట్టరాని కోపం వచ్చింది. "దీనికంతటికీ కారణం ఆమే కదా! చిగురించి మొగ్గలు తొడుగుతున్న నా ఆశలను ఒక్క క్షణంలో త్రుంచేసి పోయిందికదా. ఆమె తనతప్పు తెలుసుకొనేలాగ ఎలాగైనా చేయాలి. ఈ శేషగిరి అల్లాటప్పా ప్రేమికుడు కాదని ఋజువు చెయ్యాలి"

నెమ్మదిగా, భారంగా అడుగులు వేసుకొని వెళ్ళి, అల్మారాలోంచి ఒక సీసాతీసి చూసుకొని, పల్చగా నవ్వుకొన్నాడు. "ఇంకా కొద్దిసేపటిలో ఈ శేషగిరి అనే వైద్య విద్యార్థి మజ్నూ దేవదాసుల కోవకు చెందిన ప్రగాఢ ప్రేమికుడు ప్రేమలో తిరస్కరింపబడి, ఆ బాధ సహించలేక, ప్రియురాలిని విడచి యీ లోకంలో ఉండలేక, ఈ లోకం విడచి అమరజీవి అవుతున్నాడు," అనుకొని బాధగా గుండెమీద చెయ్యి వేసికొని నిశీధిలోకి చూస్తూ గట్టిగా సిగరెట్టు దమ్ములాగి వదిలాడు. "రేపు పొద్దున్న నా మరణవార్త కాలేజీలో తెలుస్తుంది. ఆ వార్త విన్నతరువాత కమల, 'అయ్యో! శేషగిరి ప్రేమవిలువ తెలుసుకోలేక, అతనిని తిరస్కరించానే! నామూలాన్ని అతడు ప్రాణాలు కోల్పోయాడే' అని కంటికి మంటికి ఏకధారగా ఏడుస్తుంది. నాకోసం పరితపిస్తుంది..................."

శేషగిరి తృప్తిగా నిట్టూర్చి, టేబిల్ దగ్గరకు వెళ్ళాడు. ప్రక్కనే ఉన్న కూజాలోంచి ఒక గ్లాసెడు నీళ్ళు తీసుకొని త్రాగి, కుర్చీలో కూర్చుని, డ్రాయరులోంచి ఒక తెల్ల కాగితాన్ని, కవరును బయటకు తీశాడు. పెన్నుని చేతిలోనికి తీసుకొన్నాడు. కాగితం మీద పెన్నువుంచే టప్పటికి చెయ్యి వణికింది. చెమటలు పట్టాయి. "ఛీ! ఛీ! నాకు ఆత్మస్థైర్యం చాలటంలేదు. ఎలాగైనా ధైర్యాన్ని చిక్కబట్టుకోవాలి" అనుకొన్నాడు శేషగిరి. నెమ్మదిగా లేచి వెళ్ళి, ఫ్లాస్కందుకొని, వేడి వేడి కాఫీ గ్లాసులో పోసుకొని, నెమ్మదిగా 'సిప్' చేస్తూ తాగాడు. గోల్డుఫ్లేక్ సిగరెట్టు ఒకటితీసి అంటించి గట్టిగా దమ్ములాగి పొగవదల పెట్టాడు. "అయ్యో ఇక రేపటినుంచి వుడ్ లాండ్ లో కాఫీ, ఈ గోల్డుఫ్లేక్ సిగరెట్లు కాల్చడానికి ఉండదే" అని విచారించాడు.

ప్రక్కనే మంచంమీద పడుకొని మత్తుగా, ఒళ్ళు తెలియకుండా నిద్రపోతున్న ప్రసాద్ ని చూసేటప్పటికి అసూయపుట్టింది. "ప్రాణస్నేహితుడు ఒకమూల ఇంత బాధతో క్రుంగిపోతుంటే, యింత ఆవేదనను అనుభవిస్తుంటే, వీడు ఎంత హాయిగా నిద్రపోతున్నాడు" అనుకొని ప్రసాద్ వైపు కోపంగా చూశాడు. అవశంగా వళ్ళు చితక్కొట్టి లేపా లనిపించింది.

ఛీ! వీడు తన బాధను అసలు అర్థం చేసుకోడే ఒరేయ్ ఫూల్! 'కమల కాకపోతే యింకొక పిల్లమ్మా. ఇంత చిన్న విషయానికి ఎందుకురా అలాగ అరవ సినిమాలో హీరోలాగ బాధపడతావు' అని తన ప్రేమని అవ

హేళన చేశాడు ఇడియట్! రేపు ప్రొద్దున నాలుగుగంటలకు "పిడి" వేయటానికి లేచినప్పుడు. శాశ్వత నిద్ర పోతున్న శేషగిరిని చూసి భోరున ఏడుస్తాడు. 'వాడు బ్రతికుండగా, వాడి హృదయంలోని బాధను తెలుసుకొని ఓదార్చలేక పోయానే' అని వాపోతాడు. కాని ఏంలాభం? పోయిన శేషగిరి తిరిగి రాడుగా తృప్తిగా సిగరెట్టు దమ్ము లాగి, మళ్ళీ టేబిల్ దగ్గరకు వెళ్ళాడు.


కుర్చీలో కూర్చుని, కొద్దిగా వణకుతున్న చేతులతో, చిరు చెమటలు కారుతుండే వ్రాయడం ప్రారంభించాడు.

"ఒరేయ్ ప్రసాద్!

నేను ప్రాణంకన్నా సిగరెట్లకన్నా, కాఫీకన్నా అధికంగా ప్రేమించిన కమల నన్ను దయలేనిదై, కఠిన పాషాణ హృదయయై తిరస్కరించి, నా మనస్సులో అంతులేని క్షోభను రేకెత్తించిన సంగతి నీకు తెలుసున్నదే కదా! ఆమె తిరస్కారాన్ని భరించలేక, ఆమె తోడులేనిదే యీ ప్రపంచంలో బతుకలేక, నా ప్రేమను శాశ్వతం చేసుకోడానికి నేను యీ లోకంనుంచి శలవు తీసుకొంటున్నాను. నా ఆత్మహత్యను నువ్వు అంగీకరించవని చెప్పలేను.

ఒరేయ్ ప్రసాద్! ఎప్పుడైనా నీయీ స్నేహితుడు శేషగిరి జ్ఞాపకం వస్తే ఒక్క కన్నీటి చుక్కను రాలుస్తావు కదూ!

నా మరణవార్త నువ్వే స్వయంగా కమలకు చెప్పాలిరా. ఆమెకు నువ్వే



ఓదార్చాలి. ఆమె అడిగితే నేను సూట్ తో తీయించుకొన్న కాబినెట్ సైజు ఫొటో ఒకటి ఆమె కియ్యి. నాయీ ఆఖరి కోరిక మన్నిస్తావుకదూ!

నేను కిళ్ళీ కొట్టు, హోటలులోను పెట్టిన ఖాతా బాకీలు నా పర్సులోని డబ్బుతో చెల్లించెయ్యి. నా ఫార్మాకాలజీ పుస్తకాలు అవీ నువ్వు తీసేసుకో.

జీవితంలో ఆడదానికోసం మోసపోకుండా నువ్వయినా బాగుపడు. ఇంక శలవు తీసుకొంటారా!"

నీ ప్రాణస్నేహితుడు,
ప్రేమజీవి
కె. శేషగిరి."

ఉత్తరం ముగించి, రెండు మూడు సార్లు చదువుకొని, బాధగా కుర్చీలోకి వాలాడు శేషగిరి. బల్లమీద చేతులు

అన్ని. తలను వాటిపై పెట్టి కాసేపు ఆలోచించాడు. ధైర్యం కాళ్ళక్రింద నుంచి కొద్దిగా సడలిపోయింది. ఇలాగైతే తను ఓడినట్లవుతాడు. ఎలాగైనా తన నిర్ణయాన్ని అమలు జరపాలని గట్టిగా నిశ్చయించుకొని. పిడికిలి బిగించి లేచాడు. కప్పులో కాఫీ కొద్దిగా 'సిప్' చేశాడు. సిగరెట్టు వెలిగించాడు.

వణుకుతున్న కాళ్ళతో నెమ్మదిగా అల్మారా సమీపించాడు. తలుపు తీయగానే కనిపించిన చెక్క పెట్టె చూసేటప్పటికి అతని ధైర్యం అమాంతంగా దిగజారిపోయింది "ఛీ! ఈ పాడు పని ఎందుకు? హాయిగా బ్రతుకు" అని ఒకవైపునుంచి మనస్సు బోధించింది. "ఇంత అవమానం పొందాక ఇంకా బ్రతుకుతావా? రేపొద్దున కమలకు, కమలలాంటి అనేక పాషాణ హృదయ నారీమణులకు నువ్వు గుణపాఠం నేర్పాలంటే ఈ ఆత్మహత్య చేసుకుతీరవలసిందే ఛీ! నువ్వు ప్రాణాలకోసం బేలవయ్యే పిరికివండిగా ప్రవర్తిస్తావా?" అంటూ యింకొకవైపునుంచి గట్టిగా జగ్గయ్య టోన్‌లో ఆత్మ ప్రబోధించింది. ఈ రెండు సలహాలను కాసేపు తక్కెడలో తూచి, మళ్ళీ ధైర్యం తెచ్చుకొని, చెక్కపెట్టెను వణుకుతున్న చేతులతో తెరచాడు లోపల చిన్న సీసాను చూడగానే వళ్ళు జలదరించింది. గొంతు గుండెలో కొట్టుమిట్టాడింది.

"ఈ స్లీపింగ్ పిల్స్ తను ఎవరికీ అనుమానం రాకుండా అతి జాగ్రత్తగా



సంపాదించాడు. ఇవి ఒక దుర్భాగ్య ప్రేమైక జీవి, భగ్నప్రేమిక నివేదిక శాశ్వతంగా విద్యార్థుల చరిత్రలో నిలవడానికి ఉపయోగిస్తున్నాయి" అనుకొని శేషగిరి ధైర్యం కూడగట్టుకొన్నాడు. ఆలస్యం చేస్తే మనసు మారుతుందేమోనని. వెంటనే ఆ పిల్సు నోట్లో వేసికొని మ్రింగేశాడు.

శేషగిరికి శరీరం తేలిపోతున్నట్లనిపించింది. శక్తులన్నీ ఉడిగిపోయాయి.

కాళ్లు చేతులు తెగలాగసాగాయి. బుర్ర తిరగడం మొదలెట్టింది. ప్రపంచమంతా మసక మసకగా కనిపించసాగింది. నాలుక పిడచకట్టుకుపోయింది మంచి నీళ్ళకోసం ముందుకు వెళ్ళబోయాడు గాని, కాళ్లు కదలలేదు. పట్టుతప్పి తూలుతూ, పక్కనే ఉన్న మంచం మీద భారంగా వ్రాలాడు. ఊపిరి తీసు కోవడం కష్టంగా ఉన్నట్టు ఫీలయ్యాడు. దూరంగా యమదూతలు వస్తున్నట్టు కనిపించింది. అదుగో! తన చుట్టూ పాశం వేస్తున్నారు. అరే! తన నిలా ఎక్కడికి తీసుకుపోతున్నారు? మధ్యలో చిన్న కాలిబాట. చుట్టూ అగాధాలు. దారినిండా ముళ్ళు. తెలుగు సినిమాలోని యమలోకం సెట్టింగు లాంటి సీను కనిపించింది. చుట్టూ దుర్గంధం. పాపుల హాహాకారాలు. తనని నిప్పులో తోసేస్తున్నారు. "బాబోయ్!" అని అరిచాడు.

"ఏమిటిరా నీ కలవరింతలు? గొడవ చెయ్యకుండా పడుకో వెధవా!" అంటూ ప్రసాదు ఒత్తిగిలి పడు కున్నాడు.

"అయితే ఇదంతా నా ఊహా సన్నమాట" అనుకొన్నాడు శేషగిరి. "ఇప్పుడు కాకపోయినా, ఇంకా పేవ టిలో చావడం ఖాయం. మాత్రలు పని చేయడం ఆరంభించినట్లున్నాయి. కను

నవ్వులాట

★ "నేను ముసలిదాన్ని అయినా, ఇంతగానూ ప్రేమిస్తారా?" అని భార్య అడిగింది గోముగా.

"ప్రేమించడమా? పూజిస్తాను. నీ పాదాలు నడిచిన ప్రతిచోటా పువ్వులు పరుస్తాను. నీ కోసం ఏమైనా చేస్తాను.... అన్నట్టు నువ్వు మీ అమ్మ లాగ తయారు కావుగదా?"

మేష్టారు తీసివేతలు నేర్పుతూ "ఒరే సోమూ! నీ దగ్గర ఆరు పళ్ళున్నా యనుకో. నేను మూడు అడిగాననుకో. నీ దగ్గిర ఎన్ని మిగులు తాయి?"

తడుముకోకుండా సోము చెప్పాడు: "ఆరు పళ్ళండి."

—గుడిపాటి లక్ష్మీనరసింహం.

రెప్పలు మత్తుతో వాలిపోతున్నాయి" శేషగిరిని మళ్ళీ భయం ఆవరించింది.

"మా అమ్మా, నాన్నా, చెల్లాయి ఎంతగా ఏడుస్తారో నేను చచ్చిపోతే. అయినా, చచ్చి సాధించేదేముంది? కమల గుండె నాలాంటివాళ్ళ ఎంత మంది చావులు చూసి రాయి అయిపోయిందో. అయినా 'అఫ్టరాల్' ఒక్క అమ్మాయికోసం, ఇంత పర్సనాలిటీ, తెలివితేటలు, డబ్బు ఉండగా నేను చచ్చిపోవడమా! వీల్లేదు. నేను బ్రతకాలి! బ్రతికితీరాలి!" అనుకొన్నాడు.

లేచి తడబడుతున్న అడుగులతో ప్రసాద్ మంచం దగ్గరకు వెళ్ళి "ఒరేయ్! లేవరా. త్వరగా లేవరా. నేను చచ్చిపోతున్నానురా" అని గట్టిగా కుదపసాగాడు.

"నువ్వా! చస్తున్నావా? చచ్చిపో. ఆ మాత్రానికి నా నిదర పాడుచెయ్యడ మెందుకురా గాడిదా! నన్ను పడుకోనీ" అని గాఢంగా గురకపెట్ట సాగాడు ప్రసాద్.

శేషగిరికి తాడెత్తున కోపమొచ్చింది. ఒకప్రక్క ప్రాణస్నేహితుని ప్రాణాలు పోతుంటే, చీమకుట్టినట్టు పడుకొంటాడా? దొంగ రాస్కెల్. వీడు స్లీపింగ్ పిల్స్ తిని చావ!" అనుకొని పళ్ళు కొరికాడు శేష.

వీపుమీద నాలుగు చరిచి లేపి "ఒరేయ్! నేను నిజంగా చచ్చిపోతున్నానురా. ఒట్టురా. లేవరా! ఎలాగైనా నేను బ్రతికే మార్గం చూడరా!" అని బ్రతిమిలాడాడు.

"కమ్మటి నిద్ర మట్టిపాలు జేశావు గదరా శనీ! ఇంతకీ ఏం మింగావురా? చెవికోసిన మేకలాగ అరుస్తున్నావు. తొందరగా తగలడు" అన్నాడు ప్రసాద్ విసుగ్గా.

"స్లీపింగ్ పిల్సురా! ఒకటి కాదు, రెండు కాదు. ఏకంగా పదిరా! నన్ను వెంటనే హాస్పిటల్‌లో జేర్పించు. ప్లీజ్" ప్రాధేయపడ్డాడు శేష.

"పడితింటే ఇంక యిప్పుడు నిన్ను హాస్పిటల్‌కు తీసుకువెళ్ళినా లాభం లేదు. ఆ మంచంమీద పడుకో. హాయిగా "గయా" కొట్టేస్తావు. నువ్వేం భయపడకు. నిన్ను గంధం చెక్కలతో కాల్చే ఏర్పాటు చేస్తానులే."

"ఐతే నేను బ్రతకనంటావురా!"

"మళ్ళీ మళ్ళీ నన్ను అడగాలా! ఇష్టమై మాత్రలు మింగినవాడివి. మళ్ళా ఈ కాకిగోల ఎందుకు? హాయిగా చావు."

"బుద్ధి పొరపాటయి తిన్నానురా. ఒరేయ్! మా అమ్మా నాన్నలకు ఒక్కడే కొడుకునిరా! నేను పోతే వాళ్ళు బెంగతో కుమిలిపోతారు. వాళ్ళ కోసమైనా నేను బ్రతకాలి. ఎలాగైనా నేను బ్రతికేమార్గం చూడరా!"

"ప్చ! నిన్ను చూస్తే జాలేస్తుందిరా


శేషూ! కావి చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ఏం లాభం. మీ పేరెంట్సుని నేను ఓదారుస్తాలే. మళ్ళీ వచ్చే జన్మలో కలుసుకొందాం బై. బై" అంటూ మళ్ళీ మంచంమీదజేరి ముసుగు పెట్టాడు ప్రసాద్.

శేషగిరి ఒక్కసారి బావురు మన్నాడు. కళ్ళలోంచి నీరు ఏకధాటిగా ప్రవహించ సాగింది. "ఒరేయ్! నామీద కనికరం చూపరా! నా యీ చివరి గడియల్లోనైనా నాకు తోడుగా ఉండరా! నీ స్నేహితుడు చచ్చిపోతుంటే జాలిలేకుండా అలా పడుకుంటావురా? ఒరేయ్ లేవరా" అని గద్గద స్వరంతో బ్రతిమాలసాగాడు శేషగిరి. ఎక్కిళ్ళతో యింకా అతని కంఠం కూరుకు పోయింది. నిరాశతో అక్కడ చతికిల బడి పోయాడు.

ప్రసాద్ లేచివచ్చి శేషగిరి భుజం మీద చెయ్యివేసి "ఒరేయ్! భయపడ కురా, నువ్వు తిన్నవి స్లీపింగ్ పిల్సు కాదు. శాకరిన్ టాబ్లెట్సురా!" అన్నాడు.

శేషగిరి ఒక్క ఉదుటున లేచి మంచవి "నిజంగా" అంటూ సంభ్రమాశ్చర్యాలతో అడిగాడు.

"నిజంగానా! ఈ మధ్య కమల చేత తిరస్కరింప బడ్డాక నీ వెర్రి ప్రవర్తన కనిపెడుతూనే ఉన్నాను. ఏదో అఘాయిత్యం చేసేలాగ కనిపించావు.





అందుకని నీపై నిఘా వేసి ఉంచాను. నిన్న ప్రొద్దున నువ్వు ఏదో సీసా, భయం భయంగా ఆ పెట్టెలో పెట్టడం బయట నుంచి చూశాను. నువ్వు బయటకు వెళ్ళాక, ఆ సీసాలోని నిద్ర మాత్రలు తీసి బయట పడవేసి, మందుల షాపుకు వెళ్ళి, 'శాకరిన్ మాత్రలు' తెచ్చి దాంట్లో వేశాను. అందుకని యిప్పుడు నీ ప్రాణానికేమీ హానిలేదు. ఇక ముందెప్పుడూ ఇటువంటి పిచ్చిపనులు చెయ్యకు!" అన్నాడు ప్రసాద్.

"ఒరేయ్ ప్రసాద్! నిజంగా దేవుడివిరా" అని ఎగిరి గంతేసి కౌగలించుకొన్నాడు ప్రసాద్ని శేషగిరి.

ఖాళీ సీసా ఫక్కున నవ్వింది!

* * *





అసమర్థుడు

డి. కామేశ్వరి

సుబ్బారావు రేపు చచ్చిపోవడానికి గట్టిగా నిశ్చయించాడు. రేపటితో యింక తను యీ భూమ్మీద వుండ కూడదని తీవ్రంగా ఆలోచించి నిశ్చయించేశాడు సుబ్బారావు.

'చచ్చిపోవాలి' చచ్చిపోవాలి అనుకుంటూనే ముప్ఫైఏళ్ళు బ్రతికాడు సుబ్బారావు! చావంటే ఏమిటో తెలిసింది మొదలు చచ్చిపోవాలనుకుంటూనే వున్నాడు....అనుకుంటూనే రోజులు గడిపేసాడు!

యీ మారు అలాంటి అనుకోవడం కాదు!.... నిజంగానే అనుకున్నాడు. గట్టిగానే అనుకున్నాడు!

చావాలి! .... చచ్చిపోయి కనీసం తనకి చావడమన్నా చేతవచ్చని నిరూపించాలి. చచ్చి సాధించాలి. చచ్చి పగతీర్చుకోవాలి. ఎవరిమీద? అందరి మీదా! యీ ప్రపంచంమీద. యీ మనుష్యులందరిమీదా ముఖ్యంగా ఆ రాక్షసి. అదే ఆ పెళ్ళాం అనబడే అహంకారి! ఆ అమ్మవారు. ఆ శూర్పణఖ. ఆ భూతం, ఆ దెయ్యాన్ని కుళ్ళి కుళ్ళి ఏడ్చేట్టు చేయాలి! తనుచచ్చి దాన్ని వెధవముండని చేసి మూల కూర్చోపెట్టాలి. అప్పుడుగాని బుద్ధిరాదు దానికి! తన విలువ! తన ప్రయోజకత్వం అప్పుడుగాని తెలిసిరాదు. కూతురు ముండమోసి కూర్చుంటే... తనని యిన్ని బాధలు పెట్టినవాళ్ళు తను ఏడుస్తూంటే నవ్వినవాళ్లు....తనని ఏడిపించినవాళ్లు కుళ్లి కుళ్లి ఏడ్చేట్టు చావాలి. చావాలి. సుబ్బారావులో పగ రాజుకో సాగింది.

"చచ్చిపోవాలి!.... ఎలా?.... ఛా చావడానికి యింత ఆలోచన ఏమిటి ....చావాలంటే ఎన్ని మార్గాలులేవు ?! విషంతినొచ్చు. ఉరేసుకోవచ్చు. నూతులోనో చెరువులోనో పడొచ్చు! ఏ రైలు క్రిందో బుర్ర పెట్టొచ్చు అన్నింటికంటె విషం తిని చావడం సుళువు! హాయిగా దర్జాగా. మంచం మీద పడుకుని చావచ్చు! కాని.... తాను చచ్చి పోయే ముందు నలుగురికి తెలియాలి!.... చచ్చిపోతుంటే వాళ్ల మొహాలు ఎలా వుంటాయో చూసి ఆనందించాలి!.... అందరికీ తన ప్రయోజకత్వం చూపి వాళ్లని ఏడిపించి పగ తీర్చుకుని మరీ చావాలి!....

"రాత్రి అయితే ఎవరూ చూడడానికి అవకాశం వుండక పోవచ్చు అంచేత తీరుబడిగా లేచి ఉదయం కాఫీలో విషం కలిపి త్రాగడానికి నిశ్చయించాడు సుబ్బారావు ... విషం తెచ్చుకుని సాయంత్రమే జాగ్రత్త చేసుకుంటాడు .... యింక ఆచరణలో పెట్టడమే ఆలస్యం!....

"తనవిలువ అందరూ గుర్తించే రోజు వస్తుంది. రాబోతుంది! లేకపోతే తననందరూ యింత హీనంగా చూస్తారా? తెల్లవారింది మొదలు ప్రతివెధవలూ 'హేళనచేసి' ఓ చవట దద్దమ్మగా జమకట్టి నోటికొచ్చినట్లు మాట్లాడుతారా? .... ఊర్లోవాళ్ల బుద్ది గడ్డితింటే. యింట్లోవాళ్లు కన్నతల్లి, తండ్రి.... కట్టుకున్న భార్య. పిల్లనిచ్చిన అత్త మామలు.... ఆఖరికి బొడ్డూడని ఐదేళ్ల వెధవ ... ఆ కుర్ర వెధవ ఆ కొడుకుగాడు కూడ తనని లోకువ చేసి అవమానిస్తారా? కోపంతో, అవమానంతో సుబ్బారావు శరీరం దహించుకు పోసాగింది.

"ఒక్క రెండు రూపాయల కోసం ఎన్ని మాటలన్నారు! యింట్లో గొడ్డులా, పాలేరు వెధవకన్న కష్టంగా ఇరవై నాలుగు గంటలు పొలాల్లో పేడలో బురదలో చావిలో, వానల్లో ఎండల్లో రాత్రనక పగలనకా శ్రమిస్తే.... రెండు రూపాయలు ఖర్చు పెట్టుకోవడానికి స్వతంత్రంలేని బ్రతుకు! ఆఖరికి పాలేరు వాళ్లకి నెలకి ఇచ్చేపాటి పావలా అర్ధరూపాయ విలువకి లేదు! జీతం బత్యంలేని కమతగాడయి పోయాడు ఆఖరికి! తిండి పెట్టకపోతే చస్తాడని, చస్తే తన కూతురికి పసుపు కుంకం వుండదని ఏదో విసుక్కుంటూ కసురుకుంటూ యింత తిండి పడేస్తున్నాడుగాని లేకపోతే అదీలేక పోను!

సిగరెట్లకి రెండు రూపాయలడిగితే "ఆ(.... దమ్మిడీ సంపాదన లేదుగానీ. రోజుకి రూపాయి సిగరెట్లు మాత్రం కాల్చాలి! ఇంకొకరి తిండి తింటూ పెద్ద ఆఫీసరులాగ దర్జా వెలిగించడానికైనా సిగ్గు వేయదు కాబోలు!" ఈసడింపగా, మొగుడన్న గౌరవమైన లేకుండా అంటుందా ఆ పెళ్ళాం!

ఛా. వెధవ సిగరెట్ల అలవాటు ఎంత మానుకుందామన్నా మానుకోలేక, గతిలేక అభిమానం చంపుకుని ఏ నాలుగైదు రోజులకో రూపాయి అడిగితే.... అలా అంటుందా? అంత తలబిరుసా దానికి!

వళ్ళు మండిపోయి కాస్త గట్టిగానే అన్నాడు ఉదయం "ఏం, మీ యింట్లో గొడ్డులా చాకిరి చేస్తున్నాను. ఏం, ఆ మాత్రం నౌకర్లపాటి చేయక పోయానా? వాళ్ళకి జీతం యీయడం లేదా? అలాగే అనుకో!" అన్నాడు సుబ్బారావు

"మీ పొలం పని మీరు చేసుకోవడం ఎవరికి ఉద్ధరింపు? ఏదో పాపం. ఎవరికో చాకిరి చేస్తున్నట్లు మాట్లాడుతున్నారు. మావాళ్ళకేమిటి.... ఇవాళుంటారు, రేపు ఇదంతా ఎవరిది?" అంది గడుసుగా! పని చేయించుకునే టప్పుడు మాత్రం మహా చక్కగా, నెమ్మదిగా చెప్తుంది, కసిగా పళ్ళు కొరికాడు సుబ్బారావు.

ఆ మామ ఎప్పుడు చస్తాడో, ఎప్పుడు ఆ పొలం స్వంతం అవుతుందో దేముడికి ఎరుక! కాని, యీ లోపల తను చావడం నిశ్చయం!

ఆ మామకూడ చుట్టపొగ గుప్పు గుప్పుమని వదులూ సావకాశంగా ఆరంభించాడు. కూతురిని వెనకేసుకు వచ్చి "జీతం యిచ్చి పనిచేయించుకునేందుకు నౌకర్లు చాలమంది దొరుకుతారులే నాయనా! నీకెందుకు జీతం యిచ్చి చేయించుకోవడం? అయినా, నాకు తెలియక అడుగుతా, ఎవరికి చేస్తున్నావంట; ఎవరికోసం చేస్తున్నావు? నాకోసమా, నీకోసమా. ఉంటే నీవు, నీ పెళ్ళాం, నీ పిల్లలే తింటారు రేపొద్దున! మా కోసం నీవు కష్టపడుతున్నావన్న పిచ్చి భ్రమలో వుంటే, అది విడిచిపెట్టుకో. ఇంతకీ నిన్నింట్లో వుంచుకుని పోషిస్తున్నది ఎందుకంటావు? అంతగా వుండడం యిష్టం లేకపోతే నిన్నెక్కడ ఎవరూ పట్టుకు కూర్చోలేరులే బాబూ" అంటూ చల్లచల్లగా జాడించి వదిలాడు.

ఎక్కడికీ తను వెళ్ళలేడనేగదూ, అది తెలిసేగదూ అంత నిర్భయంగా నిరసనగా అనగలిగారు. సుబ్బారావు నిట్టూర్చాడు.

"ఓయబ్బో. ఏం వున్నా లేకపోయినా, పౌరుషానికేం లోటు లేదు అల్లుడుగారికి" అంది నెమ్మదిగా అత్తగారు.... 'ఏం చూసుకునో అంత మిడిసిపాటు' యీసడింపుగా చూసింది అత్తగారు.

అవును, ఏం చూసుకుని తనకీ మిడిసిపాటు! గతిలేక యిల్లరికపు టల్లుడిగా వచ్చిన తనకి పౌరుషం కూడ ఎందుకు? ఉద్యోగం సద్యోగం లేకుండా వీళ్ళింట్లో వుండబట్టిగదా వీళ్ళకింత తల పొగరు. యింత నీచంగా, హీనంగా చూస్తున్నారు.... ఇంత లోకువయ్యాడు అందరికీ, వీళ్ళనని ఏం లాభం? తనవాళ్ళని అనాలి... ఏభై యకరాల మాగాణి, ఒక్కతే కూతురు. నీవిక్కడ

వుంది చేసే నిర్వాకం ఏముంది? ముష్టి నూరు రూపాయల ఉద్యోగం కోసం చూస్తే అంతల బోలెడు ఆస్తి! నీలాంటి వాళ్లు వాళ్లకి కావల్సినంత ఉంది కొరుకు తారు అంటే నిజమే ననుకున్నాడు. యెక్కడైనా తనకీ లభ్యమయ్యే ప్రేమా భిమానాలు ఒకచోటదాని బుద్ధి గడ్డితిని వప్పుకున్నాడు. ఈ యిల్లరికపు అల్లుడిని చేసి మానాభిమానాలు చంపుకుని బ్రతకమన్న తనవాళ్ల ననాలి అసలు.

పెళ్ళయిన ఓ మూడు నెలలేమో కాస్త అల్లుడన్నట్టు చూశారు సుబ్బారావుని అతవారు.

తరువాత, తరువాత క్రమంగా ఒక్కొక్క పని నెమ్మదిగా అప్పచెప్ప సాగాడు. "చూడు సుబ్బారావు....ఆ కూలివెధవ లేంచేస్తున్నారో, దగ్గిరుండక పోతే చేసిచావరు నా వంట్లో బాగు లేదు. కాస్త పొలం వెళ్లినాలుగు రోజులు" అన్న మామగారికి నాలుగు రోజులుకాదుకదా నాలుగేళ్లయినా వంట్లో సరిగా లేకపోవడం, పాపం సుబ్బారావు చాల రోజులవరకు ఆ సంగతి గమ నించలేకపోయాడు. పొలం పనులన్ని తన డ్యూటి అయిందని తెలుసుకు న్నాడు చాలా రోజులతర్వాత. తెలుసు కున్నా ఏంచే యగలడుగనక! అక్కడికీ ఒకసారి కనకం దగిర చూచాయగా అంటే "మానాన్నకి వంట్లో బాగుండడం లేదు, పెద్దవారయ్యారు, ఓపికలేదు అవి ముందులో అనే కనకం రోజులు గడి చినకొద్దీ మా నాన్న పెద్దవారయ్యారు. సాయం కావాలనేకదా ఇంట్లో మిమ్మల్ని తెచ్చిపెట్టుకున్నారు. మీ యూ రికే కూలోళ్ళకి నికా ఇల్లరికపు టల్లుడని తెచ్చుకున్నది" అని కుండ బద్దలు కొట్టి నట్లు చెప్పేసింది. ఆదెబ్బతో పెళ్లాంతో ఫిర్యాదులు మానాడు సుబ్బారావు

"చూడబ్బాయ్. ఆ గేదెలు వచ్చి పడ్డాయి. ఆ పాలేరు వెధవ ఎక్కడికి పోయాడో. కాస్త కట్టేద్దూ అని అత్త గారు ముందు రోజు అంటే, కాబోలను కున్న సుబ్బారావుకి ఆ పాలేరు వెధవ రోజూ ఆ వేళకి ఎక్కడ తగలబడు తున్నాడో అర్థం అయి. గేదెలు కట్ట డం. వాటికి మేత, కుడితి వగైరాలు పెట్టడం. పాలు తీయడం అన్నీ తన పనులలో జమకట్టారని తెలియవచ్చే సరికి గిర్రున ఏడాది తిరిగిపోయింది.

"కనకానికి పూలంటే ప్రాణం.... ఆ మల్లెమొక్కలు. కనకాంబరం మొక్కలు అన్నీ ఎండిపోతున్నాయి. పెద్దదాన్ని ఓపికలేదు. నీరు తోడలేను. స్నానం చేసేటప్పుడు రెండు చేదలు తోడిపొయ్యి నాయనా" అని అత్తగారు అంటే పోనీలే పూలు పెళ్ళానికే గదా ఆ పెళ్లామూ తన కోసమే గదా పూలు పెట్టుకుంటుందిఅన్న సదుద్దేశంతో ఆరం

ళించిన సుబ్బారావుకి యింట్లో మొక్కలక్కి, పాదులకి, చెట్లకి రోజూ నీళ్లుతోడి పోయడం కూడ తన వంతయిందని తెలుసుకునే సరికి కోపం వచ్చినా ఏం చేయలేకపోయాడు.

అంతేకాక మొదట్లో నూతి గట్టు దగ్గిర ఒక బిందె, బాల్చీ చొప్పున మొదలైన గంగాళాలు, గుండిగలు మొదలైన వాటిలో రోజూ వాడుక్కి నీళ్లు తోడ్డం కూడ తనపనే అని తెలుసుకునే సరికి తనమీద తనకే జాలి పుట్టింది సుబ్బారావుకి

ఉదయాన్నే లేచి హడావిడిగా కాలకృత్యాలు తీర్చుకుని గేదెల పాలు తీసి, వాటికి కుడితి పెట్టి, ఇంట్లోకి కావల్సిన నీళ్లు అన్నీ తోడి ఇన్ని కాఫీనీళ్లు గొంతులో పోసుకుని ఎనిమిది గంటలకల్లా పొలం పరిగెట్టి వానలో తడిసి, ఎండకి మాడుతూ రెండు గంటలకి ఇంటికి చేరి ఇంత తిండి తిని, మళ్ళీ పొలం పరిగెట్టి చీకటిపడే వేళకి కొంప చేరి మొక్కలన్నిటికీ నీళ్ళు తోడి, పశువులన్నింటిని కట్టి మేత వేయడంతో సుబ్బారావు దినచర్య ముగుస్తుంది.

తన పనులేమిటో తెలుసుకున్నాక సుబ్బారావు ఆ యింటి అల్లుడుగా కాక ఓ కమతగాడి క్రింద జత అయ్యానని తెలుసుకున్నాడు. ఆ యింట్లో అందరూ, ఆఖరికి కనకం కూడ ఆ దృష్టితోనే చూస్తున్నట్లు గ్రహించడానికి చాల రోజులే పట్టింది పాపం సుబ్బారావుకి!

మొదట్లో మామగారి పంక్తిన మామగారితో సహా, పెరుగు అదీ వేసి వడ్డించేవారు. తరువాత, తరువాత సుబ్బారావు వచ్చే వేళకి మామగారు, అత్తగారు, కనకంతో సహా అందరూ భోజనాలు చేసేసేవారు. ఏ పాలేరు వాడికో పెట్టినట్లు అడుగు బొడుగు అన్నం, చాలీచాలని కూరలు, మజ్జిగనీళ్ళతో కనకం వచ్చి వడ్డించేది సుబ్బారావు వచ్చాక.

ముందు ఒకటి రెండు సార్లు కనకం వడ్డిస్తూ "అబ్బ! మీ రొచ్చే సరికి మరీ ఆలస్యం అవుతూంది. నీరసంగా వుంటుందనీ తినేస్తున్నాను, అమ్మా వాళ్లుతినేయమంటే!" ఏమనుకుంటాడో అన్నట్లు అంది. ప్రక్కన వున్న అత్తగారు కూతురికి వంత పాడుతూ "అవునే తల్లీ, ఉత్త మనిషివికూడా కాదు, అతనికోసం నీ వెందుకు పడిగాపులు పడి కూర్చోవడం ..." అంటే ఉత్తమనిషికాని కనకాన్ని గురించి జాలిపడి పోనీలే అనుకున్నాడు. కాని తర్వాత కనకం గట్టి మనిషయ్యాక కూడ ఆ అలవాటు మారకపోవడం గమనించాకగాని సుబ్బారావుకి వాళ్లు తనకి ఏపాటి మర్యాద యిస్తున్నారో గ్రహించలేకపోయాడు! తెలుసుకున్నా ఏమనగలడు? అన్నా ఎవరూరుకుంటారు? ఒకసారి కనకంతో మాటవరసకన్నట్లు అంటే కనకం

గయ్యమని లేచింది. "ఏం మీరే రెండు గంటలకో వస్తే అప్పటివరకు నేను మాడుతూ కూర్చుంటేగాని మీమీద గౌరవం వున్నట్టు కాదా! నేనుండలేనుసుమా రెండు జాముల వరకు" అని నిర్మోహమాటంగా చెప్పేసింది. "ఏం తెగులు, ప్రొద్దుట కంచెడు చద్దన్నం తిన్నదానివి, కాఫీ నీళ్లు త్రాగిన నాకోసం ఆ మాత్రం వుండలేవా" అని అడుగుదామన్నా అడగడానికి ధైర్యం చాలని సుబ్బారావు 'ఇంకేం అంటాడు! పాపం, పట్నవాసంలో పుట్టిపెరిగిన సుబ్బారావుకి చద్దన్నం తినడం అల వాటు లేక, ఇటు టిఫిన్లులేక ఉత్త కాఫీనీళ్లతో రెండు జాములవరకు వుండడం ప్రాణం కడకట్టినట్లు వుండేది! దానికి సాయం ఆ చప్పగా చల్లారిన భోజనం, ఆ పెట్టే తీరు చూసి ఆ వున్న ఆకలి కాస్త మాయమయ్యేది!

కనకం ఒక్కర్తే కూతురు అవడం వల్ల, చాలా గారాబంగా పెంచ డంతో, మంకుతనం, మాట పెళుసు బొత్తిగా మంచి మర్యాద లేకుండా ప్రవర్తించడం, నోటి తొందర అన్నీ ఒకపాలు ఎక్కువేనన్న సంగతి సుబ్బారావుకి పెళ్లయిన నెలకే బోధపడింది. ఆకారంలోనే కాక బుద్ధులలో కూడ గయ్యాళితనం తొంగిచూసే కనకం సుబ్బారావుకి ఓ మహంకాళిలా కన్పించి ఆమె నోటికి జడిసేవాడు. ఖర్మం కాలి ఓ చిన్నమాట అన్నా కనకమే కాక ఆమె తరుపున ఆ తండ్రి, ఆ తల్లి కూడ ఏకమయి సుబ్బారావు నోరు మూయించి, అతని స్థానం గుర్తు చేసేవారు.

సుబ్బారావు భార్యవల్ల సుఖపడి నదీ,కనకం భర్తని గౌరవంగా చూసినరోజులుఏమయినావుంటే అవి పెళ్లయిన ఓ రెండు మూడు నెల లేమో! అప్పటి నించి కనకంలో సుబ్బారావుపై అగౌరవం, సుబ్బా రావుకి కనకంపై ఏహ్యం రోజు రోజుకి పెరగ సాగింది. ఉత్తశుద్ధ పల్లెటూరి మొద్దులావుండే కనకాన్ని చూస్తూంటే అదోలా అనిపించేది సుబ్బారావుకి. ఆ బిగించి వేసిన గరిట కాడలాంటి జడ, తల్లో తట్టెడు పూలు, కాళ్లకి పట్టీలు, ఇంత పాము కున్న కాటుక, మోకాళ్లపైకి కట్టిన చీర. బొత్తిగా మోటుగా కనిపించేకనకంలోవెదికినానాజూకు తనం, నాగరికత కనిపించేది కాదు సుబ్బారావుకి. పోనీ ఆకారంమాట అలావుంచి బుద్ధులు, చేష్టలు కూడ చాల అనాగరికంగా కనిపించి ఏహ్యించుకునేవాడు సుబ్బారావు అలా కంచెడు చద్దన్నం తినడం, పెద్దగొంతు పెట్టి మాట్లాడం. ఐదో క్లాసు చదివిన పాండిత్యం అంతా చూపిస్తూ, ఊర్లో ఆడవాళ్ళందరిని పోగేసి తండ్రి పట్నం నించి తెచ్చిన పత్రికలు, ఓ పురాణగ్రంథాల్లా పెద్ద గొప్పగా రోజుకోపేజి కష్టపడి చదివి విన్పించడం, కనకం తెలివి తేటలకు, చాతుర్యానికి మురిసి

పోతూ అమ్మా, అత్త, పూర్లో వాళ్లు తలలూపుతూ మహానంద పడి పోవడం, అవన్నీ చూస్తే పట్నవాసంలో పుట్టి పెరిగిన సుబ్బారావుకి మరీ ఒళ్లు కొచ్చేది. కనకాన్ని ఏమనలేక, ఏమన్నా వినదని తెలిసి కనకం మీద విహ్వాన్ని పెంచుకోవడం తప్ప ఏంచేయలేక పోయాడు.

మొదట్లో యింటిదగ్గరనించి తెచ్చుకున్న కాస్తడబ్బూ అయిపోవడంతో పైఖర్చుకి ఎవరిని అడగాలో తెలియక ఇబ్బందిపడి ఆఖరికి యింటికి తండ్రికి రాస్తే "నీకు డబ్బు యిచ్చేపాటి డబ్బునాకే వుంటే నిన్ను యిల్లరికం ఎందుకు యిస్తాను నాయనా! నీ బాధ్యత, మంచి చెడ్డలు అన్నీ నీతో పాటు వాళ్లకే అప్పగించాను,... మొహమాటపడి లాభంలేదు... ఒకరోజులో పోయేది గనకనా జన్మంతా అక్కడ గడపవలసినవాడివే, వాళ్లని కాక పోతే ఎవరిని అడుగుతావు ఎవరిస్తారు? అడగందే అమ్మయినా పెట్టదు నాయనా" అంటూ ఉత్తరం రాశాడు.

మొదటిసారి సిగ్గుపడుతూనే భార్యని ఓ పదిరూపాయలు అడిగితే ఏ మనుకుందో కనకం వెంటనే తండ్రిని అడిగి తెచ్చియిచ్చింది. రెండు మూడు సార్లు అలాయిచ్చి అక్కడనించి విసుక్కోవడం ఆరంభించింది. "అస్తమానూ పనులు ఇరవైలు అడగడానికి మీకు మొహమాటం లేదేమో గాని నాకుంది. అయినా ఏదో అర్జించి పోస్తున్నట్టు, ఈ ఖర్చులేమిటి మీకు" అని కసరడం [illegible] చింది.

మామగారు కూడ "ఏవమ్మో, రోజు రోజుకి పెరిగిపోతుంది మీ ఆయనగారి ఖర్చు, ఏమున్నా లేకపోయినా, వేషాలకి లోటులేదు దొరగారికి" అని నిరసనగా అనడం, అత్తగారు వంతపాడుతూ "ఆ, ఎందుకు ఖర్చుపెట్టడు, తేరగా వస్తుంటే" అని సన్నాయి నొక్కులు నొక్కడం సుబ్బారావు విన్నా, ఏమి చేయగలడు? మనిషిగా పుట్టి, మనిషిగా బ్రతకలేని, తన బ్రతుకును గురించి జాలిపడడం మినహా! అదే కూతురికయితే, నోట్లోంచి మాట రాకముందే తడవుగా పట్నం పంపించి కొండ మీద కోతినైనా తెప్పిస్తాడు.

ఇంక మనవడు అయితే సరేసరి. తనమీద లేకపోయినా తన కొడుకు మీద అభిమానం వున్నందుకు సంతోషించాడు మొదట్లో సుబ్బారావు. కాని రానురాను ఆ అభిమానం వెర్రితలు పట్టుమని ఐదేళ్ళు లేని ఆ వెధవ కూడ తనని తండ్రిగా గుర్తించనైన గుర్తించక పోవడం సుబ్బారావుకి అవమానమనిపించింది. చిన్నప్పటినించి ఎవరో చెప్పినట్లు ఏం కావల్సినా ఏ తాతపాట్నైనా తండ్రిని అడిగేవాడు కాడు. తాతగారినే అడిగేవాడు. కొడుక్కి కూడా తన అప్రయోజకత్వం తెలియడం సహించలేక పోయాడు సుబ్బారావు. మ్ముద్దుగా కొడుకుని... దగ్గరకి తీసుకోవాలని

పెట్టుకుని "బాబూ ఈసారి ఊరికి వెళ్లినప్పుడు నీకు బొమ్మలు, బిస్కట్లు తెస్తానులే నాన్నా" అని అంటే ఆ వేలెడు లేని వెధవ నిర్లక్ష్యంగా "తాత తెస్తాడులే నాన్నా" అంటాడు. ఆ పసి మనసులో ఆ భావాలు నాటిందెవరో కూడ తెలుసు సుబ్బారావుకి. మాటకి ముందే ఆ కుర్రవాడి దగ్గరే తనని హేళనగా మాట్లాడడం, నిరసనగా చూడడం, తేలికగా నవ్వడం .. యివన్నీ వాడి మనసులో నాటుకుని ఎవరూ లెక్క చేయని తండ్రిని తనూ ఖాతరు చేయనక్కరలేదన్న భావం ఏర్పడి, సుబ్బారావు మాటే లెక్క చేసే వాడు కాదు

ఆ రోజు రెండు నెలల క్రితం ఎంత అవమానం జరిగింది! తల్చుకుంటే సుబ్బారావు ఒళ్లు దహించుకుపోసాగింది. ఆ రోజునించే చావాలన్న కోరిక సుబ్బారావులో ప్రబలింది. ఆరోజు సుబ్బారావు ఏదో పనిమీద పట్నం వెడుతూ, మూడు చక్రాల సైకిలు కావాలని ఎన్నోమార్లు మారాం పెట్టిన సంగతి గుర్తువచ్చి కొడుకుతో "నీకు వచ్చేటప్పుడు సైకిలు తెస్తానులే బాబూ!" అన్నాడు. వాడు నీవేం తెస్తావు? అన్నట్టు నమ్మలేనట్టు చూశాడు. అది విన్న కనకం హేళనగా నవ్వుతూ "ఓయబ్బో సైకిలు తెస్తారట, సైకిలు! దమిడి సంపాదనలేని ఈయన సైకిలు తెస్తారట కొడుక్కి. ఏదో వందలు వేలు ఆర్జిస్తున్నట్టు ఇవి తెస్తాను, అవి తెస్తానని వాగ్దానాలు కూడాను. మీ నాన్నేం తెస్తారురా బాబూ, తాత తెప్పిస్తాడులే నాన్నా" అంది. సుబ్బారావు మనసు గాయపడింది. ఎన్నడూ రానంత కోపం వచ్చింది. ఉగ్రుడై కనకాన్ని మింగేసేట్టు చూశాడు. కనకం ఆకోపాన్ని లెక్క చేయకుండా, రెట్టిస్తూ, "ఏం వున్న మాటంటే అంత ఉలుకెందుకు?... దమ్మిడిసంపాదన లేదుగాని మాటలు చూస్తే కోటలు దాటుతాయి. ఎందుకా గొప్ప కబుర్లు" నిరసనగా అంది. మామగారు, అత్తగారు మొహాలు ప్రక్కకి త్రిప్పుకుని ముసిముసి నవ్వులు నవ్వడం చూసిన సుబ్బారావుకి తన అసమర్థతమీద తనకే ఏహ్యం కలిగింది! మనిషిగా పుట్టి, మనిషిగా గుర్తింపబడని తన బ్రతుకు అంతం చేసుకోవాలని ఆరోజునించీ తీవ్రంగా నిశ్చయించుకున్నాడు. ముప్ఫైఏళ్లుగా తనని మనిషిగా గుర్తించని యీ ప్రపంచం ఇకముందు గుర్తిస్తుందని ఆశించడం వెర్రి అని నిశ్చయించుకున్నాడు సుబ్బారావు. ఈ నిర్లక్ష్యం యింక భరించే శక్తి తనకి లేదని తెలుసుకున్నాడు.

అసలు యీ నిర్లక్ష్యం సుబ్బారావు పుట్టకమునుపే సుబ్బారావు పట్ల అందరికీ ఏర్పడింది! కన్న తల్లికి, తండ్రికి, ఇంట్లో అందరికి లోకువే సుబ్బారావు ముందునించి!

అందరి వెనక తండ్రికి అరవయ్యో

పదిలో, తల్లికి ఏభయ్యో పడిలో కోరుకోని బిడ్డగా, పదిమంది సంతానాన్ని కని విసిగి పోయిన తల్లి, తండ్రులకి పుట్టినబిడ్డ! తల్లి, తండ్రుల్ల ప్రేమకి నోచుకోని బిడ్డ! ఏముద్దు ముచ్చటా నోచుకోని బిడ్డ! సుబ్బారావు పుట్టినందుకు సంతోషించిన ప్రాణిలేదు. "వెధవ! ఉద్ధరించ డానికి పుట్టాడు. సుఖపడిపోతున్నా నేమోనని, దేముడు ఈ వెధవని పంపాడు నాప్రాణానికి! అనిఅధమం రోజుకోసారైనా విసుక్కుని, ఏకాస్త అల్లరి చేసినా చితక బాదేది తల్లి! తన జన్మకితనెంత వరకు బాధ్యుడో, కారణ భూతుడో అప్పుడు గాదు గదా, యిప్పటికీ అంతు దొరకని ప్రశ్నే సుబ్బారావుకి. అప్పుడప్పుడు కొస్త జ్ఞానం వచ్చాక, బుద్ధి తెలిశాక... మరీ అందరూ ఉత్తి పుణ్యానికే తిట్టినప్పుడు, గుడ్ల నీరు నింపుకుంటూ "నేనేంమిమ్మల్ని కనమని ఏడ్చానా? అని అడిగేయాలనుకునేవాడు కోపంగా. కాని, ఆఅడిగే సమర్ధతే సుబ్బారావుకుంటే సుబ్బారావుని అందరూ ఓ అసమర్ధుడిగా ఎందుకు జతకట్టారు?

అసలు సుబ్బారావు అసమర్ధతకి ఏడాదిలోపునే ముద్ర పడింది! తల్లి "మొద్దు వెధవా! ఏడాది వచ్చినా నడ్డి నిలపలేపు. ఏణ్ణర్ధం వచ్చినా నాలుగడుగులు వేయడం రాదు, మూడేళ్ళు వచ్చినా నోరు పెగలదు! ఇలాారకరకాలుగా ...వీలయినపుడల్లా సుబ్బారావు అసమర్ధతని వెల్లడించేదట! బలహీనంగా పుట్టడం పోషణ సరిగా లేక నీర్సంగా వుండడం, అదీ పాపం సుబ్బారావు తప్పేనా? అవునో కాదో ఆలోచించే సామర్ధ్యం సుబ్బారావుకి లేదు. బామ్మ ఐదేళ్ళు వచ్చేక కూడ ముద్దలుచేసి తినిపిస్తూ "వెర్రి నాగన్నా! తిండి తినడం కూడా రాదు. ఎలా బ్రతుకుతావురా సన్నాసీ, అని ముద్దుముద్దుగా చివాట్లు పెట్టేది. ఆటపాటల్లో సుబ్బారావునిచేర్చుకునేవారు కారు అక్కలు, అన్నలు, అధవా చేర్చుకున్నా "వెధవా!" దాక్కోవడం కూడ చేతకాదు, మొద్దు వెధవా నీవేం ఆడతావు!" అంటూ బయటికి నెట్టేవారు ఆటల్లో ఇరుగు పొరుగు పిల్లల చేత దెబ్బలు తిని ఏడుస్తూ తల్లి దగ్గిరకి వెడితే "చాతకాని చవటా! వాళ్ళతో చాలలేక నాదగ్గిరకొచ్చి ఏడుస్తావేం! అంటూ మరి రెండు అంటించేది

అక్షరాభ్యాసంనాడు ఆరు సార్లు పలకపుల్ల చేతిలో సరిగా పట్టించలేని మాష్టరు విసుక్కుని "బడుద్ధాయి పలకపుల్ల సరిగా పట్టుకోవడం చాతకాని నీవేం చదువుతావురా అని దీవించాడు. ఏముహూర్తాన ఆ మాట అన్నాడో ఆ గురువుగారు, అక్షరాలా అలాగే. ఏ క్లాసు రెండు సార్లు చూడకుండా పైకి వెళ్ళలేదు సుబ్బారావు. ఆదైన స్వంతంగా ప్యాసయికాదు! .. "నీకెందుకురా బాబూ చదువు! ఆ సరస్వతీ దేవిని విసిగించకురా

నాయ్యనా!" అంటూ తమక్లాసులోంచి పోతే చాలువన్నట్లుగా రెండో సారి పై క్లాసులోకి నెట్టేవారు మాష్టర్లు స్కూల్లో. అలా అలా మెట్రిక్ వరకు పాకగలిగాడు సుబ్బారావు ఇరవై ఏళ్లకి! ఆ మెట్రిక్‌లో పైకి త్రోసే నాధుడు ఎవరూ లేకపోవడంతో అక్కడే స్థిర నివాసం ఏర్పరుచుకున్నాడు సుబ్బారావు. ఓ మూడేళ్ళు చూసి, కొడుకు సామర్థ్యాన్ని అర్థం చేసికొన్న ఆ తండ్రి చదువు మాన్పించి, టైపు నేర్పించాడు. కాస్త తొందరగానే సుబ్బారావుకి టైపుచేయడం అబ్బింది. పరీక్ష పాసయ్యాక, ... తండ్రి ఎవరెవరినో పట్టుకొని ఉద్యోగం వేయించడానికి ప్రాకులాడి ... ఆఖరికి ... ఎప్పుడో ఒకప్పుడు తనదగ్గిర చదువుకున్న ఓ విద్యార్థి ఓ కంపెనీ మేనేజరుగా వుంటే అతన్ని బ్రతిమిలాడి సుబ్బారావుకి ఓ తొంభై రూపాయల ఉద్యోగం వేయించి కన్నందుకు బాధ్యత తీర్చుకున్నట్లు చేతులు దులుపుకున్నాడు.

వుద్యోగస్థుడి నైనానన్న సుబ్బారావు సంతోషం నెలరోజులుకూడా గాకముందే చప్పగా చల్లారి పోయింది. అసలు ఆఫీసులో అడుగు పెట్టిన మొదటిరోజే, గాభరాతో వణికే సుబ్బారావు అవతారం వంక అదోలా, చీదరింపుగా చూశాడు ఆఫీసర్లు. ఆ చూపుల్లో తిరస్కారం, నిరసన, హేళన చూసిన సుబ్బారావు మరింత నీళ్ళుగారి పోయాడు. ఏదన్నా తప్పు దొరుకుతుందా, సుబ్బారావు భరతం పడదామా అన్నట్లుండే ఆఫీసరుని చూసి సుబ్బారావు వణికిపోతూ ఒక పదిలెటర్లు టైపుచేస్తే, అందులో ఇరవై తప్పులుండేవి. ఆ కాగితం చూసి మరింత వుగ్రుడై పోయేవాడు ఆఫీసరు. రానురాను సుబ్బారావులో తప్పులెంచడమే పనిగా పెట్టుకున్నట్లుండేవాడు ఆఫీసరు. అతని మాటలు, చూపులు "ఏదో మీ నాన్నమాట కాదనలేక నీకుద్యోగం యిచ్చాను గాని, నీ మొహానికి ఉద్యోగం ఏమిటి" అన్న భావం ప్రతిక్షణం వ్యక్తం చేస్తుంటే, తోటి ఉద్యోగులు హేళనగా నవ్వితే అవమానంతో తల కృంగిపోయేది సుబ్బారావుకి. తనంత కష్టపడి, ఒక్క నిమిషం తలెత్తకుండా కష్టించి పనిచేసినా, తనకి తగిలే చివాట్లు, ఏ పని చేయకుండా, ఆఫీసరు ఆఫీసులో వుండే ఓ గంటో రెండు గంటలో పనిచేసినట్లు నటించే తక్కిన గుమాస్తాలకి ఆ తిట్లు ఎందుకుండవో," అని ఎంత ఆలోచించినా సుబ్బారావుకి తెలిసేది కాదు. తన ఖర్మ! అని సరిపెట్టుకుని వూరుకునేవాడు పాపం! తిట్టి తిట్టి విసిగిపోయిన ఆఫీసరు ఓ రోజు సుబ్బారావుతో ఖచ్చితంగా చెప్పేశాడు. "సుబ్బారావు ... నీ వూరికే ఆ కుర్చీలో రోజూ కూర్చొని, నెల కాగానే జీతం పట్టుకెళ్ళు. ఆ టైపు చేసి కాగితాలని ఎందుకు వృధాచే

స్తావు. ఈ తప్పుల తడకల కాగితాలు దిద్దుకోడం అది నాకెందుకు, నీవేం చేయద్దుపని, ఏదో మీ నాన్న మొహం చూసి నిన్ని ఉద్యోగంలో వుంచుతాను" అని అనేశాడు. సుబ్బారావు సిగ్గుతో చితికి పోయాడు.

ఎలాగో ఒక ఏడాది వుద్యోగం చేశాడు సుబ్బారావు. కొడుక్కి వుద్యోగం కుదిర్చి సగం బాధ్యతే నెరవేర్చుకున్న తండ్రి, కొడుక్కి పెళ్ళిచేసి మిగతా సగం బాధ్యత కూడ తీర్చుకోడానికి ఓ సంబంధం కుదిర్చి, పెళ్ళి చేసి, ఆడపిల్లకి పెళ్ళి చేసి నిశ్చింతగా నిట్టూర్చినట్లు నిట్టూర్చాడు. అంతేకాక, ఆడపిల్లని అప్పగింతలు పెట్టినట్లు ఎన్నడూ లేని ప్రేమాభిమానాలు ఒలకపోస్తూ, కళ్ళ నీళ్ళు పెట్టుకుని "వదినగారూ! మావాడు కాస్త నోట్లో నాలుక లేనివాడు. మీ చేతిలో పెడుతున్నాను... ఇంక వాడి భారం మీదే" అని వియ్యపురాలికి, "అమ్మా! వాడుత్త అమాయకుడు. ఎలా చూసుకుంటావో వాడిని. జాగ్రత్త" అంటూ కోడలికి అప్పగింతలు పెట్టి, సుబ్బారావు అమాయకతని, అసమర్ధతని చాటి చెప్పి, వాళ్ళ దృష్టిలో సుబ్బారావుని మరింత లోకువ చేసింది తల్లి...

ఇటు కన్న తల్లిదండ్రులతో, అటు ఆఫీసుల్లో విసిగిపోయిన సుబ్బారావు నవ్యత్త నాశించి, ఇల్లరికపు టల్లుడుగా అడుగుపెట్టిన సుబ్బారావు తన జీవితం [illegible] కనిష్ఠంగా తయారయిందని తెలుసుకోడానికి చాల రోజులే పట్టింది.

ఇంక యీ జీవితంలో మంచి రోజులు చూడగలనేమోనని ఆశ పడడం అవివేకం అని తెలుసుకున్న సుబ్బారావుకి జీవితంమీద ఏవగింపు కలిగింది.

"చచ్చిపోవాలి!. చావాలి!" మరోసారి గట్టిగా నిశ్చయించుకుని ఆ నిశ్చయం సడలిపోతుందేమో అనే భయంతో వెంటనే ఎరకలవాళ్ళింటికి సాయంత్రమే వెళ్ళి కావల్సిన విషం తెచ్చుకుని జాగ్రత్త చేసుకున్నాడు సుబ్బారావు.

ఆ రాత్రి అంతా సుబ్బారావు తనేదో ఘనకార్యం చేయబోతున్నట్లు ఆనందంలో తేలిపోయాడు. తను చచ్చిపోతే అందరూ ఎలా ఏడుస్తారో! కనకం ఏం చేస్తుందో! అప్పుడందరి మొహాలు చూసి ఆనందించాలి! చచ్చి తన [illegible] నిరూపించాలి!

* * *

రోజూ ఉదయం ఐదు గంటలకే నిద్ర లేచి పనుల్లో జొరపడే సుబ్బారావు ఆ రోజు ఆరయినా లేవకుండా ముసుగుతన్ని పడుకున్నాడు.

అత్తగారు పాలుతీయలేదని [illegible] గడం, కేకలువేసి విసుక్కోవడం అన్ని విన్న సుబ్బారావు వులక లేదు, పలకలేదు. ఇంకో గంటలో చచ్చిపోయే తనని వీళ్ళు ఏం చేయగలరు? వీళ్ళ కోపం నన్నేం చేస్తుంది

ఇవాళ! నవ్వుకుంటూ పడుకున్నాడు నిశ్చింతగా.

కనకం ఓసారి వచ్చి లేపితే "నా ఒంట్లో బాగులేదు ఇవాళ లేవలేను" అని చెప్పేశాడు ఖచ్చితంగా. నాలుగైదేళ్ళలో ఎన్నడూ లేని యీ వింత ఏమిటి అని ఆశ్చర్యపోయారు అందరూ. జవాబు చెప్పే ధైర్యం సుబ్బారావు కెక్కడనించి వచ్చిందని అందరూ ఆశ్చర్యంతో తెల్లబోయారు. "ఏం వేషం? రాత్రి కొంచెడన్నం చెల్లించాడు, ఇంతలో ఏం వచ్చింది?" అని అత్తగారు అనడం విన్న సుబ్బారావు ఖాతరు చెయ్యలేదు. మొండిగా అలా కాఫీ వాసన తగిలేదాక పడుకుని తరువాత సావధానంగా లేచి దంతధావనం చేసుకుని కాఫీ కోసం కూర్చున్నాడు.

కనకం కాఫీ గ్లాసు తెచ్చి విసురుగా ప్రక్కన పెట్టి "కాఫీ సేవించండి, దానికేం అభ్యంతరం లేదుగా!" అంటూ ఓ విసురు విసిరి విసవిసా వెళ్ళిపోతూంటే రోజూ కొరకొర చూసే సుబ్బారావు ఆ రోజు నవ్వుకున్నాడు. సావకాశంగా ఓ రెండు గుటకలు మింగి, తెచ్చిన విషం పొట్లం విప్పి కలుపుకున్నాడు కాఫీలో. త్రాగడానికి తీసిన గ్లాసు వణికింది చేతిలో! మనసు దృఢపరచుకుని, ఒకసారి దేవుడిని తలుచుకున్నాడు. అయిపోయింది! ఇంక యీ అసమర్థుని జీవితయాత్ర ముగియబోతూంది. ఇంక తనకి నిశ్చింత! ఎవరి అవహేళనలు, ఎవరి దయాధర్మాలు తన కక్కర్లేదు. "రండర్రోయ్, నేను చచ్చిపోతున్నా" అని పెద్దగా అరవాలన్న కోరికను బలవంతంగా అణుచుకుని, కాఫీ త్రాగబోయేంతలో "నాన్నా, కాఫీ ఈయి" అంటూ సుబ్బారావు కొడుకు తయారయాడు.

డబ్బుతో కొడుక్కి ఏమీ కొని యిచ్చి ముచ్చట తీర్చుకోలేని సుబ్బారావు తనకి చేతనయినంతలో, తన వంతుకు వచ్చే కాఫీ, పండో ఫలమో కొడుక్కి కొంత యిచ్చి తృప్తి పడేవాడు. రోజూ కాస్త కాఫీ అడుగున మిగిల్చి కొడుక్కి యీయడం అలవాటయిన సుబ్బారావు యీ రోజు ఆ సంగతి మరచిపోయాడు. కొడుకు కాఫీ గ్లాసు అందుకోబోతూంటే గాభరా పడుతూ "వద్దు బాబూ కాఫీ యివాళ బాగులేదు. వెళ్ళి పాలు త్రాగు" అంటూ నచ్చచెప్పబోయాడు. అలవాటయిన కొడుకు ఎంత నచ్చచెప్పినా వినక మారాం పెడుతూంటే ఏం చేయాలో తోచక రెండు అంటించాడు. ఎంతయినా కన్నకొడుక్కి విషం చేతులారా యీయగలడా? తండ్రి కోపమే ఎన్నడు ఎరగని వాడు, తండ్రి దెబ్బలకి భయపడి ఆరున్నొక్క రాగం ఆలాపించాడు.

కొడుకు ఏడుపుకి కనకం పరిగెత్తుకు వచ్చింది. మనవడి ఏడుపు వి

తాత, అమ్మమ్మ పరిగెత్తుకు వచ్చారు ఎన్నడు ఎరగని వింతలా ఆశ్చర్యపోయారు సంగతి విని. ఈరోజు సుబ్బారావుకి ఏం జరిగిందో అంతుబట్టక ఆశ్చర్యపోయారు. "వాడికి కాఫీ అలవాటు చేసి యివాళ యీయకుండా వాడిని ఎందుకు ఏడిపిస్తున్నారు కొట్టడం కూడానా వాడిని" అంటూ ఉరిమింది కనకం.

"బాగానే వుంది ప్రయోజకత్వం. నోరెరగని పసివాడి మీదలా వుంది ప్రయోజకత్వం చూపించడం." మామగారు కాస్త గట్టిగానే దులిపాడు.

సందు చూసుకుని కొడుకు కాఫీ గ్లాసు అందుకుంటూంటే, గాభరాపడిపోయి, ఏంచేయాలో తోచక, గభాలున గ్లాసు లాక్కుని చేయిజారినట్లు వదిలేశాడు. గండం గడిచినట్లు తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు.

కష్టపడి సంపాదించిన [illegible] అంతా నేలపాలయింది.

తన ప్రయత్నం విఫలమవడంతో ఆ కోపం ఎవరి మీద చూపలేక, విసవిసా యింట్లోంచి వెళ్ళిపోతున్న సుబ్బారావుకి పిచ్చి పట్టిందన్నట్టు ఆశ్చర్యంగా చూస్తూండిపోయారు ముగ్గురూ!

"ఛ ... తన ప్లానంతా భగ్నం అయిపోయింది. ఎన్నాళ్ళ నుంచో అనుకుని, ఆఖరికి తెగించిన ప్రయత్నం విఫలమైంది. తన [illegible]యానికి తిరుగుండకూడదు.... [illegible] సరే యీ రోజున యీ జీవితం అంతం చేసుకోవల్సిందే !..." యిది కాకపోతే... యింకో రకంగానైనా సరే తను చావాల్సిందే !..." సుబ్బారావ్ పట్టుదల పెరిగింది.

ఊరవతల చెరువులోపడి చావాలని నిశ్చయించుకున్నాడు మళ్ళీ



[illegible] అక్కడయితే, సాధారణంగా మనుష్యులుండరు... అదే అనుకూలమయిన చోటని నిశ్చయించుకుని వడివడిగా అక్కడ చేరిన సుబ్బారావుకి, అక్కడా నిరాశే ఎదురయింది. ఆరోజు చాకలివాళ్ళు రేవు పెట్టుకుని కూర్చున్నారు. వాళ్ళీరోజంతా అక్కడనుంచి కదిలే సూచనలు లేకపోవడంతో ఉస్సురని తిరుగుమొహం పట్టాడు సుబ్బారావు. వాళ్ళందరూ వుండగా చెరువులో దూమికితే ఎలాగో పైకి లాగకపోరు. చావుదప్పి కన్ను లొట్టపోతే మోనని భయపడి ఆ ప్రయత్నం విరమించుకున్నాడు మహర్షి.

ఏం చెయ్యాలి? చావడం ఇంత కష్టమా? విసుక్కున్నాడు సుబ్బారావు.... ఉరేసుకుంటే? ... ఎక్కడ? ... ఆలోచించాడు అనువైన చోటుకోసం... యింట్లో లాభంలేదు ... ఏ రోడ్డుమీదో ఏ చెట్టుకో వ్రేలాడితే నలుగురూ చూసి, చివాట్లుపెట్టి ఆ ప్రయత్నం కూడా విఫలం చేయవచ్చు. మామగారి మామిడితోట నిర్మానుష్యంగా వుంటుంది... అక్కడయితే నిరాటంకంగా పని అవుతుందని నిశ్చయించుకుని తోటలోకి [illegible]. మోటబావికి కట్టిన మోటతాడు విప్పుకుని, జోరుగా [illegible]చాడు.

నిర్మానుష్యంగా వుంటుందనుకున్న తోటలో [illegible] సుబ్బారావు దురదృష్టం కొద్దీ, అదృష్టంకొద్దీగాని ఆ రోజు అక్కడ కూలీలు పనిచేయడం చూసి నీళ్ళుగారి పోయాడు. "బాబుగారు యిరూల మామిడి చెట్లన్నిటికి గొప్పులు తవ్వమన్నారన్న" కూలీల జవాబు విని హతాశుడై పోయాడు. ఏమిటిది? ఎక్కడికి వెళ్ళినా చుక్కెదురవుతూంది! చావడానికి కూడ యిన్ని ఆటంకాలా? చావడంకూడ చేతకాని అసమర్థుడా తను! ఏం చేయాలో పాలుపోక అలా ఒక చెట్టు మొదట వ్రాలిపోయాడు సుబ్బారావు.

"ఇంకేం చేయడం? తలపెట్టిన అన్ని ప్రయత్నాలు విఘ్నమైపోతున్నాయి! ఎలా చావడం? ఎంత ఆలోచించినా తెగని సమస్య అయింది ఆఖరికి సుబ్బారావుకి. ఇంక యింటి ముఖం చూడడం కల్ల! ఇవాళతో తనకూ, ఆ యింటికీ ఆ యింటికేమిటి, ప్రపంచానితో ఋణం చెల్లిపోవాలి! చచ్చినా యింటికి వెళ్ళకూడదు. ఎలాగైనా చచ్చితీరాలి ... ఇంక ఒక్కటేమార్గం మిగిలింది. రైలుక్రింద బుర్ర పెట్టడం! సాయంత్రం ఐదుగంటలకిగాని అటునుంచి మెయిలురాదు. అప్పటివరకు తను బ్రతుకక తప్పదు

పన్నెండు గంటలయి, ఎండ మాడిపోతూంటే, ఉదయం నించి కాఫీనీళ్ళయినా [illegible] సుబ్బారావుకు నీరసం వచ్చి కళ్ళు తిరిగినట్లయింది. ఏమయినాసరే యింటికి.

వెళ్ళకూడదన్న పంతంకొద్ది నూతిలో నీళ్ళతో మొహం కడుక్కుని, కడుపు పట్టినన్ని నీళ్ళు త్రాగి ఓ చెట్టుక్రింద అదమరచి నిద్ర పోయాడు సుబ్బారావు. శాశ్వత నిద్రపోయే ముందు ప్రశాంతిగా, హాయిగా నిద్రపోయాడు.

హఠాత్తుగా నిద్రనుంచి మెలకువ వచ్చిన సుబ్బారావు ప్రొద్దు బాగా వాలిపోవడంతో గాభరాగా రైలు కట్టు వైపు నడిచాడు.

రైలు లైను చేరి పట్టాలమీద తల పెట్టి పడుకోగానే ఉదయం నించి తిండి లేకపోవడం, ఉదయం నుంచి తిరిగిన తిరుగుడు అంతా కలసి నిస్త్రాణవచ్చి, చిన్న మగత కమ్మింది సుబ్బారావుకి. ఎవరో తనని లేవదీసి, మొహంమీద నీళ్ళు చిలకరించడం తెలిసి, తెలివి వచ్చింది సుబ్బారావుకి. ఆ ఊరి కరణం, ఆయన బావమరది ఊరు చివరికి షికారుగా వచ్చి సుబ్బారావు రైలు లైనుమీద తెలివి తప్పినట్టు పడుండడం చూసి ప్రక్కకి తీశారుట. కరణం చివాట్లు పెట్టాడు సుబ్బారావుని. మేం రావడం ఇంకో పది నిమిషాలు గనక ఆలస్యం అయితే, బలవంతంగా చచ్చిపోయి వుండేవాడి వన్నారు. సుబ్బారావుకి ఏడవాలో నవ్వాలో తెలియలేదు చివరి ప్రయత్నం విఫలం అవడంతో. కోపం ముంచుకొచ్చింది తనని రక్షించిన వాళ్ళ మీద. వీళ్ళే లేకపోతే హాయిగా ఈ పాటికి చచ్చిపోయుండే వాడుగదా! ఆ కరణం గారు సుబ్బారావు తెలివితప్పి పడిపోయాడనుకుని సుబ్బారావు పరిస్థితికి సానుభూతి చూపుతూ, సుబ్బారావు మామని తిట్టసాగాడు "గొడ్డులాచాకిరి చేయించుకుని సరిగా తిండి అయిన పెట్టడని" దుమ్మెత్తి పోశాడు. అన్నీ వింటూ వీళ్ళెప్పటికి పోతారా అని సుబ్బారావు ఓపికగా కని పెట్టుకునికూర్చున్నాడు. ఇంకో గంటలో ప్యాసింజరు వచ్చే వేళకైన వీళ్ళు పోతారో పోరో. యీ సారైనా తన కోరిక తీరుతుందో లేదో అని కనిపెట్టుకుని కూర్చున్నాడు.

ఆ ప్యాసింజరు బండి వచ్చి వెళ్ళే దాకా వాళ్ళు అలాగే కూర్చుని సుబ్బారావు మామని ఆడి పోసుకుని తరువాత సావకాశంగా లేచి, తర్వాత వస్తానన్న సుబ్బారావుని వినకుండా ఇంటి దగ్గిర దింపుతాం! మళ్ళీ మొహం తిరిగి పడి పోతావు. అంటూ చెరో రెక్క పట్టుకు లేవ తీసి బలవంతంగా నడిపించుకుంటూ బయలుదేరారు. గత్యంతరం లేక మనసులో తిట్టుకుంటూ బయలుదేరాడు సుబ్బారావు.

సందు మొగని విడిచి వాళ్ళు వెళ్ళాక గిరుక్కున తిరిగి మళ్ళీ వెనక్కి బయలు దేరాడు! ఏదో ఒకటి చేసి తను చావాలి! పట్టు విడవకుండా మళ్ళీ బయలుదేరాడు సుబ్బారావు... విషం కోసం మళ్ళీ

ఎరక్కల వాళ్ళింటికి వెడితే "ఇంక లేదు బాబూ, అయిపోయింది. రెండ్రోజులాగి వస్తే యిస్తా" మన్నారు!" "మీ విషంకోసం నే రెండు రోజులు కాదు కదా, రెండు గంటలు కూడ ఆగ'నను కున్నాడు గట్టిగా సుబ్బారావు.


చీకటి పడింది చెరువు దగ్గిర ఎవరూ వుండరు! చావడానికి యిదే మంచి సమయం! ఇంక జాప్యం చేయకూడదని నిశ్చయించుకుని పొలంగట్లమీద చీకటిలో, వడి వడిగా నడక సాగించాడు సుబ్బారావు

హఠాత్తుగా, నడుస్తున్న సుబ్బారావు కాలికి ఏదో మెత్తగా తగిలి చుట్టుకోడం, కాలిమీద కాట్లు పడడం అన్నీ ఒక్క క్షణంలో జరిగిపోయాయి సుబ్బారావు ఏం జరిగిందో తెలుసుకునే లోపలే, గుడ్డివెన్నెల్లో జరజర ప్రాకే బారెడు పొడుగునల్ల త్రాచును చూసి భయంతో వణికిపోతూ, కూలబడి పోయాడు సుబ్బారావు.

మృత్యువు నాహ్వానిస్తూ రకరకాల యత్నాలు అప్పటి వరకు చేసిన సుబ్బారావు ... ఇప్పుడు మృత్యు భయంతో, ప్రాణాలమీద తీపితో సహాయంకోసం గావుకేకలు పెట్టసాగాడు, ఆ నిర్మానుష్యమైన సంజె చీకటివేళ!

నోట్లోంచి నురగలు కక్కుతూ, వంటిమీద తెలివితప్పి పోతూండగా చప్పున ఒక సంగతి గుర్తుకు వచ్చింది సుబ్బారావుకి "మృత్యువు కూడా తన అసమర్థతని చాటి చెప్పిందని!"

* * *



[గత సంచిక తరువాయి]

సెలయేటి గలగల

విహారి & శాలివాహన

బావ, అత్తయ్య ఈ విషయాన్ని తనతో చెప్పినప్పుడు నిజంగానే తను నమ్మలేను కాని వారిముఖాల్లో ఆనంద రేఖలు, వారి కళ్ళల్లోని వెలుగులు తనకు నమ్మకం కలిగించినై.

ఉన్నట్టుండి ఓ సందేహం ఎదురై నిలిచింది శంకరానికి. అసలు రేణుక మనస్ఫూర్తిగా అంగీకరించిందా తనను చేసుకునేందుకు? లేక అత్తయ్య బావల ఒత్తిడి ఏమైనా వుందా?

ఎలా తెలుసుకోవటం? పోనీ రేణూను ఒంటరిగా కలుసుకుని మాట్లాడితే? ఏమనుకుంటుందో?

వేణుమాధవ్‌తో రేణుక ప్రవర్తన తనకు అనుమానాస్పద మైనప్పటి నుంచి ఆమెతో సరిగా మాట్లాడటమే లేదు తను. ఎప్పటిలాగా మనసు విప్పి మాట్లాడనందుకు ఆమె ఎంతగా బాధపడిందో?

మనుష్యుల అంతర్యాల్ని తెలుసుకోకుండా మనసుకు తోచిన అభిప్రాయాల్ని ఏర్పరచుకోవటం ఎన్ని కష్టనష్టాలకు దారి తీస్తుందో శంకరానికిప్పుడు అవగాహనైంది.

జరిగినదానికి చింతించి ప్రయోజనమేమిటి? జరుగవలసిందేమిటి?

శంకరం ఆలోచన మరోమార్గంలోకి మళ్ళింది. అతనికి మరోసమస్య ఎదురైంది. తనకంటే విద్యాధికురాలయిన స్త్రీ తోటి దాంపత్యం ఎలా వుంటుందో? విశేషించి వుద్యోగియైన భార్య నిరుద్యోగి ఐన భర్త — లోకవిరుద్ధం గాకపోయినా, అసమానమయిన అలాంటి దాంపత్యం ఎలా వుంటుందో?

తరతరాలుగా పురుషుని యాజమాన్యంలో ఆర్థిక, వాక్, క్రియా స్వాతంత్ర్యాలను పొందలేని స్త్రీ రేణుకలో మూర్తీభవించి పురుషునిమీద కసి తీర్చుకుంటుందా? అర్హతలేక ఉన్న ఆధిక్యతను వ్యక్తం చేసుకోలేక, తన తక్కువతనాన్ని అంగీకరించలేక మనోక్షోభను భరిస్తూ వుండాల్సిందేనా అలాంటి భర్త? అలాంటి పురుషుని లోకం గర్హిస్తుందా? అతని నొక వ్యక్తిత్వమున్న జీవిగా గుర్తిస్తుందా? అన్నీ ప్రశ్నలే. అన్నీ సంశయాలే.

శంకరం తనను తాను నిందించుకున్నాడు. సద్గుణరాశి, యుక్తాయుక్త విచక్షణాజ్ఞాని, నిగర్వి ఐన రేణుక

వాతను అనుమానించటం? ఆమె తన కంటే విద్యాధికురాలవి. కాబోయే ఉద్యోగివని తెలిసికూడా నిరుద్యోగియైన తనను పెళ్ళి చేసుకోటానికి అంగీకరించిన రేణుక, వివాహమైన తర్వాత అలా మారుతుందని, తనని తక్కువగా చూస్తుందని, భర్త గౌరవానికి భంగం కలిగిస్తుందని తను భావించటం, తన సంకుచితత్వాన్నే సూచిస్తుందేమో?

అలా ఆలోచించిన శంకరానికి మనసు తేలిక పడినట్లయింది. మార్గం గోచరించినట్లయింది.

* *

9

పదిమంది యువకులు కూర్చుని ముచ్చట్లాడుకుంటూ వుంటే— ఆ సంభాషణల తీరు ఆ వాతావరణం వేరు. ఇద్దరు యువతులు వ్యక్తిగత విషయాలు చర్చించుకునే తీరే వేరు. ఫెయిర్ సెక్స్ మాటలుకూడా ఫెయిర్ గా వినముచ్చటగా వుండటంలో అబ్బురం లేదు.

మాలతి, రేణుక కబుర్లలో పడ్డారు. అంతరంగంలోని ఎన్నో అభిప్రాయాలు స్నేహితురాలికి చెప్పుకోవాలనిపించింది రేణుకకు. కాని ఎలా చెప్పాలో ఎలా ప్రారంభించాలో తోచిందికాదు. చివరకు అడిగింది. "మాలతీ. నీ పెళ్ళెప్పుడే.?"

"నీ పెళ్ళెప్పుడే అంటావ్, నీ పెళ్ళి కుదిరిందేమిటి?" మాలతి ఎదురు ప్రశ్న వేసింది ఆశ్చర్యంగా చూస్తూ. రేణుక మాట్లాడలేదు. చిరునవ్వు నవ్వుతూ సిగ్గుల్ని ఒలకపోసింది. మాలతికి సంగతి అర్థమైంది.

"ఐ సీ. ఎప్పుడు? ఎవరేవ్. మాధవేనా?"

రేణుక తీక్షణంగా చూసింది స్నేహితురాల్ని. నిట్టూర్చి "నీవుకూడా అలా అడుగుతావేమే" అంది.

మాలతి ఆశ్చర్యంగా చూసింది. తను అలా అడగటంలో తన తప్పేమిటో అర్థంకాలేదు. వేణుమాధవ్, రేణుకా ఇద్దరూ ఎంతో స్నేహంగా చనువుగా కలిసి మెలిసి తిరుగుతున్న వాళ్ళు. ఏ విషయంలోనైనాసరే ఇద్దరి అభిప్రాయాలూ ఒకటిగానే వున్నాయి. వారిద్దరూ వివాహం చేసుకుంటారని ఆఫీసులో చాలమంది అనుకుంటూనే వున్నారు మరి ఇప్పుడు రేణుక ఇలా అంటుందేమిటి?

రేణుకే అంది మళ్ళీ "అన్నయ్య కూడా అలాగే అనుమాన పడ్డాడు. ఇక బావ సంగతి. ఆయన లోపల ఏమనుకుంటున్నారో, ఎవర్ని గురించి ఏ విధంగా అభిప్రాయ పడ్తున్నారో ఎవరికీ తెలియదు. ఎవరికీ చెప్పరు. కాని ఒకటి మాత్రం నిజం ఇదివరకటిలా చనువుగా, స్వతంత్రంగా నాతో మాట్లాడటంలేదు. బహుశః అందుకు కారణం మాధవ్ తోటి నా స్నేహం ఇష్టంలేక కావచ్చు. ఒక్కొక్కప్పుడు ఈ లోకపు పోకడల మీద నా కెంతో కోపం వస్తూంటుంది.



స్త్రీ పురుషునితో మాట్లాడినా, స్నేహం చేసినా ప్రేమతప్పితే మరొకటి కన్పించదేమో ?

మాలతి నిట్టూర్చింది. "ఇంతకీ నీవు మీ బావనే చేసుకుంటానంటావ్, అవునా."

"అవును"

"బాగా ఆలోచించుకున్నావా ?"

"ఏం ?"

"ఏమీలేదు. అసలీ నిర్ణయానికి ఎలా వొచ్చావ్. మీ అమ్మా, అన్నయ్యల అభిమతమా ?"

"వాళ్ళే విషయంలోనూ నా స్వేచ్ఛకు అడ్డురారు. అలాంటిది వివాహం విషయంలోనా ?"

"అయితే నీవు తొందర పడ్తున్నా

వుంటాను. ఒక్క బంధుత్వాన్ని తప్పించి మీ బావకంటే మాధవ్ ఎన్నో రెట్లు నీకు తగినవాడు. రూపం, చదువు, సంపద, సంస్కారం...."

రేణుకకు కోపం హెచ్చిపోయింది. "ఆవు మాధవ్ వకాల్తా నీకిచ్చాడా? మమ్మల్ని గురించి అలా మాట్లాడవద్దని నీ కిదివరకెన్నోసార్లు చెప్పాను."

"పరిహాసంకాదు రేణూ"

"నేనంటం కూడా పరిహాసంకాదు. నీవు చెప్పిన లక్షణాల్లో బావలో లోపించింది ఒకటే: సంపద. నాతో సమానంగా చదవక పోయినా నిరక్షరాస్యుడు కాదు. ఏ నాడో పెద్దలన్నారు, మేము దంపతులమని. నేనూ అలాగే భావిస్తున్నాను. ఇవాళ నా మనసు మార్చుకునే అవసరంలేదు" రేణుక ఆవేశంగా అన్నది.

మాలతి మాట్లాడలేదు. రేణుకకు ఏదో అన్యాయం జరుగుతున్నట్లుగా ఆమె భావించింది. జీవితం ఆదర్శాల ప్రోవు కాదు. ఆదర్శాల ఆవేశంలో నేడు ఏమీ అనిపించక పోయినా రేపు నిజ జీవితంలో ఈ తొందరపాటుకు ఫలితం అనుభవించాల్సి వచ్చినప్పుడు మనసుకు కష్టం కలుగుతుంది.

"ఒక స్త్రీ, పురుషుని మధ్య స్నేహంవుంటే ఆ స్నేహం స్నేహంగా కాకుండా, ప్రేమ, వివాహం, అనే పర్యవసానాలకు దావివ్వాలని ఎక్కడైనా వుందా? నా స్నేహాన్ని ఆ దృష్టితో అతను చూడలేదు కూడా! మాలతీ నీకింకొక పరమ రహస్యం చెప్తున్నాను. బహుశా నమ్మలేవేమో!"

"ఏమిటది?" మాలతి ఆతృతగా అడిగింది.

"వేణుమాధవ్ నాకు సోదరతుల్యుడు."

మాలతి విస్తుపోయింది.

10

పండు వెన్నెల్లో మేడ పై భాగాన కూర్చుని, ఆకాశంలో తారకల్ని చంద్రుణ్ణి చూస్తున్న శంకరం దగ్గరికి మెల్లగా వచ్చింది రేణుక. రేణుక రాకతో తన ఏకాంతానికి భంగం కలిగి ప్రక్కకు తిరిగాడు శంకరం. ఆమె వచ్చి అతని కెదురుగావున్న కుర్చీలో కూర్చుంది.

రేణుక మనస్సులో అనేక భావాలు వాటి నన్నిటినీ బావకు తెలియజేయాలని అతని అభిప్రాయాన్ని తెలుసుకోవాలనీ వువ్విళ్ళూరుతోందామె మనసు. నదురు బెదురు లేకుండా ఎందరితో ఎన్ని విషయాలైనా మాట్లాడటానికి జంకు గొంకులు లేని ఆమెకు బావ యెదుట మనసు విప్పి మాట్లాడాలంటే సిగ్గుగావుంది. మాటలు నోరు పెగిలి రావటం లేదు.

దూరంగా వినిపిస్తున్న "పయనించే మన వలపుల బంగరునావ...." పాట తప్ప ప్రకృతి నిశ్శబ్దంగా వుంది. క్షణాలు గడుస్తున్నై.

"మీకు కొన్ని విషయాలు చెప్పాలి బావా."

రాగవీణను మీటినట్లయి, రేణుక వైపు చూసేడు శంకరం. ఆమె సంబోధన అతనికి ఆశ్చర్యం కలిగించింది. పన్నగా నవ్వి, "గౌరవం పెరిగిందే" అన్నాడు.

సిగ్గుపడింది రేణుక.

"చెప్పు రేణూ" అన్నాడు శంకరం అప్యాయత.జాలువారే కంఠస్వరంతో,

గొంతు సరిచేసుకుని. ధైర్యం కూడ గట్టుకుని అడిగింది రేణుక "మన వివాహమైన తర్వాతకూడా నేను ఉద్యోగం చేయటం మీ కిష్టమేనా?"

శంకరం చలించాడు రేణుక అభిమత మేమిటో అర్థం కాలేదు. "నీకు చెయ్యాలని వుంటే నాకేం అభ్యంతరం లేదు" అన్నాడు.

రేణుక సంతృప్తిగా వూపిరి పీల్చుకుని చెప్పసాగింది. "నాకు ఉద్యోగం చేసే అవసరం లేకపోయినా, నాముచ్చట కొద్దీ పట్టుబడితే అమ్మా, అన్నయ్యా ఒప్పుకున్నారు. నాకు ఆ జీవితమూ సరదాగానే వుంది. అందుకనే జాబ్‌ని కంటిన్యూ చేయాలని నా కోరిక బావా! చిన్నతనంనుంచీ నన్ను గురించి నలుగురూ నాలుగువిధాలుగా చెప్పుకుంటూనే వున్నారు. ఆడపిల్లకి ఇంజనీరింగ్ తగదన్నా, నా కదే చదవాలనిపించింది. అలాగే అన్నింట్లోనూ నేను 'ఎగ్రెసివ్ టైప్‌'ని అంటాడు అన్నయ్య.

స్త్రీ అలా వుండటంలో తప్పేమిటో మాత్రం నా కర్థంగాదు. ఆడదైనంత మాత్రాన కాంట్రాక్ట్ బ్రిడ్జి ఆడకూడదని ఎక్కడుంది? పదిమంది మగవాళ్ళతో కబుర్లు చెప్పకూడదని ఎక్కడుంది? వీటివలన మనకు కలిగే నష్టమేమైనా వుంటే తగదని చెప్పటంలో అర్థముంది. ఏమంటారు?"

శంకరం తడబడుతూ "అవును. వును." అన్నాడు.

"ఇకమీకు చెప్పవలసిన ముఖ్యమైన విషయం వేణుమాధవ్‌గారిని గురించి. ఆయనకూ నాకూ మధ్యవున్న స్నేహానికి రకరకాల పేర్లుపెట్టి వూహాగానాలు చేసున్నారు అందరూ. చివరికి మీరూ అపోహపడి లోలోపల మనసు పాడు చేసుకున్నారు. నా కిలాంటివి గిట్టవు. మీ భార్యమీద మీకు నమ్మకం లేకపోతే ఎలా? పరాయి మగవాడితో పన్నెత్తి మాట్లాడితే ఈర్ష్యపడి, అనుమానపడే భర్తకి నేను విలువనివ్వలేను. నే నిలా కుండబద్దలు కొట్టినట్టు చెప్తున్నందుకు మరోలా అనుకోకండి. నా స్వభావం అలాంటిది కనుక చెప్పగలుగుతున్నాను. ఇవన్నీ కేవలం నన్నర్థం చేసుకోవటానికి ఉపకరిస్తాయనే ఉద్దేశ్యంతో చెప్తున్నానే గాని మరొకందుకు మాత్రం కాదు. ఏం బావా?"

శంకరం రేణుక కళ్ళల్లోకి చూస్తూ కూర్చున్నాడు. అతని మనస్సులో ఆమెను గురించి ఏవేవో ఆలోచనలు బయలు దేరినై. ఒక్క క్షణం ఆగి రేణుకే అడిగింది

"ఏవిటి బావా ఆలోచిస్తున్నారు?"

"అఁహఁహఁ ఏం లేదు. నాకు కాబోయే భార్యది ఎంత విశాలమైన హృదయం — అని."

రేణుక నవ్వింది. శంకరమూ నవ్వేడు. అక్కణ్ణుంచీ సంభాషణ ఇతర విషయాలమీదికి మళ్ళింది. తన ఆఫీసు సిబ్బంది మనస్తత్వాల్ని గురించి చెప్పసాగింది రేణుక.

క్రిందినుంచి సౌభాగ్యమ్మ పిలిచిన పిలుపుకు ఇద్దరూ క్రిందికి వెళ్ళారు.

* * *

11

మరో రోజు ఉదయం ఆఫీసుకు వెళ్ళిన రేణుకకి ఆఫీసు వాతావరణమంతా అదోలా ఉండటం ఆశ్చర్యాన్నే కలిగించింది. ఆమె రాకను గమనించి ఆఫీసు ఉద్యోగులంతా నవ్వు ముఖాలతో వచ్చి ఆమెకు 'కంగ్రాచ్యులేషన్స్' చెప్పసాగేరు.

తన వివాహ విషయం మాలతి తెలియజేసింది కాబోలు అనుకుంది రేణుక.

వాళ్ళందరికీ థాంక్స్ చెప్పి తన సీట్లోకి వెళ్ళి కూర్చోగానే, వేణుమాధవ్ పిలుస్తున్నారని చెప్పాడు ప్యూన్. రేణుక అతని ఛేంబర్‌లోకి వెళ్ళింది.

వేణుమాధవ్ ఆమెను అభినందిస్తూ అన్నాడు. "మిమ్మల్ని నిజంగా ఎంతో పొగడవచ్చు శంకరంగారిని వివాహమాడుతూ మీరొక గొప్ప ఆదర్శాన్ని పాటించి చూపుతున్నారు. ఇది నిజంగా ప్రశంసనీయం. స్త్రీలకు సంపదమీద అభిలాష అనుకునే పిచ్చివాళ్ళకు మీ వివాహం కనువిప్పు కలిగిస్తుంది. ఉండండి" అని డ్రింక్ తెప్పించి యిచ్చాడు.

అతని మాటలకు గర్వంతోకూడిన సంతృప్తి కలిగింది రేణుకకు.


రేణుక బయటికి రాగానే ఆమె చుట్టూ మూగేరు అందరూ. కాళిదాసు వాళ్ళందరికీ లీడర్‌లాగా అన్నాడు.

"డ్రింక్ తాగి రాగానే సరిపోదు. ఈ శుభ సమయంలో మా అందరికీ మీరు శాంతి చేయక తప్పదు."

రేణుక నవ్వేసి వూరుకుంది. కాని మిగిలిన వాళ్ళంతా కాళిదాసు ప్రపోజల్‌ని సపోర్ట్ చేశారు. రేణుక డ్రింక్స్ తెప్పించింది. ఆవేళ ఆఫీసు ఆఫీసుగా లేదు. కాగితంమీద కలం పెట్టిన బుద్ధిమంతుడు లేకపోయాడు. ఉద్యోగులందరికీ రెండు విషయాలు చర్చనీయాంశాలైపోయాయి. ఒకటి వూళ్ళో అగ్ని ప్రమాదాలు, రెండు రేణుక వివాహం.

ఆ వాతావరణాన్ని గమనించిన ఆఫీసర్ మాధవ్ తన గౌరవం దక్కించుకోటానికా అన్నట్లు "నేను కాంప్‌కి వెళ్తున్నాను" అని మేనేజర్‌తో చెప్పి ఆఫీసునుంచి వెళ్ళిపోయాడు.

అతనటు వెళ్ళగానే సరోజినీ.



మాలతి. రేణుక ప్రక్కనచేరి—ఆమె పెళ్ళికి కావలసిన వస్తువుల్ని గురించీ, ఆమెకు కాబోయే భర్త శంకరాన్ని గురించీ — ఆమెను జోక్ చేసేశారు. మధ్య మధ్య కాళిదాసు జోక్స్ విసరడంతో కాలం సరదాగా గడచి సాయంత్రం ఐదుగంటలయింది. అంతా బయట పడ్డారు.

ఆఫీసునుంచి బయల్దేరిన రేణుక మనస్సులో ఒక్క సందేహం ఎదురైంది.

"ఏ ఎంతకా గొడుగుపట్టే మనుష్యులేనా వీళ్ళంతా?" అని. ఈఆలోచన కలిగిన రేణుక పెదవులమీద చిరునవ్వు విరిసింది.

"ఏమండీ డాక్టరుగారూ! మీవ్యాపారం సజావుగా సాగుతున్నదా?"

హాల్లో కూర్చుని బూట్ల లేసులు ముడివేసుకుంటున్న రఘు, రేణుక మాటలకు తలెత్తి ఆమెవైపు చూశాడు. రేణుక వస్తున్న నవ్వును ఆపుకుంటూ కొంటెగా చూస్తోంది.

"ఏం రేణూ, తమాషాగా మాట్లాడుతున్నావే" అన్నాడు రఘు.

"మీ చెల్లెలు మాటలు, ప్రవర్తనా

తమాషాయే బావా" శంకరం అందుకున్నాడు.

"సరి, సరి. ఇంక నేనేం మాట్లాడను" అని "లక్ష్మి వాళ్ళ నాన్నకు బాగా తగ్గిందా అన్నయ్యా?" అంది రేణుక.

రేణుక ప్రశ్నకు ఆశ్చర్యపోయి "నీ కెలా తెలుసు — వాళ్ళసంగతి?" అన్నాడు రఘు.

రేణుక నవ్వింది. "ప్రైవేట్ డిటెక్టివ్‌లం. మనకు తెలీకుండా వుంటుందా?"

"పర్వాలేదు. తగ్గిపోయింది"

"పాపం లక్ష్మికి పెద్ద ఉపకారం చేశావ్. ప్రత్యుపకారంగా ఆవిడేం చేస్తుందో చూడాలి." అదోలా అంది రేణుక.

రఘుకు విషయం అర్థమైంది. తాను లేనప్పుడెప్పుడో హాస్పిటల్‌కు వెళ్ళి లక్ష్మి ద్వారా అన్ని విషయాలూ తెలుసుకుని వుంటుంది రేణుక. అతనికో ఆలోచన కలిగింది. తానంటే లక్ష్మికి గల అభిప్రాయాన్ని కూడా కనిపెట్టే వుంటుంది. అడిగితే? — అనుకున్నాడేగాని తనంతతానుగా బయటపడి అడగటానికి మనస్కరించలేదు.

ఇంతలో రేణుక గంభీరంగా అంది: "అన్నయ్యా! నీ ప్రవర్తన నాకేం బాగా లేదు."

రఘు విస్తుపోయాడు. క్షణంసేపు ఆమె కళ్ళల్లోకి చూసి గొల్లున నవ్వేశాడు "నా మాట నాకే అప్పగిస్తున్నావే" అంటూ.

రేణుక కూడా నవ్వింది. వీళ్ళ సంభాషణ ఏమాత్రం అర్థంకాక అలాగే చూస్తూ వుండిపోయాడు శంకరం.

"అయితే, ఖర్చులో ఖర్చే నన్న మాట" అంది రేణుక.

"పోవే కొంటె పిల్లా" అన్నాడు రఘు సిగ్గుపడుతూ.

"ఇంకా సిగ్గెందుకండీ డాక్టరుగారూ" రేణుక ఈ మాటంటూ వుండగా హాల్లో ప్రవేశించిన సౌభాగ్యమ్మ "ఏమిటి రేణూ!" అంది.

రేణుక రఘువైపు చూసింది "చెప్పనా?" అన్నట్లు. రఘు వద్దని కండ్లతోనే ప్రాధేయపడ్డాడు.

"ఏమిటే అది? ఖర్చు, సిగ్గూ అంటున్నావ్?" అని మళ్ళీ ప్రశ్నించింది సౌభాగ్యమ్మ.

ఇక తప్పదనుకుని చెప్పేసింది రేణుక. "ఏం లేదమ్మా. లక్ష్మి అని మొన్న రాత్రి మనింటికి రాలే....?"

"అవునవును....పాపం! ఏం జరిగిందే? వాళ్ళ నాన్న, తమ్ముడు బాగున్నారా?.... కంగారుగా అడిగింది సౌభాగ్యమ్మ.

"ఆఁ ఆఁ.... వాళ్ళు బాగానే వున్నారు. ఆ అమ్మాయి లేదూ. పాపం. చాలా మంచిదే అమ్మా...."

"కాక అంతా నీలాగే వుంటారా? చూడా పిల్ల! పాపం. ఎంత నెమ్మది

విదానం. ఆ పిల్లముఖం చూస్తుంటే ప్రత్యకంటే ఏం(విటో తెలిసిన దానిలా కనపడింది...."

"కనపడిందా మరి .... అందుకనే అన్నయ్య....ఆ పిల్లని .... అమాంతం ప్రేమించేశాడు...."

అప్రయత్నంగా "ఆఁ!" అంది సౌభాగ్యమ్మ.

"అవును."

"ఏరా రఘూ, నిజమేనా!" సౌభాగ్యమ్మ రఘును ప్రశ్నించింది.

"నిజమేనమ్మా" రఘు తల వంచుకుని చెప్పాడు.

సౌభాగ్యమ్మ ఏదో ఆలోచించి, ఒక్క క్షణమాగి అన్నది "సరే, నీకు లేని అటంకాలన్నీ నా కెందుకు? నాకు కావలసింది మీ సుఖసంతోషాలే గదా. కానీ....నీ ఇష్టప్రకారమే జరగనీ...."

రఘు ముఖం ఆనందంతో వెల్లివిరిసింది. "అమ్మా" అంటూ ఆమె వైపు కృతజ్ఞతతో చూశాడు.

"కంగ్రాచ్యులేషన్స్ బావా" అంటూ చేతులు కలిపేడు శంకరం.

"ఏం అన్నయ్యా! వదిన్ని కూడా తీసుకురా. సినిమాకు పోదాం ఈవేళ" అంది రేణుక.

"అయితే, రెండు పెళ్ళిళ్ళూ ఒకే సారి జరిపిస్తే సరి" అని "రంగయ్యా" అంటూ లోపలికి వెళ్ళింది సౌభాగ్యమ్మ.

రఘు హుషారుగా బయటకు పోబోయాడు.

"అన్నయ్యా" రేణుక పిలిచింది.

వెనక్కి తిరిగేడు రఘు.

"నేను రెడీగా వుండనా మరి?"

"షూర్, షూర్, బావా బీ రెడీ" అంటూ కారు వైపు పరుగెత్తాడు రఘు.

* * *

రఘు - లక్ష్మి, శంకరం - రేణుకల వివాహం వైభవంగా జరిగింది. పెండ్లి కాగానే రేణుక ఒక నెల రోజులు సెలవు పెట్టి, భర్తతో ఉత్తర హిందూ దేశానికి హనీమూన్ వెళ్ళింది. రఘు మాత్రం హాస్పిటల్ మూసి వెళ్ళటానికి ఇష్టపడలేదు.

శంకరం, రేణుక తిరిగి వచ్చేసరికి రేణుకకి ట్రాన్స్‌ఫర్ ఆర్డర్స్ సిద్ధంగా వున్నాయి. ఆమెను నాగార్జున సాగర్‌కి బదిలీ చేశారు. ఆఫీసు సిబ్బంది, ప్రత్యేకించి వేణుమాధవ్ ఆమె ట్రాన్స్‌ఫర్‌కి ఎంతగానో విచారించారు. రేణుక బదిలీఅయి వెళ్ళేటప్పుడు ఘనంగా ఫేర్వెల్ పార్టీని ఏర్పాటు చేశారు వాళ్ళంతా.

అందరివద్దా శలవు తీసుకుని భర్తతో నాగార్జునసాగర్ వెళ్ళిపోయింది రేణుక.

* * *

12

శంకరం రిక్షా దిగి రిక్షావాలాకు డబ్బులిచ్చి పంపేడు.

గేటు తీసుకొని లోపలికొచ్చిన శంకరం తలుపు తాళంవేసి వుండటం గమనించాడు. క్షణంసేపు విస్మయి తల పంకించి, జేబులోనుంచి తాళం చెవి తీసి తలుపు తీశాడు. చేతిలోని బాగ్ను కొంకెకి తగిలించి లైటువేశాడు. అల్మారులోని బిగ్ బెన్ ఎనిమిదైందని తెలుపుతోంది.

శంకరం స్నానంచేసి వచ్చి ఆరుబయట ఈజీ ఛెయిర్ వేసుకుని కూర్చున్నాడు. సన్నజాజుల పరిమళాన్ని మోసుకొస్తున్న చిరుగాలులు అతని ప్రయాణపు బడలికను కొంచెం కొంచెంగా పోగొడుతున్నాయి. ఆకాశంలో దశమి చంద్రుడు చల్లని వెన్నెలను ప్రపంచానికి ప్రసాదిస్తున్నాడు. చంద్రుని ఏకచ్ఛత్రాధిపత్యాన్ని సహించలేమన్నట్లుగా నీలిమబ్బులు అప్పుడప్పుడు చంద్రుని కప్పివేస్తున్నాయి.

గేటువద్ద ఏ మాత్రం చప్పుడైనా రేణుక వచ్చిందేమోనని చూస్తున్నాడు శంకరం. ఇంత ప్రొద్దుపోయినా రేణుక ఇల్లు చేరుకోక పోవటం అతనికి నచ్చలేదు. ఏంచేస్తూ వుంటుందో ఇంతసేపు. మహిళా సమాజానికి కార్యదర్శినిట. టౌనులోని ప్రముఖ వనిత లందరికీ నాయకురాలు. ఎన్ని పనులుంటాయో!

తలుపు తట్టిన చప్పుడైంది. రేణూ వచ్చిందనుకున్నాడు శంకరం. లేచి వెళ్ళి తలుపు తీద్దామనుకునేసరికి 'లీలా'

అనే పిలుపు వినిపించింది. ఆ వెంటనే 'ఆఁ వస్తున్నా' అనే జవాబు, గలగల స్వనంతో వడివడిగా నడిచి వెళ్ళి తలుపు తీసిన సవ్వడి. ప్రక్కవాటాలోని మూర్తిగారు కాబోలు! అనుకున్నాడు శంకరం.

మూర్తిగారికి ఏదో ఆఫీసులో ఉద్యోగం. ఎప్పుడు చూసినా ఆఫీసులో పని ఎక్కువగా వున్నదంటాడు. రాత్రి ఎనిమిదింటికి ఇల్లు చేరటం రివాజు. ఆ యిల్లాలు ఒక్కతెకు ఏమీ తోచదు కాబోలు "త్వరగా రాకూడదుటండీ" అంటుంది. అవునుమరి, ఎలా తోస్తుంది.- ప్రక్కయింటివాటాలోని రేణుకకు ఉద్యోగం. ఎన్నో రాచకార్యాలు. ఎనిమిదిన్నరకుగాని రాదు. ఆ గృహిణికి ఈ గృహిణికి ఎలా కుదుర్తుంది?

శంకరం నవ్వుకున్నాడు. లీలావతి కూడా చదువుకున్నదేనట. గృహాలంకరణలో, సంసార నిర్వహణలో ఆమెను మించిన వ్యక్తిని తానింతవరకు చూడలేదంటుంది రేణుక.

ఒక స్త్రీగృహిణీత్వాన్ని సాటి స్త్రీలే మెచ్చుకోటం చాల అరుదు. అలాంటిది లీలావతి గృహ నిర్వహణను రేణుక మెచ్చుకుంటున్నదంటే గృహిణిగా ఆమె గొప్పతనం విదిత మౌతోంది. ఇంత చదువుచదివి, ఇన్ని తెలివి తేటలుండి లీలావతి గృహిణిగానే తన జీవితాన్ని వెళ్ళబుచ్చటం రేణుకకు నచ్చలేదు.

"మీరుకూడా ఉద్యోగం చేయరాదూ వేణ్ణీళ్ళకు చన్నీళ్ళలాగా ఆదాయమూ సరిపోతుంది; మంచి కాలక్షేపమూ అవుతుంది. నేటి సమాజంలో స్త్రీకి పరిపూర్ణమైన వ్యక్తిత్వం కావాలంటే ఇటు గృహిణిగానే కాకుండా అటు తన ఉద్యోగంలో కూడా సమాజానికి సేవ చేయాలి" అంటుంది రేణుక.

రేణుక మాటలకు లీలావతి నవ్వుతుంది. "నువ్వు చెప్పింది కాదనలేను. అవసరమొస్తే ఉద్యోగమూ చేయాలి. ఊళ్ళూ ఏలాలి; కాదనను. మనకా అవసరమేం వుందిప్పుడు? అంటారు మావారు. అదీగాక, నాకా ఉద్యోగంలో కంటే ఇలా గృహిణిగా ఉండటంలోనే ఆనందం వుందనిపిస్తుంది. మగవారికి మగువలు కౌంటర్ పార్ట్సట. పగలల్లా ఆఫీసులో పనిచేసి ఇంటికి వచ్చే భర్తకు ఇంటివద్ద కిలకిలలాడుతూ తన కోసం కాఫీ కప్పుతో వేచివుండే అర్ధాంగి అందించే ఆనందం, సంతృప్తి ఏ ఆడదీ తన ఉద్యోగంతో అందించలేదేమో."

లీలావతి మాటలకు రేణుక నవ్వి వూరుకుంది. బహుశః లీలావతి మాటలో కూడా నిజం లేకపోలేదని గ్రహించి మిన్నకుందేమో. అవునుమరి, ఎంత చదువుకున్నా ఉద్యోగం చేస్తున్నా స్త్రీ సహజమైన మనః ప్రవృత్తి అలా అనిపిస్తుందేమో....

గేటువద్ద చప్పుడైంది. ఆలోచనల్లో నుంచి తేరుకున్న శంకరం లేచివెళ్ళి తలుపు తీశాడు.

"అమ్మాయి యింకా రాలేదా బాబూ!"

"ఊహూఁ...."

"సరేలెండి. రేపొద్దున్నే వస్తాను. వచ్చి వెళ్ళానని చెప్పండి."

శంకరానికి వళ్ళు మండింది. "నే చెప్పను" అన్నాడు.

ఆ వచ్చిన వ్యక్తి అప్రతిభుడై అలాగే నిల్చుని ఆశ్చర్యపోయాడు. శంకరం అంత దృఢంగాను, నిక్కచ్చిగానూ మాట్లాడగా వినటం ఆయనకు మొదటిసారి, చెప్పినదానికి 'వూఁ' కొడుతూ సాత్వికంగా క్లుప్తమైన సమాధానాలు చెప్పే శంకరంలో ఈనాడీ మార్పేమిటో ఆయనకు బోధపడలేదు. ఆయినా తనకెందుకులెమ్మనుకున్నాడేమో 'సరే' అంటూ వెళ్ళిపోయాడు.

శంకరంలోని అహం దెబ్బతింది. ఇంటి వోనరు రాఘవయ్యగారంటే అతనికి సదభిప్రాయం లేదు. నెల పూర్తిగాకముందే అద్దెకు తయారు. "అమ్మాయి వుందా". "అమ్మాయి రాలేదా" అని అడుగుతాడు. అమ్మాయిని తప్పితే అడగకూడదు కాబోలు అద్దె యివ్వమని. చెట్టంత వాడు అబ్బాయి వుండగా అమ్మాయినే అడగటంలోని అంతర్యమేమిటి? పనిమనిషీ అంతే, పాలవాడు అంతే. దీనికంతటికీ కారణం తను నిరుద్యోగి కావటమేనా?

ఇక అక్కడ కూర్చోబుద్ధికాలేదు శంకరానికి. లోపలి కొచ్చాడు. గడియారం తొమ్మిదికావస్తోందని చెప్తోంది. గోడ వారగావున్న టేబులుపైన రేణుక ఫొటో నవ్వుతోంది. చేతిలో డిగ్రీతో, యూనివర్సిటీవారి లాంఛన ప్రాయమైన కోటు, హేటుతో దిగిన ఫోటో అది. నా విజ్ఞానంతో ప్రపంచమనే లేబరేటరీలో ఒక్కొక్క వ్యక్తిని ఒక్కొక్క పరికరంగా వాడుతూ ప్రయోగాలు చేస్తాననే ధీమా కనిపిస్తోంది ఫొటోలోని ఆమె ఫోజులో.

శంకరానికి హృదయం బరువెక్కినట్లయింది చిన్నతనంనుంచి తనెన్నో కలలు కన్నాడు. ఎన్నో ఆశలు పెంచుకున్నాడు—తనూ కనీసం ఒక డిగ్రీ అయినా సంపాదించాలని. "నీ కది అత్యాశ" అన్నది విధి.

"అరే. అప్పుడే వచ్చారే" అంటూ ప్రవేశించింది రేణుక.

శంకరం సన్నగా నవ్వాడు జవాబుగా.

"మీ చెల్లెలు కులాసానా!"

"ఊఁ ...."

రేణుక సంభాషణ పొడిగించలేదు. "స్నానంచేసి వస్తాను. భోంచేద్దాం" అని లోపలికి వెళ్ళింది.

సంభాషణను అలా త్రుంచినట్లు

నవ్వులాట

★ పక్కింట్లో హోరాహోరీ దెబ్బలాట జరుగుతుంటే భరించలేక ఒకాయన పోలీసులకు ఫోన్ చేశాడు. పోలీసులు వచ్చి తలుపు కొట్టారు ఒక ఆజానుబాహువైన స్త్రీ గుమ్మంలో నిలబడింది. ఇల్లంతా విరిగిపోయిన కుర్చీలు, బల్లలు, పటాలు, గిన్నెలు, పళ్ళేలు చిందర వందరగా పడి వున్నాయి.

ఈ ఇంటి యజమాని ఎవరండీ!" అని పోలీసు అడిగాడు.

"అదే సమస్య మేమిప్పుడు తేల్చుకుంటున్నది" అన్నదామె.

* * *

★ ఒకడు : వేలికి కట్టుకట్టావు దేనికిరా!"

రెండోవాడు : ఆ ఏం లేదు. చిన్న సిగరెట్టు తీసుకోబోతుంటే ఎవడో వెధవ తొక్కేడు."

—గుడిపాటి లక్ష్మీనరసింహం.

ఆపివేసి రేణుక లోపలికి వెళ్ళటం శంకరానికి నచ్చలేదు. ఎక్కువగా మాట్లాడితే హోదాకు భంగం కలుగుతుందని కాబోలు! ఎంత అహంభావం అనుకున్నాడు శంకరం.

భోజనాలు పూర్తయేసరికి పదిన్నరయింది. శంకరం ఏదో ఆలోచిస్తూ కుర్చీలో కూర్చున్నాడు. రేణుక వంటయింటి పని పూర్తి చేసుకుని వచ్చింది. టేబులు పైన వుంచిన తన వేనిటీ బ్యాగ్ను అందుకుని తనూ ఓ కుర్చీలో కూర్చుంది. వేనిటీ బ్యాగ్లోనుంచి కొన్ని పది రూపాయల నోట్లను పైకి తీస్తూ "ఇవాళ పే ఇచ్చారు" అంది చిరునవ్వుతో.

శంకరం ఆమెవైపు చూశాడు. రేణుక నోట్లు లెక్కపెడ్తోంది. శంకరం ఆ నోట్లవైపు కొన్ని క్షణాలపాటు చూశాడు. ఆమెతో ఏదో చెప్పాలని ప్రయత్నించాడు. కాని. చెప్పలేక పోతున్నాడు. భర్త ఏదో ఆలోచిస్తున్నాడనుకుని రేణుక కూడా ఏమీ మాట్లాడకుండా తన పని చూసుకుంటోంది.

కొన్ని నిముషాలు మౌనం దాల్చాయి.

"ఇదిగో, ఈ ఇరవై మీ ఖర్చులకు వుంచండి" అంటూ రెండు పది నోట్లను శంకరానికి అందించింది రేణుక.

రేణుక ప్రతి నెలా అలా ఇస్తోంది. ప్రతి వ్యక్తికీ కొన్ని వ్యక్తిగతమైన ఖర్చులు, అవసరాలూ వుంటవని ఆమెకు తెలుసు.

ఈసారి ఆ డబ్బును తీసుకుందామా వద్దా అని తటపటాయించాడు శంకరం. అతని ప్రమేయం లేకుండానే రెండు పదులూ అతని చేతిలో చేరాయి.

"రేణూ!"

మిగతా డబ్బును పెట్టెలో సర్దుతున్న రేణుక ఏమిటన్నట్లుగా చూసింది.

"ఇంకొంచెం డబ్బు కావాలి."

"ఎంత"

"ఓ వంద"

"వంద రూపాయలా! ఎందుకు?"

" "

"మాట్లాడరేం?"

"అవసరముంది"

"చెప్పకూడదా"

"ఒక వ్యక్తికి పంపించాలి"

కొంచెం సేపు ఉండి "మీ చెల్లెలికేనా?" అంది రేణుక.

శంకరం మాట్లాడలేదు.

"వసంతకి అంతగా అవసరమైతే యింటి నుంచీ తెప్పించి పంపుదాం లెండి" అంది.

శంకరం ఎందుకడిగానా అని నొచ్చుకున్నాడు. తనే ఒకరిమీద ఆధారపడవలసినవాడు, మరొకరికేం సాయం చేస్తాడు? తన సంగతి తెలిసుండి కూడా వసంత ఎందుకు అడగాలి తనని. వసంత పలికిన మాటలు గుర్తు వచ్చాయతనికి.

"నీ పద్ధతి నాకేం నచ్చలేదన్నయ్యా?" అంది వసంత.

"ఏం" అని అడిగాడు తను.

"భార్య సంపాదనమీద ఆధారపడి ఎన్నాళ్ళు గడుపుతావ్? నీ వ్యక్తిత్వమేం వుంటుంది? భార్య ఉద్యోగం చేస్తూ వూళ్ళేలుతుంటే, భర్త యింట్లో కూర్చోటం - నలుగురూ ఏమనుకుంటారు? నలుగురి సంగతి అలా వుంచు: నీ యింట్లో నీకు విలువ వుంటుందా?"

వసంత అన్నదాంట్లో పొరపాటేమీ కనిపించలేదు తనకు. అయినా, తనను తాను సమర్థించుకునే ధోరణిలో అన్నాడు.

"నా కలాంటి భేదాభిప్రాయాలేమీ తోచటం లేదు. రేణుక మనస్తత్వం అలాంటిది కాదు. ఎవరి విలువలకూ భంగం లేకుండానే గడుపుతున్నాం" అన్నాడు.

"నీ వనుకోగానే సరిపోతుందా?"

తనిక మాట్లాడలేదు. ఆ సంభాషణను పొడిగించటం తన కిష్టం లేకపోయింది. తన మనసులోని మారుమూలల్లో వసంత వెలిబుచ్చిన అభిప్రాయాలు లేకపోలేదు. కాని, తానిన్నాళ్లూ వాటికి ప్రాధాన్యత నివ్వలేదు.

తనలోని లోపాన్ని లోకం గుర్తించనంత కాలం మనిషి బాధపడడు. తనకా లోపమున్నట్లుగా కూడా ప్రవర్తించడు. కాని, తన లోపాన్ని మరొకరు ఎత్తి చూపినప్పుడు అతనిలో రియాక్షన్ ప్రారంభ మవుతుంది. తనలో కూడా అలాంటి పరివర్తన కనిపిస్తోందప్పుడే.

తను బయలుదేరేటప్పుడు చెల్లెలు తల వంచుకుని అంది:

"నీ సంగతి తెలిసికూడా అడుగుతున్నానని అనుకోకు. ఒక్క వంద రూపాయలు సర్దగలవా? చాల అవసరంగా వుంది."

తను మాట్లాడలేదు. ఎన్నో ఆలోచనలు తన మనసులో రేగాయి. ఆడపిల్లను అప్పుడప్పుడూ పుట్టింటికి తీసుకెళ్ళటం, ఏదో చీర, రవిక పెట్టి ఆమెను సంతోషపర్చటం లోకధర్మం. కాని, వసంత కాపురానికి వెళ్ళి

తర్వాత ఇల్లతవరకూ తన వద్దనుండి ఏమీ ఆశించలేదు ఇప్పుడు అవసరం వచ్చిందంటూ నోరుతెరచి అడిగినప్పుడు తను లేదనగలడా?

"పంపుతాను" అని వచ్చేశాడు తను

రేణుక అతనికి దగ్గరగా వచ్చింది అతనిమీదికి వంగి "కోపం వచ్చిందా" అని అడిగింది.

"కోపమెందుకు" అన్నాడు శంకరం ఎటో చూస్తూ.

"ఆవేశంగా మాట్లాడినట్లున్నాను. క్షమించండి" అంది రేణుక.

శంకరం ఏమీ మాట్లాడలేదు. చెల్లెలికిచ్చిన మాట పోతుందనే ఆవేదన. తానుగా అడిగినా భార్య పైకం ఇవ్వటానికి నిరాకరించిందనే అవమానం అతన్ని దహించివేస్తున్నాయి. అంతలోనే తన దుస్థితికి తనకే జాలివేసింది. వసంత చెప్పినట్లు ప్రతిదానికీ భార్య మీద ఎన్నాళ్ళని ఆధారపడటం? ఏమైనా సరే, ఏదో విధంగా ఉద్యోగం సంపాదించాలని నిశ్చయించుకున్నాడు. కాని, ఎవరిస్తారు? ఎవరు సహాయం చేస్తారు?

[సశేషం]

తెలుగు, హిందీ, ఆంగ్ల రంగాలలో ఆంధ్రులూ, జగజ్జెయ్యారూ!

సినిమా

1965 లో వలె 'తేనెమనసులు' వంటి 'అదుర్తి ప్రయోగాలు' 1966 లో జరుగకపోయినా క్రితం సంవత్సరంలో కంటె ఎక్కువ మంది తారలు, సాంకేతిక ప్రవీణులు పరిచయమైనారని చెప్పవచ్చు.

ఒకటి రెండు కొత్త తరహా చిత్రాలు, ఒకరిద్దరికి కొత్త రకం నాయక పాత్రలు లభించాయి. బాలిక ద్విపాత్రాభినయంనుంచి (లేత మనసులు), రూప సంబంధంలేని రెండు పాత్రల నిర్వహణనుంచి (శ్రీకృష్ణ పాండవీయం), రససంబంధంకల నవ పాత్రల నిర్వహణవరకు (నవరాత్రి) నవరుచుల నిచ్చింది.

మనం చరిత్రను వదలలేదని 'పల్నాటియుద్ధం' నిరూపించింది. జాతి ప్రాచీన చరిత్ర, సంస్కృతి, పౌరాణిక సంబంధాలు వదలలేదని 'శ్రీకాకుళ ఆంధ్ర మహావిష్ణు కథ' రుజువు చేసింది.

అయినా ఇది ఆధునిక కాలం. చైనా, పాకిస్తాన్ యుద్ధాలయ్యాయి. దేశం, వేగులపని ఇప్పటి సినిమా పని అని 'గూఢచారి 116' పలికాడు.

'చిలకా-గోరింక' కొత్త నాయకులకూ కాలం వుందన్న గీతం పాడింది. కృష్ణంరాజును నాయకునిగా పరిచయం చేసింది.

ఇదేదో వస్తాదుల సంవత్సరంగా కూడా కన్పించింది. ఇంతవరకు వారిని అప్రధాన పాత్రలకు ఉపయోగించారు. ఆసియా వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియనులు దండమూడి రాజగోపాల్, కామినేని ఈశ్వరరావు 'భీమాంజనేయ యుద్ధం'లో రెండు ముఖ్య భూమికల భారం వహించారు.

'ఆత్మ గౌరవం' కలం గౌరవం నిలిపింది. భమిడిపాటి రాధాకృష్ణను సినీ సంభాషణల కర్తగా పరిచయం చేసింది. 'కన్నె మనసులు' మరొక కలం మనసును చిత్రకళా సుందరునితో కలిపింది. ఎన్. ఆర్. నంది సినీ డైలాగ్ రైటర్‌గా పరిచితులైనారు.

1966 లో విడుదలైన 33

స్ట్రెయిట్ ట్రిక్ తెలుగు చిత్రాలలో విడుదల క్రమంబట్టి కొత్తకు ప్రయత్నించిన సందర్భాలను దిగువ ఉదహరిస్తున్నాను.

"మొనగాళ్ళకు మొనగాడు" ఎస్. ఎస్. లాల్‌ను స్వతంత్ర ఛాయాగ్రహణ దర్శకునిగా పరిచయం చేసింది. "హంతకులొస్తున్నారు జాగ్రత్త" లో ఈయన పనితనం మరింత బాగా కన్పించింది.

"శ్రీకృష్ణ పాండవీయం" కృష్ణ, సుయోధన భూమికలలో రామారావును చూపడమే కాక, దర్శకునిగా ఆయన ప్రతిభను చాటడమే కాక, కే. ఆర్. విజయను తెలుగు తెరకు తెచ్చింది. మయసభకు టి. వి. ఎస్. శర్మ "సెట్లు" ఆంధ్ర చిత్రకళా లక్ష్మికి అమూల్యాభరణం.

"పల్నాటియుద్ధం" కొత్తగా సినీ కవి బసవలింగదేవరను పరిచయం చేసింది. "భక్త పోతన" ద్వారా రచయిత దాసం గోపాలకృష్ణ పరిచయమైనారు. అలాగే "విజయశంఖం" కృష్ణమేడలను తెరపరిచితుని చేసింది.

"లోగుట్టు పెరుమాళ్ళ కెరుక" కె. ఎస్. ఆర్. దాసు అనే ఎడిటర్‌కు దర్శకత్వ అవకాశ మివ్వడమే కాక శోభన్‌బాబును డ్యాషింగ్ హీరో చేసే వసతి కలుగజేసింది.

"ఆత్మ గౌరవం" కె. విశ్వనాథ్‌కు దర్శక గౌరవమిచ్చింది. భవిష్యత్తు పదిలమేనని నందీ అవార్డు నిరూపించింది. భమిడిపాటి రాధాకృష్ణ సినీ హాస్య సారస్వతానికి ఒక తురాయి తొడిగారు. నృత్య-సంగీతాలలోను, లొకేషన్‌లలోను ఈ చిత్రం కొత్త పుంత త్రొక్కింది.

"నవరాత్రి" నాగేశ్వరరావు నట జీవితానికే నవరాత్రి అయింది. తాతినేని రామారావు దర్శక జీవితానికి శుభరాత్రికూడా అయింది.

"అగ్గి బరాటా" విలనుల కొరత తీర్చడానికి కొంత ప్రయత్నించింది. ఎస్. వి. రామదాసు రూపభావాలు మాత్రం బాగున్నాయి. వాచికం గురించే ఆలోచించాలి.



విజయ భారతీవారి "శభాష్‌రంగా"లో జయలలిత



ఇందిరారమణా పిక్చర్సువారి సత్యమేజయం" చిత్రంలో
ప్రసన్నలక్ష్మి (రత్న

"చిలకా – గోరింక" భువనగిరి శిలలనే పలికించింది, రమాప్రభ ఇందులో మొగ్గతొడిగి "డాక్టర్ ఆనంద్"లో పుష్పించింది.

"సంగీత లక్ష్మి" ఏ విధంగా అయితేనేమి, మన తెలుగు సినిమాలను ఒక విదేశ వాతావరణంలోకి తీసుకొని వెళ్ళింది. స్టాక్ షాట్స్ అయినా బాగా కలిపారు. పాటల చిత్రీకరణలోకూడా ఏదో ఒక కొత్త భావపటిమ, రవ్వంత రష్యా రంగు కన్పించింది. అందుకు కారణం కొత్తగా దర్శకత్వ బాధ్యత వహించింది రష్యాలో సంగీత, నృత్య, సారస్వత, చలన చిత్రకళా రంగాలలో అభ్యాసం చేసి వ్యక్తి (గిడుతూరి సూర్యం) కావడం

"గూఢచారి 116" సబ్జెక్టులో నవీనత వుంది. నేటి, రేపటి గుబాళింపు లున్నాయి నిన్న (1965) పరిచితుడైన కృష్ణ రేపు "హీ" – "హీరో" కావడానికి నేడు (1966) ఒకమెట్టు అయింది.

"లేత మనసులు" కథా సంవిధానంలో ఒక కొత్తదనాన్ని విరజిమ్మడం అటుంచి పెద్దనటుల నటనే వల్లీకొట్టించే పిల్ల నటన (బేబి పద్మిని నటన) – జంట నటన చూపిం

-చింది. తెలుగు బిడ్డ కాకపోయినా షేవి వ్రత్మని ముద్దుగా తెలుగు పలికింది; అందంగా అభినయించింది. బాలిక ద్విపాత్రాభినయంలో ఇది కొత్త వుంత.

"మనసే మందిరం" నిజానికి ఛాయాగ్రహణ కళా మందిరం. హైదరాబాద్ శ్రీ సారధి స్టుడియోస్ అంతటి కళా ప్రమాణాన్ని నెలకొల్పడం మరింత హర్షదాయకం. తెలుగు రంగానికి ఈ చిత్రంద్వారా పరిచితుడైన ఛాయాగ్రహణ దర్శకుడు బాలు. ఈయన నిజానికి తెలుగు ప్రేక్షకులకు కొత్తవాడు కాదు. సాక్షాత్తూ శాంతారామ్ బావమరది రాజకమల్ కళామందిర్ వారి హిందీ చిత్రాలకు సినిమటోగ్రాఫర్‌గా పనిచేసిన కళా నిపుణుడు "ఝనక్ ఝనక్ పాయెల్ బాజె", "నవరంగ్" మొదలైన హిందీ చిత్రాలలో ఈయన సిద్ధహస్త వర్ణాలను మనం చూచివున్నాము అయితే "మనసే మందిరం" చిత్రకళ రంగు(లు) తెలుపు - నలుపు బాలూ కీర్తిని మరింతగా తెలుపుతుంది.

"శ్రీమతి" చిన్న వారి పెద్ద ప్రయత్నం విజయా రెడ్డి దర్శకుడుగా, నిత్యానంద్ సంగీత దర్శకుడుగా కథకుడుగా పరిచితులైనారు.

భూప్రదక్షిణం

1966 ప్రపంచ చలన చిత్ర పటంలో, ముఖ్యంగా సోవియెట్ చలన చిత్ర పటంలో తెలుగు చుక్క పెట్టింది.

"పదండి ముందుకు" తో వి. మధుసూదనరావు, గుమ్మడి వెంకటేశ్వర రావు, జమున సోవియెట్ రష్యా ఐరోపా యాత్రలు చేసి వచ్చారు.

హిందీ

కె. ప్రత్యగాత్మ కె. పి. ఆత్మ అయి రాజకపూర్, దేవ్‌ఆనంద్‌ల ప్రశంసల నందు కొన్నారు—"ఛోటా భాయి" హిందీ చిత్రం ద్వారా.

ఎస్. జానకి తమిళ చిత్రానికి జపాన్ పాట పాడారు. బెంగాలి చిత్రానికి బెంగాలీ పాటలు పాడారు.

తెలుగు చిత్రాలు బెంగాలీలోకి "డబ్" చేస్తే డబ్బు చేసుకొంటున్నాయి.

నూతన్ తెలుగు పాట పాడింది.

బొంబాయి హిందీరంగంలో శారద నేపథ్యగాయనిగా పైకి వస్తున్నారు. మహమ్మద్ రఫీతో మొట్టమొదటిపాట (యుగళగీతం) "జాన్ చమన్" పాడినప్పటినుంచే ఆమె పాప్యులర్ అయినారు. శంకర్—జైకిషన్‌లు ఆమెను శబ్ద (సంగీత) ప్రపంచానికి తీసుకొని వచ్చారు. వారి అధ్వర్యంలో పై పాట పాడినప్పుడు ఆర్కెస్ట్రాలో వున్నది 100 మంది. అయినా ఆమె జంకలేదు. "ఆయేగా కౌన్ యహా (గుమ్నామ్), తీత్లీ ఊరీ (సూరజ్), 'హెల్లో హెల్లో' (ప్యార్ మొహబ్బత్‌లో టెలిఫోన్ పాట), 'తేరేసివ కౌన్ హై మేరా' మొదలైన పాటలతో శారద గాన



హైదరాబాద్ మూవీస్‌వారి "అర్ధరాత్రి" చిత్రంలో
జగ్గయ్య, భారతి

కోకిల స్థానానికి కొన్ని మెట్లు అధిగమించారు.

శంకర్ - జైకిషన్‌ల సంగీత దర్శకత్వంలో ఆమె 60 కి పైగా పాటలు పాడారు లలిత, శాస్త్ర సంగీతాలు రెండింటిలోను శారద విశారద కాగలదు.

తాతినేని ప్రకాశరావు "సూరజ్" 1966 జూబిలీ చిత్రం.

ఆంగ్లం

'గైడ్' అంతర్జాతీయ ప్రతితో విజయవాడ తార వహీదా రహ్మాన్ విశ్వవిఖ్యాతి నార్జించింది.

1967 లో ఇంకా ఘనమైన విజయాలకు ఎదురుచూద్దాము.

* * *

దశావతారం

ఆనందగౌరి ఫిలిమ్స్ అనే సంస్థ తెలుగులో 'దశావతారం' తీయడానికి ప్రయత్నాలు సాగిస్తున్నది

' రంగుల రాట్నం"

కథకంటే కథాసంవిధానంలో, కథాసంవిధానంకంటే పాత్రలలో, పాత్రలకంటే పాత్రధారులలో కొత్త రంగులు కన్పించిన చిత్రం వాహినీవారి, బి. ఎన్. రెడ్డివారి "రంగులరాట్నం"

కొల్లలుగా కొత్త బాల యువ నటులు, కొత్త రూప భాషలలో పాత నటీనటులు, సెమీ పాత నటీ నటులు కన్పించిన ఈ చిత్రంలో ముఖ్యంగా చెప్పవలసింది వ్యవసాయశాస్త్ర పట్టభద్రుడు చంద్రమోహన్ విశిష్ట నటన. ప్రథమ ప్రయత్నంలోనే ఇంత అప్రయత్నంగా అందంగా నటించిన నటులు ఈ మధ్య ఏ భాషలో అయినా అరుదే

రెండవది 17 రీళ్ళ చిత్రంలో అశ్లీల అసభ్య శృంగార సన్నివేశాలు కాని సంభాషణలు కాని లేక పోవడం ఒకటీ అరా ప్రేమ గీతం వున్నా కవితా ధోరణిలో ఉన్నత పూజనీయ భావపథంలో చిత్రీకరించి సినిమా అంటే పచ్చి శృంగారంకాదు, మనో రంజక సీమ అని "పాతకాలపు" బి యన్. రెడ్డి నిరూపించారు ఆ మేరకు వాహినీ పేరు నిలిపారు.

మూడవది ఏ. కె. శేఖర్ కళా దర్శకత్వం మామూలు ఇళ్ళ సెట్లు అయితే పొందికగా అయినా అలంకృతంగా అందంగా స్వాభావికంగా నిర్మించారు సిరిసంపదలు తాండవించే పెద్ద పెద్ద సెట్లు కన్నులకు మిరు మిట్లుగొలుపుతూ కళాత్మకంగా శోభించాయి.

ఇక చివర చెప్ప దగింది పాతనటి పుష్పవల్లి కొత్త తరహా క్లిష్ట భూమికను స్వాభావికంగా నిర్వహించడము కాకగాలకు సినిమారంగంలో ఉజ్వల భవిష్యత్తు కనిపించడము, కొత్తగా తెరకు పరిచితులైన బాల నటీ నటులు హుందాగా, హద్దులలో అచితూచిన నటనను ప్రదర్శించడమూను.


చిత్రం మొత్తంపై మంచి ఎంత కనిపిస్తున్నదో కథలో అంత 'చెడ్డ లోటు' కూడా కానవస్తున్నది.

"మానవ జీవితం ఒక రంగుల రాట్నం. ఆ రాట్న భ్రమణంలో ఎన్నో ఒడుదుడుకులు, ఎత్తుపల్లాలు వెలుగు చీకట్లూను .

"కలిమి నిలవదు . లేమి మిగలదు .. కలకాలమొక్కరీతి గడవదు ... నవ్వినకళ్ళే చెమ్మగిల్లును... వాడిన బ్రతుకే పచ్చగిల్లును ఇంతే ఈ జీవితమూ ... తిరిగే రంగుల రాట్నం ..."

— అన్నవి 'రంగులరాట్నం' కథలో ఒక ముఖ్య భాగం.

ఒక దివాణం భోగాలు అనుభవించిన పల్లెలో పుల్లలమ్మ లేక పట్నం వచ్చిన సుందరరామయ్య ఆశలు భగ్నంకాగా గుండె పగిలి మరణిస్తాడు. భర్త ఆశయాలు నెరవేర్చ



"ఇద్దరు మొనగాళ్లు"లో కాంతారావు కృష్ణకుమారి

ంకోసం భార్య సీతమ్మ (అంజలీ దేవి) పుల్లఅమ్మడమేకాదు అంత కంటే నామోషి అయిన పనులే చేసి ఇద్దరు కొడుకులను, ఒక కూతురును పైకి తీసుకువస్తుంది

కలిమి లేములు రంగుల రాట్నం కాగా పెద్దకొడుకు సూర్యం (రామమోహన్) వకీలు అవుతాడు అన్న కోసం తన చదువు మానుకొని కుస్తీ పోటీలలో పాల్గొని, ఎమ్యూజ్‌మెంట్ పార్క్‌లో పని చేసి తమ్ముడు వాసు (చంద్రమోహన్) అమ్మ సంపాదనకు వేన్నీళ్ళకు చన్నీళ్ళవుతాడు వీరి చెల్లెలు జయ (నీరజ) వేణు (నాగరాజారావు) అనే గొప్పింటి బిడ్డను ప్రేమిస్తుంది. మొత్తానికి "వాడిన సీతమ్మ సంసారం బ్రతుకు పచ్చగిల్లింది. ఆ మేరకు కథలోని ఒక ప్రముఖ భాగం పకడ్బందీగా చక్కటి పాత్ర పోషణతో (క్యారక్టరైజేషన్) సాగింది.

"రంగుల రాట్నం" కథలో నిర్మాతలు ఆశించిన రెండవ ముఖ్యభాగం వైనం ఇలా వుంది...

"సీతమ్మ సంసారపు రంగుల రాట్నంలో మరొక భ్రమణం ఆరంభమైంది. కొడుకు లిద్దరి మధ్య – సూర్యం, వాసుల మధ్య – సంఘర్షణ ప్రారంభమైంది. కీర్తికాంక్ష,

పదవీ వ్యామోహం సూర్యాన్ని వశం చేసుకొన్నాయి. అప్పటికే అతడు మునిసిపల్ ఛైర్మన్ అప్పల స్వామి (రమణారెడ్డి), ఆయన సతీమణి (పుష్పవల్లి) గారాబు అల్లుడైనాడు. గొప్పింటి అల్లుడన్నమాట.

నిజాయితీకి నిలబడి – పేదల క్షేమానికై పాటుపడే వాసుకూ- అధికార పిశాచానికి లొంగిపోయిన సూర్యానికి సంఘర్షణ తప్పనిసరి అయింది – కాని, అది అన్నదమ్ముల మధ్య సంఘర్షణ, అనడంకంటె-కన్న తల్లికి అగ్నిపరీక్ష అనడం సమంజసం. సీతమ్మ లోన కుమిలిపోయింది. తనకు యిద్దరు కొడుకులూ ఒకటే! ఏ తల్లి అయినా మనసారా కోరేది తన బిడ్డల అన్యోన్యత, ఐకమత్యం, అభ్యున్నతి! కాని, ఎవర్ని కాదవ గలదు! ఎవరికి చెప్పగలదు.

కక్షలు పెంచుకొని, కత్తులు దూసుకొనే కొడుకుల యిద్దరిమధ్య నిలబడి – అక్షరాలా తన రక్తం ధారపోసి – బిడ్డల సామరస్యానికి ఆ ఆదర్శ మాతృమూర్తి పాటుపడింది. కల్లోల భ్రమణం పూర్తి అయిన రంగుల రాట్నం తిరిగి ప్రశాంత భ్రమణం ప్రారంభించింది.

ఈ రెండవ కథా భాగంలో నిర్మాతలు అక్షరాలలో ఆశించింది తెరపై కాని, పాత్రల ద్వారా కాని, సన్నివేశ సందర్భ పురస్పరంగా గాని బలంగా నిరూపించలేక పోయారు. అన్నింటికి మునిసిపల్ ఎలక్షన్‌లను, ఎమ్యూజ్‌మెంట్ పార్కును ఆసరా చేసుకొని పాత్ర కల్పనకు, తల్లిబిడ్డల భావసంఘర్షణకు సహజ కారణాలు సృష్టించలేక పోయారు.

అయినా ఇప్పుడు ఆంధ్ర దేశమంతా ఎన్నికల సంరంభంలో వున్నందున ఈ సినిమా ఎన్నికలు ఒక సైడ్ అట్రాక్షన్‌గా – కులాసా కాలక్షేపానికి ఉపయోగించాయి.

పాలగుమ్మి పద్మరాజు అమర్చిన కథకు బి. యన్. గారే కథా సంవిధానం (స్క్రీన్‌ప్లే) సంతరించారు. డి. వి. నరసరాజు సంభాషణలు సమకూర్చారు. సంభాషణలూ హుషారుగా సాగాయి. దాశరథి, నారాయణరెడ్డి, కొసరాజు, భుజంగరాయ శర్మ పాటలు రచించారు. యస్. రాజేశ్వరరావు, గోపాలం బాణీలు కట్టారు. యు. రాజగోపాల్ ఛాయాగ్రహణ దర్శకత్వం వహించారు. ఇవన్నీ సాధారణ స్థాయిలో వున్నాయి. అంజలి నటన ఉన్నతం. మితవ్యయంతో, సాధారణ తారాగణంతో, అసాధారణ కళా విన్యాసంతో ఈ చిత్రం తయారైంది.

* * *

"వైజాగ్ టు హైదరాబాద్"

వైజాగ్ టు హైదరాబాద్ అనే కొత్త వినోద యాత్ర కథా చిత్రాన్ని కె. అప్పారావు మద్రాసులో నిర్మించ బోతున్నారు.



"హంతకుని హత్య"లో ఒక దృశ్యం

"గోపాలుడు–భూపాలుడు"

శృంగార, అద్భుతరస ప్రధాన చిత్రం గౌరీ ప్రొడక్షన్స్ వారి "గోపాలుడు–భూపాలుడు." కవల పిల్లల జానపద కథలో ఇద్దరూ ఉత్తములై ఒకరికొకరు సహాయపడి ఒకరి సమస్యలను మరొకరు తీర్చడం బహుశా ఈ చిత్రంతోనే ప్రారంభం. రెండు భూమికలలో ఒకటి మన పల్లె వాతావరణానికి సంబంధించినది కావడం, రెండవది రాజరికానికి సంబంధించినదై వుండడం మన సీమకు ఎంతో సహజ సౌందర్యం తెచ్చాయి. ఆ రెండింటినీ–రామారావు ధరించి అద్భుత వీర రసాలు కుప్పించడం, గోపాలుడికి ఒక రంభ (రాజశ్రీ), భూపాలుడికి ఒక రంభ (జయలలిత) జోడీలు కావడంతో, చిత్రంలో శృంగారం పుష్కలంగా లభించింది. వీటన్నింటికి తోడు, ప్రాతి పదిక "సెంటిమెంట్" కావడం మరొక విశేషం. స్వయాన తల్లి తన చేతులారా తన కవల

పిల్లలనే వేరు చెయ్యడం, ఒకరికి అడవియోగం, మరొకరికి రాజయోగం సంప్రాప్తింప జేయడంతో కథ ప్రారంభమై అడవియోధుడే రాజవీరుని రాజ్యాన్ని, రాజరికాన్ని, కన్న తల్లిని కాపాడడం "గోపాలుడు-భూపాలుడు" చిత్ర కథా విశేషం.

కుంతల రాజవంశంలో ఆరు తరాలుగా సింహాసనం కోసం అన్నదమ్ములు ఒకరి నొకరు హత్య చేసుకొంటున్నారు. మహారాణికి కవలలు పుట్టిన పురిటిగదిలోనే మహారాజును అతని తమ్ముడు దారుణంగా హత్య చేశాడు. ప్రాణావశిష్టుడైన మహారాజు తమ్ముని చంపేశాడు. ఆ దారుణ దృశ్యం కళ్ళారా చూసిన మహారాణి తన కవల పిల్లలు కూడా ఇటువంటి దారుణానికి పాల్పడరాదని యెంచి ఒకరిని అడవికి పంపుతుంది. అతడు గోపాలు డౌతాడు. ఒకడు రాజ భోగాలతో పెరుగుతాడు. ఈతడు భూపాలు డౌతాడు. భూపాలుడు రజని (జయలలిత) అనే అడవి పిల్లను ప్రేమిస్తాడు. మేనమామ కూతురు పద్మ (రాజశ్రీ) ఒక విచిత్ర పరిస్థితిలో గోపాలుని ప్రేమిస్తుంది. గోపాలుడు, భూపాలుడు ఒక విశేష పరిస్థితిలో మహారాణి (ఎస్. వరలక్ష్మి) ఎదుటే కత్తులు దూసి పోరాడుతుంటారు. కారణం ?

తల్లి బిడ్డలను వేరు చేసింది. గోపాలుడు ప్రేమించిన పద్మను భూపాలుని కిచ్చి వివాహం చెయ్య తలపెట్టింది. భూపాలుడు అంతర్ధానమైనాడు. గోపాలుడే ఆ పని చేశాడని మొత్తం రాజదర్బారు పని కట్టింది; కసి గట్టింది.

భూపాలు డేమైనాడు ? గోపాలుడు తనపై పరీక్షను ఎలా నెగ్గుకొంటూ వచ్చాడు ? పద్మ, రజని తమ మనోహరులనే చేరగలిగారా ?

దారుణ హత్యలకు దిగగలరను కొన్న కవలపిల్లలు అమ్మకు చెప్పిందేమిటి ? చూపిందేమిటి ? తల్లడిల్లిన తల్లి హృదయం తుదకు ఏమయినది ?

ఈ చిత్ర ప్రశ్నలకు విచిత్ర సమాధానం ఈ 17 రీళ్ళ చిత్రమిస్తుంది.

అధిక వ్యయప్రయాసల కోర్చి కంటిని, మనసును రంజింపజేసే యత్నంతో తయారు చేసిన "గోపాలుడు - భూపాలుడు" సాంకేతిక, తారాబృంద వివరమిది :

కథ - నిర్వహణ : యన్. భావనారాయణ, నిర్మాత : వై. వి. రావు, మాటలు : పాలగుమ్మి పద్మరాజు, పాటలు : సి. నారాయణ రెడ్డి, ఆరుద్ర; దర్శకత్వం : జి. విశ్వనాథం. సంగీతం : కోదండపాణి, ఛాయాగ్రహణం : వేణు, కళ : పి. యన్. మీనన్, కూర్పు : కె. యస్. ఆర్. దాస్.

తారాగణం : యన్. టి. రామారావు, రాజశ్రీ, జయ

లలిత, రాజనాల, మిక్కిలినేని, పద్మనాభం, అల్లు రామలింగయ్య, సత్యనారాయణ, ప్రభాకరరెడ్డి, జగ్గారావు, సి.హెచ్. కృష్ణమూర్తి, శ్రీకాంత్, ఎస్. వరలక్ష్మి, వాణిశ్రీ, హేమలత.

* * *

పాములు పట్టిన రాజనాల

జయంతి వారి జానపద చిత్ర నిర్మాణం ప్రారంభమైంది. రాజనాల పాములు ఏరుకొనేవానిగాను, సురభి బాలసరస్వతి సహాయకురాలుగాను మొదటి సన్నివేశం చిత్రీకరించారు. కె. వి. రెడ్డి దర్శకత్వంవహిస్తున్న ఈ కొత్త తరహా హాస్య శృంగార వీర అద్భుత రస చిత్రానికి పింగళి నాగేంద్రరావు కథ, సంభాషణలు, పాటలు సమకూర్చారు. వాహిని స్టుడియోస్‌లో వేసిన పాముల పుట్ట సెట్టులో పదిహన్నెండు విషసర్పాలు నాగస్వరానికి ప్రళయ నృత్యం చెయ్యడం, వాటిలో బాగా కాటు వేసే పామును ఒక దుష్ట కార్యానికి రాజనాల ఎంచుకోడం చిత్రీకరించారు. సంగీత దర్శకుడు పెండ్యాల నాగేశ్వరరావు. రామారావు, సరోజాదేవి, పద్మనాభం, ముక్కామల మొదలైన వారు తారాగణంలో కలరు. ఫిబ్రవరిలో మరొక షెడ్యూలు జరుగుతుంది. నాగస్వరం ఈ చిత్రానికి హైలైట్ అంటున్నారు.

చలన చిత్ర వార్తలు

అన్నపూర్ణా కొత్త గాయకుడు

అన్నపూర్ణా పిక్చర్స్‌వారి "పూలరంగడు" మూడవ షెడ్యూలు హైదరాబాద్ శ్రీ సారథి స్టుడియోస్‌లో జనవరి రెండవ తేదీనుంచి 12వ తేదీవరకు జరిగింది. హీరో సెట్‌పై నాయికా నాయకులపై చిత్రీకరణ సాగింది. గుమ్మడి, నాగయ్య మొదలైన భూమికలపై కూడా మరికొంత చిత్రీకరణ సాగింది. అంతకుముందు మద్రాసులో అన్నపూర్ణా వారు మోహన్‌రాజు అనే కొత్త గాయకుడు, సుశీలలచే యుగళగీతం పాడించి రికార్డు చేశారు. శోభన్‌బాబు, విజయనిర్మలలపై ఆ పాటను చిత్రీకరిస్తారు. ఆదుర్తి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి దుక్కిపాటి మధుసూదనరావు, నిర్మాత. నాగేశ్వరరావు, జమున ముఖ్య భూమికలు ధరిస్తున్నారు.

డి. బి. ఎన్. కొత్త కెమెరామన్

డి. బి. ఎన్ వారు "ప్రయివేట్ మాష్టారు" చిత్రం ద్వారా కొమ్మన రామకృష్ణారావు అనే కొత్త ఛాయాగ్రాహకుని పరిచయం చేస్తున్నారు. తాతినేని ప్రకాశరావు, ఆదుర్తి మొదలైనవారి కలర్ చిత్రాలలో ముఖ్య సహాయకునిగా పనిచేసిన

ఈయన ఛాయాగ్రహణ శాస్త్రంలో డిప్లమాహోల్డర్. ఇటీవల వంటవాని (అల్లురామలింగయ్య) పెంకుటిల్లు భాగంలో జరిగిన చిత్రీకరణలో కాంచన, రాంమోహన్ లపై సన్నివేశాలు చిత్రీకరించారు. అప్పటికి 4000 అడుగులకు పైగా చిత్రం తయారైంది. జనవరి మధ్యనుంచి 12 రోజుల పాటు ఒక ఆడంబర గృహంలో చిత్రీకరణ జరుగుతున్నది. దర్శకుడు విశ్వం. నిర్మాత డి. బి. ఎన్.

ఒకటవ తేదీన మొదటి పాట

కళాభారతి మూవీస్ అనే కొత్త సంస్థ జనవరి మొదటి తేదీన మద్రాసులో పాట రికార్డింగ్‌తో "కాలచక్రం" సాంఘిక చిత్ర నిర్మాణంలో ప్రాథమిక దశను ప్రారంభించారు. పూనాలోని ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌లో దర్శకత్వంలో డిప్లమాసాధించిన మోహన్‌కొండా ఈ చిత్రం దర్శకుడు. నిర్మాత: దయాకరరావు. కె. వి. నాగేశ్వరరావు, శారద, ప్రభాకరరెడ్డి, రాజబాబు మొదలైన వారు నటించే ఈ చిత్రానికి రాజశ్రీ సంభాషణలు సమకూర్చారు. సంగీతం : టి. వి. రాజు. కెమెరా : సీతారామ్.

భీమార్జున గర్వభంగం

సి. ఎస్. రావు దర్శకత్వంలో మంజుల సిండికేట్ వారు "భీమార్జున గర్వభంగం" నిర్మించేందుకు హుటాహుటిగా సన్నాహాలు సాగిస్తున్నారు. ఎన్. టి. రామారావు ప్రధాన భూమిక ధరించే ఈ చిత్రానికి మహారథి సాహిత్యం సమకూరుస్తున్నారు.

కొత్త చిత్రాలు

ప్రతి అంగుళం ఔట్‌డోర్

బాపు, ముళ్ళపూడి వెంకటరమణ, సురేష్‌కుమార్ కలిసి నందన ఫిలిమ్స్ పేరిట నిర్మించబోతున్న "సాక్షి" అనే సాంఘిక చిత్రంలో ఒక్క అంగుళమైనా స్టుడియో సెట్‌లో చిత్రీకరించబడదు. సంపూర్ణంగా ఔట్ డోర్‌లోను, ఇళ్ళలోపల జరిగే ఒకటి రెండు సన్నివేశాలు నిజమైన యిళ్ళలోను చిత్రీకరిస్తారు. ఆనందమోహన్ అనే ఆరు అడుగుల నాలుగు అంగుళాల ఎత్తు నటుని, ఆర్. రంగారావు అనే మరొక కొత్త నటుని పరిచయంచేసే ఈ చిత్రంలో కృష్ణ, విజయనిర్మల, జగ్గారావు, రాజబాబు, రామన్నపంతులు, చలపతిరావు నటిస్తారు. బాపు చిత్ర దర్శకుడు, నిర్మాత : సురేష్‌కుమార్. కథ : ముళ్ళపూడి వెంకటరమణ, పాటలు:ఆరుద్ర,కొసరాజు,ఆత్రేయ దాశరథి, సంగీతం : కె. వి. మహాదేవన్. కెమెరా : పి. ఎస్. సెల్వరాజ్, విడుదల నవయుగ. నందనా ప్రయత్నంలో మరొక ఆనందకర విషయం బొబ్బర్లంకలోను, ర్యాలి లాకులవద్ద ఎక్కువ దృశ్యాలను చిత్రీకరించబోవడం.

కొత్త సత్కారాలు

పంచశీల సాంస్కృతిక సమితి వారు జనవరి 1 వ తేదీన హైద్రాబాద్‌లో టి. ఎల్. కాంతారావును సన్మానించి "నటు ప్రపూర్ణ" బిరుదు ప్రదానం చేశారు.

కేంద్ర మంత్రి దామోదరం సంజీవయ్య, ఆంధ్ర నాటక సంగీత అకాడమీ అధ్యక్షులు శ్రీ పసల సూర్యచంద్రరావు ఆమధ్య మద్రాస్లులో బహు వేషధారి డాక్టర్ చంద్రశేఖరం సన్మాన సభలో ప్రసంగిస్తూ కళ కళకోసమే అని యెంచిన ఉత్తమునిగా ఆయనను కీర్తించారు.

జనవరి ఎనిమిదిన హైదరాబాద్‌లో సెవెన్‌స్టార్స్ సిండికేట్ శివాజీ గణేశన్‌ను సన్మానించింది.

కొత్త పేర్లు

పద్మశ్రీ వారు తమ చిత్రానికి "ప్రాణమిత్రులు" అని నామకరణం చేశారు. ధనికునిగా జగ్గయ్య, కార్మిక నాయకునిగా నాగేశ్వరరావు నటిస్తున్నారు. ఒకరి కొకరు ప్రాణమిచ్చి ఒకరి ప్రాణం మరొకరు తీసుకొనే పరిస్థితిని చూపించే కథను ముళ్ళపూడి వ్రాయగా పి. పుల్లయ్య చిత్రీకరిస్తున్నారు.

సురేష్ పిక్చర్స్‌వారు ఈ నెలలో ప్రారంభించిన చిత్రానికి "మాయలాడి" అనే నామకరణం చేశారు.

ఎస్ వి ఆర్ పిక్చర్స్ (రంగారావు సంస్థ) తమ చిత్రానికి "చదరంగం" అనే పేరు పెట్టారు.

గౌతమీ వారి చిత్రం పేరు "నిర్దోషి".

మరికొన్ని ....

వీనస్ పద్మిని కంబైన్స్‌వారి సాంఘికం వి. మధుసూధనరావు దర్శకత్వంలో శీఘ్రగతిని తయారౌతున్నది. రంగారావు, అంజలి. కృష్ణ శోభన్‌బాబు మొదలైనవారు తారాగణంలో కలరు. రచన : ఆరుద్ర.

టైగర్ ప్రొడక్షన్స్ నిర్మించే నేర



ఇందిరా ప్రొడక్షన్స్ "రతీమన్మథ" చిత్రంలో ఎస్. వి. రంగారావు

పరిశోధక చిత్రంలో కృష్ణ, కె ఆర్ విజయ ప్రధాన భూమికలు నిర్వహిస్తారు దర్శకుడు వి రామచంద్ర రావు రచన అనిసెట్టి

విజయవర్ధనవారి "అపాయంలో ఉపాయం"ను టి. కృష్ణ డైరెక్టు చేస్తారు. రచన: ఏ. నరసింహమూర్తి.

రాగమంజరీ ప్రొడక్షన్స్‌వారి భయోత్పాదక చిత్రం "భయంకర పిశాచి"కి గురుదేవ్ దర్శకుడు. కథ : కొమ్మూరి సాంబశివరావు.

శ్రీరామాపిక్చర్స్‌వారు "పార్వతీ పరమేశ్వరులు", సుచిత్రా వారు "చిన్నారి మనసులు", మారుతీ ప్రొడక్షన్స్‌వారు "ద్రౌపదీ వస్త్రాపహరణం" నిర్మించబోతున్నారు.

"అర్ధరాత్రి", "సరస్వతీ శపథం", "వీరపూజ", "సత్యమేజయం", "గృహలక్ష్మి", "ఇద్దరు మొనగాళ్ళు" విడుదలకు సిద్ధంగా వున్నాయి.

విభిన్న భూమికలలో రామారావు

రామకృష్ణ-ఎన్. ఏ. టి. కంబైన్స్ వారు ఈసారి "చాణక్య శపథం" నిర్మించబోతున్నారు. చాణక్యునిగా రామారావు నటించబోతున్నారు.

ఆయన పెద్ద కృష్ణుడుగాను, ఆయన కుమారుడు హరికృష్ణ చిన్న కృష్ణుడుగాను నటిస్తున్న "శ్రీకృష్ణావతారం" శ్రీఘ్రగతిని తయారౌతున్నది



వాసూ మూవీస్ వారి

"మా వదినలో"

కృష్ణకుమారి, మాస్టర్‌బాబు, బేబి మల్లిక



"వీర ప్రతిజ్ఞ' చిత్రంలో ఆనంద్, కె ఆర్. విజయ

విజయావారి ఉమా చండిగౌరి శంకరుల కథ లో మూడు రూపాల శక్తిని ఎదుర్కొనే ఈశ్వరుడుగా పాత్ర ధరిస్తున్నారు

"కంచుకోట'లో చిన్న జానపద వీరుని భూమికను, జి. వి. జివలంకల "భువన సుందరి కథ"లో హాస్యవాతావరణంలో వీరునిగాను, గౌతమ్ వారి "నిర్దోషి"లో డ్యాషింగ్ డిటెక్టివ్ చిత్ర నాయకునిగాను నటిస్తున్నారు. స్వంత చిత్రం "ఉమ్మడి కుటుంబం."

వీర ప్రతిజ్ఞ

శ్రీ తిరుమలా పిక్చర్స్ వారి ప్రథమ జానపద చిత్రం "వీరప్రతిజ్ఞ" త్వరలో ఆంధ్ర అంతటా విడుదల కానున్నది. ఆనంద్, కె ఆర్. విజయ, రాజశ్రీ, ఏ కె దేవర్, ప్రధాన పాత్రలు పోషించారు. దర్శకుడు జి.ఆర్. నాథన్, మాటలు–పాటలు. అనిసెట్టి, సంగీతం టి డి. ఎంగప్ప, వేలూరి, నిర్మాతలు ఎ. శ్రీరామమూర్తి, సత్యనారాయణ

* * *

"భక్తప్రహ్లాద"

హ్లాదము కలిగించువాడు ప్రహ్లాదుడు. ఏ. వి. యమ్. ప్రొడక్షన్స్ నిర్మించిన ప్రహ్లాద కథా చిత్రం కూడా ఆహ్లాదకరమైంది.

కన్నుల కింపైన సెట్లు, నేత్రానందకరమైన సమ్మేళనం, చిన్నారి పాప, ముత్యాల పలుపరుస, ముద్దు మాటల బేబీ రోజారాణి సహజ నటన, ఇతివృత్త స్థాయికి తగిన సులభ గ్రాంథిక సంభాషణలు, బాల మురళీకృష్ణ గాత్రం, కొన్ని సందర్భాలలో రంగారావు, అంజలీ నటన ఏ. వి. ఎమ్. వారి చిత్రానికి ఆదరాభిమానాలు సమకూర్చుతాయి.

ఈ కాలపు సినిమా అవసరాలు తీరడానికా అన్నట్లు నృత్యాలు కూడా పుష్కలంగా చొప్పించబడ్డాయి.

ఆధునిక సినిమా విజ్ఞానానికి నిదర్శనా లన్నట్లుగా నారదుని గగన విహార ఘట్టాలు, ఇంద్రసభ, వైకుంఠ సన్నివేశాలు కొత్తదన మిచ్చాయి.

భాగవత కథను యథాతథంగా, సశాస్త్రీయంగా అనుసరించి సినిమా కథ అవి అసభ్యతకు దిగకపోయి నందుకు నిర్మాతలను, దర్శకుడు చిత్రపు నారాయణమూర్తి, రచయిత డి వి. నరసరాజుగారలను అభినందించక తప్పదు. నారదుని భూమికకు బాల మురళీకృష్ణ ముఖబింబం సినిమా అనుగుణమైనది కాకపోయి నప్పటికీ సంగీతంలో ఆయన విద్వత్తును గౌరవించి ఉపయోగించడం మరింత అహ్లాద కరం.

చిత్రం నిడివి మరీ ఎక్కువ కాడం, తన్మూలంగా ప్రహ్లాద భూమికకు తగు ప్రాధాన్యం లేకపోవడం నాటకీయతకు, మానసికసంఘర్షణలకు ఎంతో అవకాశం వున్నా పాటలు పద్యాలు దట్టించి, ఎక్కువగా నాటక ధోరణి అనుసరించడం "భక్త ప్రహ్లాద"లో ఒకించుక లోపంగా కన్పిస్తున్నది

ప్రహ్లాద కథ సర్వ విదితం కాబట్టి వివరించడం లేదు.

పైన చెప్పిన వారితోపాటు కళా దర్శకుడు ఎ. కె. శేఖర్‌ను, ఛాయాగ్రహణ దర్శకుడు విన్సెంట్‌ను, నిర్మాత ఏ. వి. మెయ్యప్పన్‌ను అభినందించడం సమంజసం.

***

Edited and Published by V. V. Raghavaiah
and Printed by him at Jyothi Printers.
Congres office Road, Governorpet, Vijayawada-2

హైదరాబాద్ మూవీస్ చిత్రం



దర్శకత్వం సాంబశివరావు
నిర్మాత P గంగాధరరావు

